...వత్సర చందా

... 12-0-0

...ప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO


సంపుటము 45

సంచిక 35

29.4-53

180

విజయ వైశాఖ శుద్ధ పూర్ణిమ; బుధవారం



గాంధీజీ ఛలోక్తి : నెహ్రూ హర్షం

(శ్రీ వి. సూరన్నగారు గీసిన గోటిచిత్రానికి ఫొటో)

—కృషీవలుడు   ఫోటో: శ్రీ వీరపనేని కుటుంబరావు—మద్రాసు.

విషయానుక్రమణిక

కాలక్షేపం

"ఆరంభింపరు నీచమానవులు
విఘ్నాయాస సంత్రస్తులై ;-
యారంభించి పరిత్యజింతు రురు
విఘ్నాయత్తులై మధ్యముల్ ;
ధీరుల్ విఘ్ననిహన్యమానులగుచున్
ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ
ప్రజ్ఞానిధుల్ గావునన్."

తా॥ విఘ్నములు రాగలవనే భయంచేత అధములైనవారు ఆరంభించనే ఆరంభించరు. మధ్యరకంవారుఆరంభిస్తారుగానివిఘ్నములు సంభవించినతర్వాత తమ ప్రయత్నం విరమిస్తారు. కాని ధీరులైనవారు ఎన్ని విఘ్నములచేత పీడింపబడినవారైనప్పటికీ, వారు ప్రజ్ఞానిధులు కనుక తాము ప్రారంభించినపనిని విడిచిపెట్టరు.

పట్టుదలగా పనిచెయ్యడం అంటే తనకు భగవంతుడిచ్చిన తెలివితేటలతో, శ్రద్ధగా త్రికరణశుద్ధిగా పనిచెయ్యడం. ఆ శ్రద్ధ ఆ పట్టుదలకూడా వారి వారి పూర్వజన్మ సుకృతంవల్లగాని, ఇప్పుడు చేస్తున్న కృషివల్లగాని, ఏకాగ్రచిత్త దీక్షాసాధకంవల్లగాని లభ్యమవుతూ ఉంటుంది. సంకల్పం కలిగినది మొదలు కొని, సంకల్పం సిద్ధించేవరకు ఆ సంకల్పం మూలంగా యీడ్వబడినవానివలెనే మానవుడు కృషిచేస్తాడు. మానవుడేకాదు-జంతుకోటిగాని, ప్రాణికోటిగాని, తమ సహజ ప్రవృత్తిచేతనే కొన్ని పనులను పట్టుదలతో కొనసాగిస్తాయి. శరీరసంబంధమైన ఆకలి దప్పులు అనేవి ఒకవిధమైన శరీర బాధల వంటివి - ఆకలి బాధతీరేవరకు, ఆకలికి తగిన ఆహుతి లభించేవరకు, పిల్లి యిల్లిల్లూ తిరుగుతూనే ఉంటుంది. ఏగోడ గూడులోనైనా పెరుగుగాని పాలుగాని భక్ష్యాలుగాని ఉన్నవేమో అని వెతకి వెతకి ఉట్టిపై కెక్కియైనను తన పొట్టనింపుకొని పోతుంది. మృగరాజైన సింహము అరణ్యం అంతా తానుతిరిగి తిరిగి గర్జించి గర్జించి ...మృగములను బెదరగొట్టి, అవి అటు యిటు పోతున్న సమయంలో వాటిని వెంటవేటాడి చీల్చి చెండాడి, భక్షించి క...నింపుకొని, ఆకలితీరినపిమ్మట యీ...దండయాత్ర చాలించి తన కొండగు...తిరిగి చేరుతుంది. ఇది కేవలము దేహస...ధమైన వాంఛ - ఆ మృగరాజుకు ...ఆ వేటటు వంటిది యీ దండయా...సంకల్పమును కలుగజేసింది. ఆకోరిక తీ...రకు పట్టువిడువక ప్రయత్నం సాగిం...

ఇటువంటికోరికలు మృగరాజ...కాదు - రాజులకుకూడా ఉంటాం...చిన ప్రపంచ మహాసంగ్రామం ఎం...జరిగింది ? ఆ మహాసంగ్రామమును హిట్ల...ఎందుకు ప్రారంభించాడు ? ...ప్రారంభించానని ప్రకటించాడు? ...రాజ్యములో జర్మనుల జనసంఖ్య ఎ...పోయినదనిన్నీ అందువల్ల ప్రపంచం...యితర ఖండాలలోనూ, యితర దేశాలలోను జర్మనులు విస్తరించి కాపురము...ఏర్పాటుచేసికోవలసి యున్నదన్నాడు.

ప్రపంచంలోని అనేక రాజ్యాల...బ్రిటిష్ సామ్రాజ్యం విస్తరించిఉంది. బ్రిటిష్‌వారి సామ్రాజ్యం ప్రపంచమందు అంతటను విస్తరించి ఉంది. అ...రికా ఖండంలోను ఆఫ్రికాఖండంలో...ఆసియా ఖండంలోను, ఆస్ట్రేలియా ఖండ...లోను, ఎక్కడ చూచినా బ్రిటిష్‌వారి రాజ్యాలు ఉన్నాయి. అధినివేశ రాజ్యాలు, సంస్థానరాజ్యాలు, ...రాజ్యాలు, రక్షితరాజ్యాలు, రేవులు,...వగైరా అనేకం ఉన్నాయి - ప్రప...అంతటను, వాని రాజ్యం విస్తరించిన వల్ల, వారి సామ్రాజ్యంలోని ఏదో ప్రాంతంలో సూర్యుడు ప్ర...ఉంటాడు. అమెరికాలో రాత్రి ...ఇండియాలో వారి రాజ్యమందు

యంలో పట్టపగలై సూర్యుడు ప్రకాశిస్తూ ఉండుటచేత, బ్రిటిష్‌వారి సామ్రాజ్యం "రవి యస్తమించనిరాజ్యం" అన్నారు. ఇల్లాంటి ప్రపంచవ్యాప్తరాజ్యం వారికి ఉండడంవల్ల ప్రపంచంలో ఏరాజ్యంలోనికైనా బ్రిటిష్‌వారు వెళ్ళి ఏదోవ్యాపారం చేసి హాయిగా సుఖజీవనం చేయడానికి విశాలావకాశం ఉంది. అన్ని రాజ్యాలలోని సమస్త వస్తు సంపదలను యథేచ్ఛగా దిగుమతి చేసికొని, అనుభవించి అష్టయిశ్వర్యములతో యిష్టమృష్టాన్నములను ఆరగించారు. తమ ఇంగ్లండు దేశంలో తమ ఫ్యాక్టరీలలో తయారైన సరకులను అనగా మాంచెస్టరు మిల్లులలోని వస్త్రములను కవెంట్రీలో తయారైన సైకిళ్లను, బర్మింగుహాంలో తయారైన యినుప సామానులను యింజనులను యిండియా మొదలైన రాజ్యాలకు సప్లయిచేసి లాభాలు [illegible]శించారు. మనజిల్లాబోర్డులు మ్యునిసిపాలిటీలు మొదలుకొని, రాష్ట్రప్రభుత్వాలు సహా కేంద్రప్రభుత్వంవరకు ఆస్పత్రులకు కావలసిన మందులను ఇంగ్లాండు నుంచి తెప్పించుకోవలసినదే - ఈ విధంగా వారు నూరిపోసిన మందులు మన తల కెక్కేటట్లు చేశారు. వారిమీద మోజు, వారిమీద వ్యామోహం కలిగేటట్లు చేశారు. ఈ రోజున కూడా ఇంగ్లీషుమందులు, ఇంగ్లీషు వైద్యంతప్ప, మన స్వరాజ్యప్రభుత్వంలోకూడా దేశీయ వైద్యశాస్త్రం అనేది ముందంజ వేయగల్గిందా ?

ఆయుర్వేదవైద్యంలో అమృతతుల్యమైన సంజీవివంటి మూలిక లున్నవని మన ప్రాచీన వైద్యగ్రంథాలలో వ్రాసిన విషయాలను విమర్శించడానికీ శోధించడానికీ మన ప్రభుత్వం ఎంత శ్రద్ధవహిస్తోంది? నిన్న మొన్న వెలసిన "పెన్సిలిన్" యింజక్షనుల మందును తయారుచేయడానికి యీ దేశంలో అప్పుడే ప్రత్యేకంగా ఒక ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తున్నారు. ఈ విధంగా బ్రిటిష్‌వారు మనకు నూరిపోసిన మందుల మూలంగా మనము ఆత్మజ్ఞానంలేని మందులమైనాము. బ్రిటిష్‌వారు భారత దేశాన్ని ఒక పెద్ద ఏనుగవలె చూచారు. దీనిని కరింద్రమువలె పరిగణించి దీనికి వల్లమందు మాత్రవేసి మచ్చికచేసి, గజారూఢులైనారు. తమ మాంచెస్టరు గుడ్డలను బహిష్కరిస్తామని భారతీయులు భీష్మిస్తే, అట్టి బహిష్కరణలు చేసినవారిని బంది ఖానాలలో పెట్టి బాధించారు. ఖద్దరు కట్టినవారిని గాంధీటోపీ పెట్టినవారిని, దుడ్డుకర్రలతో కొట్టి అడ్డమైన దుర్మార్గాలు చేసి, మంగళసూత్రాలుకూడా తెంపి చాలా అమంగళములుచేసి, పాంచాలీ పరాభవం అనే నాటకం ఆడినవారికి కూడా అంతు వేశారు.

ఇదంతా బ్రిటిష్‌వారు ఎందుకు చేశారంటే, ప్రపంచంలోని తమ రాజ్యాలు బాగా విస్తరించి తమ అధికారం నిరాఘాటంగా చలాయిస్తూ ఉండడానికి. ఈ రాజ్యాభిలాష ఎందుకంటే, ఆయా రాజ్యాలలోని వస్తుసంపదను హాయిగా కాలుమీద కాలువేసికొని అనుభవించడానికి. ఇతర ప్రాంతాలలోని తమ రాజ్యాలలోకి విస్తరించి నివాసాలు ఏర్పరచుకోవచ్చు - తేయాకుతోటలు, కాఫీతోటలు, రబ్బరు తోటలు వేసికొని లక్షలు, కోట్లు గడించవచ్చు. లేదా అక్కడ పెద్ద ఉద్యోగాలు సంపాదించి షాపులు పెట్టి జీవనోపాధికి లోటులేకుండా జీవించవచ్చు. దొర, దొరసాని కలిసి మోటారుకార్లలో విహరించవచ్చు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా భుక్తికి లోపంఉండకూడదు. బ్రిటిష్‌వారి వ్యాపారం ఖండఖండాంతరములందు నిరాఘాటంగా సాగుతూ ఉండాలి. అందుకొరకై సముద్రాధిపత్యంకూడా వీరికే ఉండాలి. సముద్రవ్యాపార రహదారీలకు ఆయువుపట్టులైనటువంటి సూయజ్ కాల్వ వీరివశంలో వుంది. జిబ్రాల్టరు జలసంధివద్ద కోటలు బురుజలు వారివి - సింగపూరువద్దనున్న జలసంధివారికి హస్తగతమై ఉంది. ఈ రీతిగా సముద్రాధికారం అంతా వారిది. ప్రపంచంలో విస్తరించియున్న వివిధ ఖండాంతర రాజ్యాలువారివి-

కాని జర్మనీకి యిట్టిఅవకాశాలు లేవు. మొదటి ప్రపంచసంగ్రామ కాలమందు ఆఫ్రికా ఖండంలో నైరృతిభాగంలో జర్మనీకి కొన్ని వలసరాజ్యాలు ఉండేవి. మొదటి ప్రపంచసంగ్రామంలో జర్మనీ ఓడిపోగానే, ఆ జర్మను వలసరాజ్యాలను నానాజాతిసమితి వశపరచుకొని, బ్రిటిష్‌వారి రక్షణలో ఉంచింది. జర్మనీ తాలూకు వలసరాజ్యాలను తిరిగి యిచ్చివేయవలెనన్నాడు హిట్లరు- సర్వసముద్రాధిపత్యము బ్రిటిష్‌వారికొక్కరికే ఉండడానికి వీలులేదన్నాడు. ప్రపంచంలోని వేర్వేరు రాజ్యాలలోని వస్తుసంపత్తిని అన్ని రాజ్యాలవారు సమానంగా తెప్పించుకొని అనుభవించడానికిఅవకాశం ఉండవలెనన్నాడు. జర్మనులు కూడా ఆ వస్తుసంపత్తిని బ్రిటిష్‌వారితో సమానంగా అనుభవించవలెనన్నాడు. జర్మనీలో జర్మనుల జనసంఖ్య అత్యధికంగా ఉందిగనుక ప్రపంచంలోని యితర రాజ్యాలలోనికి విస్తరించి సుఖంగా జీవించేటందుకు అవకాశాలు ఉండవలెనన్నాడు.

ఇటలీకూడా అప్పుడు జర్మనీతో ఏకమైంది. ఇటలీ దేశస్థులుకూడా ఇటలీలో క్రిక్కిరిసి ఉన్నారనిన్నీ, వారికి సుఖజీవనం చేయడానికి తగినంత చోటులేదనిన్నీ, బ్రతుకడానికి తగినంతచోటు యితర రాజ్యాలలో తమకు కావలసియున్నదనిన్నీ, ఇటలీ ప్రభుత్వ నియంతయైన ముసలోనీ వాదించాడు. "లైబెన్ సరామ్" (లివింగ్-స్పేస్ = జీవించేటందుకు జాగా) కావాలని వాదించాడు.

ప్రపంచ మహాసంగ్రామాలు ఎందుకు సంభవించాయని తరచిచూస్తే, భుక్తికోసం సంభవించాయి. మృగరాజువలె యితర జంతువులను పట్టుకొని, తనపొట్టబెట్టుకోవలెనని బ్రిటిష్ సింహం ప్రయత్నించింది. అడవిలోని జంతువులనన్నింటిని బ్రిటిష్ సింహమే తిన్నట్లయితే, నాగతి ఏమిటి? అని హిట్లరు వ్యాఘ్రం గాండ్రించింది. దానితోబాటు ముసలోని శివంగికూడా రణరంగంలోకి దిగింది.

ఆ మహాసంగ్రామం ఆరంభించిన అడాల్ఫ్ హిట్లరు పట్టుదల కలవాడు. యమపట్టుదల కలవాడు. విఘ్నాలు వస్తాయనే భయం లేకుండా ఆరంభించాడు. అటోయిటో తేలేవరకు ఆరంభించిన ఉద్యమం ఆపలేదు. అయితే, అంతమాత్రంచేత అతడు బ్రహ్మండ నాయకుడైనాడా? ఏమీ కాలేదు. భస్మం అయినాడు.

జర్మనీలో ఉన్న జర్మనుల జనసంఖ్య ఎక్కువైనదనిన్నీ వాళ్లందరూ సుఖంగా బ్రతుకడానికి తగినచోటు లేదనిన్నీ వాదించి మహాసంగ్రామం చేశాడు, యుద్ధం అంతా అయిన తర్వాత లెక్కచూస్తే 66 లక్షల మంది జర్మనులు యుద్ధములో మరణించారు. కొంత జనభారం జర్మనీకి తగ్గిపోయింది. ఆవిధంగా - హిట్లరుయొక్క కోరిక ఒకవిధంగా సిద్ధించింది. జర్మనులు సుఖంగా జీవించడానికి జర్మనీదేశం వారికి చాలడం లేదని వాదించి యుద్ధంచేసిన జర్మనుజాతి యీనాడు జర్మనీలోనే ఉండి కలియో గంజియో కలిగిన మాత్రముగా తిని మనుచున్నది. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసీ" అని ఎంచి, స్వర్గంకంటె జన్మభూమియున్నూ కన్న తల్లియున్నూ గొప్పవని గ్రహించి, యింద్రభోగాలకు ఆశపడకుండా. అన్యరాజ్యాలకై అఱ్ఱుజాపకుండా, ఇప్పుడేవిధంగా జర్మను జాతి స్వదేశంలో సుఖజీవనం చేయగలుగుతోంది? భారతదేశం చునభుక్తంలో లేకపోతే, మనకిక భుక్తిలేదని తల్లడిల్లిన తెల్లవాళ్ళు నేడు తమ తల్లిదేశంచేరి కడుపులో చల్ల కదలకుండా ఎల్లా జీవింపగల్గుతున్నారు?

కోరికలు తీగెలు సాగినట్లుగా సాగుతూ ఉంటాయి. కోరికలు సిద్ధించడానికి కోటి

★ కాలక్షేపం ★

ఉపాయాలు ఆలోచించి, అఖిల ప్రపంచ సంగ్రామంకూడా మానవుడు చేస్తాడు. ఈకార్యదీక్ష అంతా ఎందుకయ్యా అంటే, కామ్యార్థం. కాని ధర్మదీక్షఅనేది నిష్కామకర్మ.

అంతేకాదు. ఆస్తి సంపాదించిన తర్వాత, సదరు ఆస్తికి వారసులు కూడా కావాలి. ఇదికూడా ఆస్తికి సంబంధించిన కోరికయే. పుత్రసంతానం కోసం పరితపిస్తాడు. వివాహం చేసుకుంటాడు. వరుసగా ఆడపిల్లలే కలిగినప్పటికీ, యింకా పుత్రసంతానం కలుగుతుందనే ఆశ అతనిని విడిచిపెట్టదు. ఇంకా అదే పట్టుదలతో ఉంటాడు. మొదటి భార్యవల్ల మొగపిల్లలు లేకపోతే, మరొకభార్యను వివాహంచేసుకుంటాడు. రెండోభార్యకుకూడా పుత్రరత్నాలు పుట్టకపోతే తానే రత్నపురుష లేహ్యం తింటాడు. తనవల్ల తన భార్యల వల్ల దశరథమహారాజు పుత్రకామేష్టి అనే యజ్ఞంచేసి ఒక చక్కని పాయసం తయారుచేసి, తన భార్యలకు తయారు పెట్టినట్లుగా పెట్టినపిమ్మట, పుత్రరత్నములు పుట్టిరి. వ్యాసులవారివల్లనైనా సంతానంపొంది, రాజ్యానికి వారసులు లేరనే లోపం ఒకప్పుడు తొలగింపబడింది. పుట్టినవాడు ఔరసుడు అవునా కాదా అనే తగాదా ఎవ్వరూ చెయ్యలేదు ఆనాడు. జ్ఞాతు లెవ్వరూ వ్యాసులవారిని క్రాసుపరీక్ష చేయడానికి కోర్టుల కెక్కించలేదు. ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే, కామ్యార్థములైన విషయములలో పట్టుదల అనేది పుత్రకామేష్టి చేయడంవరకు సాగుతుంది.

పగబటిన త్రాచుపాము కాటువేసే వరకు కంటికి నిద్రలేకుండా తిరుగుతుంది. ఇది కూడా కామ్యార్థములవంటి ఆవేశమే గాని మరొకటి కాదు. చింతామణి ఇంటికి చేరవలెనని అర్ధరాత్రివేళ గాలివానలో ఏరుదాటి, గోడదాటి వెళ్ళిన బిల్వమంగళునియందు పట్టుదల ఉంది. అసాధారణమైన కార్యదీక్ష ఉంది. కాని యీ దీక్ష కామేచ్ఛ - దీనికి మానవుడు వశుడై ఉంటాడు. కాని అది మానవునకు వశమై ఉండదు. ధనంకోసం గాని, తన దేహ యింద్రియ వాంఛా వ్యాపార సంతృప్తి కొరకు గాని, సాగించే పనులు సాధించే ఉద్యమములు ఆ యింద్రియ కామేచ్ఛల సహజవృత్తిని మరింత వృద్ధిచేస్తాయి.

"తృప్తి దీర్చనికోర్కె—
తృష్ణనే పెంచు."

ఇటువంటి ఉద్యమములయందు సంకల్పసిద్ధి కలిగితే, అతడు అతిరథుడు మహారథుడు అవుతాడు. అతడా ప్రయత్నంలో ఓడిపోతే అతనికంటె అధముడు ఇంకొకడు లేడని లేవిడీ కొట్టుతుంది లోకం. కామ్యార్థమైన కార్యదీక్షలో నెగ్గినవానిదే ప్రజ్ఞ. ఓడినవాడు ఓటివాడు.

కాని, ధర్మ ప్రతిష్ఠాపనకోసం దీక్ష వహించి ఒక ఉద్యమం సాగించినట్లయితే అట్టి ధర్మంకోసం అవిరామంగా కృషిచేసి, హోరాహోరిగా పోరాడి తన సంకల్పమీడేరక తన తనువు చాలించినప్పటికీ, ధర్మసమరంలో అది అపజయం కాదు. అందుకనే గాంధిమహాత్ముడు సత్యాగ్రహి యైనవానికి అపజయమనేది లేదన్నాడు. ధర్మము కొరకై తన తనువు అర్పించగల్గుటయే సత్యాగ్రహి సాధించిన ఆత్మవిజయం అన్నాడు. ఒకవేళ అతని జీవితకాలంలోనే అతని సంకల్పం యీడేరినప్పటికీ, ఆ విజయం ఆ సత్యాగ్రహిది కాదు. "జయించినది సత్యాగ్రహి కాదు. జయించినది ధర్మం" అని గ్రహించాలి. సత్యాగ్రహి చేయగల్గినది ఏమిటంటే, ధర్మము అంటే ఏమిటో తెలిసికొని, దానిని తన జీవితధర్మంగా చేసికొని, ఆత్మ సాక్షాత్కారం పొందగలడు. ధర్మస్వరూపాన్ని జూచి ధన్యుడు కాగలడు. ఈ విధమైన ఆత్మ పరిపక్వం కామ్యార్థిగా ఉండి కార్యదీక్ష సాగించే వానికి ఉండదు. చింతామణి తల విరియబోసికొని, అలంకారాలూ పట్టుపీతాంబరాలూ లేకుండా సాదాచీర కట్టుకొని తన సహజ నిజరూపమును చూపించేసరికి బిల్వమంగళుడు ఆ సాక్షాత్కారానికి అవులించాడు. తెల్లబోయి డిల్లబోయి స్తంభించిపోయినాడు. "నీ తాళజాలనే" అని అదివరకు ఎట్లా ఆలాపన చేశాడో యిప్పుడు యీ నిజరూప సాక్షాత్కారానికి కూడా తాళలేక పోయినాడు.

కామ్యార్థమై ఏదో ఒక ఉపాసన ప్రతివాడూ పట్టులగా చేస్తూనే ఉంటాడు. పెళ్ళి కావాలని తపస్సు చేస్తారు. పెళ్ళి అయిన తర్వాత సంసారం అనేది సాక్షాత్కరించిన తర్వాత, ఆ నిజ సంసార దేవతా సాక్షాత్కారానికి తాళుకోలేరు. ఎందుచేతనంటే, కామ్యార్థమైన ఉపాసనవల్ల కలిగే ఆత్మ పరిపక్వం అంతమాత్రమే. తాను దేనిని ఉపాసన చేసినాడో, అది సాక్షాత్కరించేసరికి దాని నిజస్వరూపాన్ని మాడగల తాహతుగాని ఆత్మ పరిపక్వంగాని ఆ ఉపాసకునియందు కలుగదు.

ఈమధ్య ఒక ఊళ్లో కరణంగారి భార్యకు సంతానం లేక, ఆమె అనేక అశ్వత్థ ప్రదక్షిణాలు చేసింది. నాగేశ్వరుని శిలాప్రతిమలు చేయించి అనేకం ప్రతిష్ఠ చేసింది. ఆవిడ పేరు సుబ్బమ్మగారు. ప్రక్కయింటిలోని ఒక ముసలమ్మ సుబ్బమ్మగారి కొక సలహా చెప్పింది. చెరువు గట్టుక్రింద నొక పెద్ద పాము పుట్ట ఉన్నదనిన్నీ ఉదయము వంట అంతా చేసికొన్న తర్వాత ఏ పదిగంటలకో అక్కడికి వెళ్లి ఆపుట్టలో ప్రతిరోజూ పాలు పోసికొని, ఏదైనా ఒక అరటిపండు నైవేద్యంపెట్టి హారతి కర్పూరం వెలిగించి, పుట్టలో ఉన్న సుబ్బారాయునకు ఒక నమస్కారం చేస్తూ ఉండు అన్నది. "స్వామీ తండ్రీ! నీవు నాయందు అనుగ్రహించి ఒక్కసారి కనుపించి సాక్షాత్కరించు" అని ప్రార్థన చేసికో అంది. సుబ్బారాయుడు ప్రత్యక్షం అయినట్లయితే, నీకోరిక యీడేర్చుటకు సమ్మతిజచినాడని అర్థంచేసికో. అటుపైన నీకు తప్పకుండా కడుపునిండా బిడ్డలు కలుతారని' ఆ ముసలమ్మ చెప్పింది. అదేప్రకారంగా ఆ యిల్లాలు ప్రతిరోజూ చెరువు గట్టుపుట్ట వద్దకు వెళ్ళి పాలుపోసి నైవేద్యంపెట్టి హారతి యిచ్చి తన కోరిక చెప్పుకొని యింటికి వస్తోంది. ఒకనాడు యిదే విధంగా ఉద

"మా తాతగారి ఖడ్గం నా కంట పడినప్పుడల్లా నాకూడా యుద్ధంలోకి పోవాలని పిస్తుంటుంది."

"మంచిదే!"

"కానీ మా నాన్నగారి కొయ్యకాలు చూసినప్పుడల్లా కూడా 'ఎందుకొచ్చిన యుద్ధాలులే' అనిపిస్తూంటుంది."

యము 10 గంటలవేళ హారతి యిచ్చి, ప్రార్థనచేస్తూఉన్న సమయంలో ఆ పుట్టలోనుంచి చక్కని త్రాచుపాము బుసలు కొట్టుతూ పడగవిప్పి పైకి వచ్చింది. ఆ త్రాచుపామును చూచేసరికి సుబ్బమ్మకు గుండె నిబ్బరం పోయింది. ఆమెకు ఒళ్లంతా చెమటలు పోసి నిలువున నీరైపోయింది. గుండె దడదడలాడింది. కాళ్లు గజగజలాడినాయి. చేతులు వణికిపోయి, చేతిలోని పళ్లెం క్రిందపడిపోయింది. "అమ్మ బాబో!" అని ఒక్క కేక వేసి కూలబడిపోయింది. ఇంతలో ఆ చెరువు సమీపంగా ఎద్దులబండి తోలుకొని పోతున్న వెంకన్న ఆ కేకవిని వెనక్కి తిరిగిచూచాడు. మూర్ఛ వచ్చినట్లుగా నేల మీద కూలబడి ఉన్న సుబ్బమ్మగారిని చూచాడు. వెంటనే బండిని వెనక్కి త్రిప్పి పుట్టలోనుంచి వచ్చిన సుబ్బారాయుణ్ని చూడలేక సుబ్బమ్మగారు పడిపోయిందని గ్రహించి మెల్లిగా ఆమెను రెక్కలుపట్టి యీడ్చుకొనివచ్చి ఆ పళ్లెంతో సహా ఆమెను బండిలో ఎక్కించి కరణంగారింట్లో ఒప్పగించాడు. శైత్యోపచారాలు కొన్ని చేసిన తర్వాత ఆమె కళ్లు తెరచి చూచింది. అటు తర్వాత ఆ పుట్టవద్దకు తిరిగి ఆవిడ అడుగు పెట్టలేదు. తాను ప్రారంభించి పట్టుదలతో సాగించిన ఉద్యమం అంతటితో ఆపివేసింది. సుబ్బారాయుడు సాక్షాత్కారం అయ్యేవరకు పట్టుదలగానే చేసింది. ఆ సాక్షాత్కారం కోసమే దీక్షతో పూజ చేసింది. కాని, ఈసాక్షాత్కారం ఆమె భరించలేకపోయింది. ఆ సాక్షాత్కారాన్ని భరించగల ప్రజ్ఞ ఆ మనిషికి కలుగలేదు. ఎవనికైనా సరే, ఘంస్కారం. కలుగకుండా సంకల్పసిద్ధి కలిగితే, సర్వేశ్వరుడు ప్రత్యక్షమైనా, నిర్వీర్యుడవుతాడు. విఘ్నాలు రాకుండా విఘ్నేశునిపూజ చేసిన పురుషునకు విఘ్నేశ్వరుడు ప్రత్యక్షం కావడమే వానిపూజకు ప్రబల విఘ్నం అయినట్లయితే, సంకల్ప సిద్ధివల్లనే సంకల్పం వికల్పం అవుతుంది. సంకల్ప సిద్ధికోసం పట్టుదలగా పనిచేస్తూ "ప్రారబ్ధార్థము ఉజ్జగింపరు సుమీ" అనే మాట కామ్యార్థమైన కార్యదీక్షగలవారిలో చాలామంది విషయంలో చెప్పవచ్చు. కాని "ప్రజ్ఞానిధుల్ కావునన్" అనే మాట చెప్పడానికి వీలులేదు. ధర్మ విజయమునకై దృఢదీక్షా దక్షులైన ముముక్షువులగు మహాత్ముల విషయములో మాత్రమే "ప్రారబ్ధార్థము ఉజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్" అనే మాట వర్తింపజేసి పూర్తిగా కీర్తింప నేర్తుము. ★



చామరధారిణి

[పాట్నా మ్యూజియంలోని ప్రాచీన శిలాప్రతిమ ఆధారంగా శ్రీ సౌరి శేషయ్యగారు (తెనాలి) గీసిన రేఖాచిత్రం.]

మగవాడు - ఆడమనిషి

జీవితంలో నాలుగురోడ్ల జంక్షన్ దగ్గరకు వచ్చి ఎటుపోవాలో ఎరక్క అటూ ఇటూ చూస్తోన్న మూర్తి ఒకరోజున నిల్చున్నాడు మద్రాస్‌లో, మైలాపూర్లో, నాలుగురోడ్ల జంక్షన్లో, బస్సుస్టాండ్ దగ్గర్నే.

మూర్తిలో యవ్వనం ప్రవేశించింది.

కాని ఇంకా పోలేదు బాల్యం అతన్లోంచి.

అతణ్ణీ, అతడితోపాటు బస్ కోసం 'వెయిట్' చేస్తోన్న ఇంకో పదిహేను మందినీ మాడ్చి చంపుతోంది చెన్నపట్నపు ఎండ.

కావలసింది తప్పించి మిగతా బస్సులన్నీ వస్తున్నట్టున్నాయి. వచ్చినవన్నీ వెళిపోతున్నాయి.

ఎండ కాల్చి చంపుతూ నేవుంది.

మూర్తికి చిరాగ్గా ఉంటూ నేవుంది.

బస్సులకోసం కాసు కూర్చోడం, బస్సుల్లో నలిగిపోతూ నిల్చోడం, ట్రాముల కెక్కబ్రాకడం, రిక్షాల్లో తూలిపోతో పోవడం, ఎలక్ట్రిక్ ట్రెయిన్లో నలిగిపోవడం, అందరి కాళ్ళూ పట్టుకొందికి తిరగడం తిరగడం—

ఇలా జరిగిపోతోంది కాలం.

"ఉద్యోగంలేదు, సద్యోగంలేదు. ఈ వూళ్ళో ఏదీ దొరికేట్టులేదు. ఆఖరికి మంచినీటి చుక్కలయినా దొరకడం లేదు" అనుకున్నాడు రాని బస్సుకోసం నిరీక్షిస్తోన్న మూర్తి.

దువ్వుకున్న జుత్తు దువ్వుకోనట్టుగా వుంది. చొక్కా నలిగింది, మాసింది. పైజామా ఒక్కచోటే చిరిగింది.

లోకం అంతా ఆ చిరుగువైపే చూస్తున్నట్టు బాధపడుతున్నాడు మూర్తి.

వంటిమీద సరయిన బట్టలేదు. చేతిలో పుష్కలంగా డబ్బులేదు. నోట్లో తప్పులేని ఇంగ్లీషుముక్క లేదు. ఎవడు చూస్తా డీ వూళ్ళో నన్ను !!

ఉద్యోగంకోసం రామయ్యగార్ని చూద్దామని వస్తే ఆయన సుఖమైన వసతి కోసం ఎర్కాడు పోయారట.

రేపు అక్కడికి పోవాలి. ఇప్పుడు అప్లికేషన్ రుసుం చెల్లించడానికి గవర్నమెంటు వారి ఖజానాకి పోవాలి.

పోదల్చుకొన్న చోటుకి పోయే బస్సులు రావడం లేదు. వస్తే ఆగడం లేదు.

నే చస్తే ఈరోజున ట్రామెక్కను.

చిరాగ్గా నిల్చున్న మూర్తి విసుగ్గా అందరివైపూ చూసేడు. బస్సుకోసం చాలా మంది నిల్చున్నారు. అరవ ఫక్కీలో ఆరుగురు జరీ అంచు ధోవతులు కట్టుకొన్నారు. యూరపియన్ ఫక్కీలో, ఇద్దరు వులెన్ సూట్లు వేసుకొని లేని దర్జా తెచ్చుకోబోతున్నారు. ఒకే గొడుగు నీడని నిల్చొన్న ఇద్దరాడవాళ్ళూ ఎందుకోగాని తెగ నవ్వుతున్నారు. కాలేజ్ స్టూడెంట్లా కనిపించే ఆడమనిషి పొడవుగా ఉన్నాననే గర్వంతో పొడవుగా నిల్చొంది. మూర్తి దృష్టి ఆమె మీదపడి ఆమెమీదే ఉండిపోయింది. ఆమె ముఖం తీరూ, మేనిచాయా, చీర సొగసూ గుర్తించాక దృష్టి పడింది ఆమె చేతిలో వున్న పుస్తకాలమీద.

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

ఆడవాళ్ళు చదివేస్తున్నారు బియ్యేలూ ఎమ్మేలూ!!

ఆవిడ బస్సెక్కి కాలేజీకి వెళ్తుంది: నేను బస్సెక్కి ఖజానాకి పోవాలి.

ఏదో బస్సు వస్తోంది! ఆమెమీంచి కళ్ళు తీసేశాడు మూర్తి. బస్ ఇంకా దూరంలోనే వుంది.

"మిస్టర్ మిస్టర్" అని ఎవరో ఎవర్నో పిల్చేరు. అటు తిరిగేడు మూర్తి.

రంగుల గొడుగుకింద నిల్చొన్న కాలేజీ స్టూడెంట్లా కనిపించే పడుచు దగ్గరగా రమ్మంది, మూర్తిని. మూర్తి ఆశ్చర్యపోలేదు.

నిర్ఘాంతపోయేడు. కొంచెం తేరుకొని దగ్గరగా వెళ్ళేడు.

మాసిన చొక్కా ఇంకా మాసింది. చిరిగిన పైజామా ఇంకా చిరిగింది. కొట్టుకొనే గుండెలు ఇంకా కొట్టుకొంటున్నాయి. ఆవిడ తొందరపాటుతో మాట్లాడుతోంది.

"క్షమించి మరోవిధంగా అనుకోకండి. కాని అదిగో బస్ వచ్చేస్తోంది. ఈ వుత్తరం అర్జంటుగా పోస్ట్ చెయ్యాలి. ఇంతవరకూ మర్చిపోయేను. టైమయిపోతోంది. పోస్టు బాక్సు అదిగో అల్లక్కడే ఉంది. దయచేసి అందులో పడేద్దురూ" అందామె మూర్తితో, ఆత్రతతో, ఇంగ్లీషులో.

ఉత్తరం యేదో పోస్టు చెయ్యమంటోందని మాత్రం గ్రహించేడు మూర్తి.

పుస్తకం మధ్యనుంచి కవరుతీసి మూర్తి చేతికిచ్చిందామె, 'పోస్టు చెయ్యక ఏం చేస్తావ్' అనేధీమాతో.

నా బస్సుకూడా నీబస్సువెనకే వస్తోంది. అందులో పోయి నేను ఉద్యోగంకోసం ఖజానాలో డబ్బు కట్టాలి. ఆ బస్సు మించిపోతే ఇంకోటి వచ్చేట్టులేదు. రాకపోతే ఎండలో నిల్చొని చావాలి. ఈ వుత్తరం ఇంత అర్జంటా? తరవాత ఎందుకు పడేసుకోగూడదు? మెయిల్‌కి సాయంకాలం వరకూ వేళవుంది కదా అనే మాటలు అందామనే తోచలేదు మూర్తికి.

చుట్టూ నిల్చొన్న మొగాళ్ళంతా "ఏంవదృష్టం, ఏంవదృష్టం" అన్నట్టుగా చూస్తున్నారు.

ఆమె వైపూ వాళ్ళవైపూ చూసి తపాలా పెట్టెవైపు నడిచేడు మూర్తి. నడుస్తూ నడుస్తూ కవరుమీద అడ్రస్ చూసేడు.

కలకత్తాలో, ఏదో నంబర్న ఏదో వీధిలో ఉండే "అనిల్‌కుమార్" అనే వాడికి "మోహిని, మద్రాస్"నుంచి వెళ్తోందా వుత్తరం.

అడ్రస్ చదవడం తప్పేమో, ఆవిడ చూసిందేమో అనే అనుమానంతో వెనక్కి తిరిగిచూసేడు. వేగిరం వెళ్ళమని సంజ్ఞ చేసిందావిడ.

ఏకంగా పరుగే తీసేడు మూర్తి.

తపాలా తీయడానికి బంట్రోతు వచ్చేడు. వగర్చుకొంటూ వెళ్ళి ఉత్తరం అందజేసేడెలాగయితేనేం మూర్తి అతడికి. ఉత్తరం ఇచ్చేశాక వెనక్కి తిరిగేడు.

కదుల్తూన్న బస్సుగుమ్మంలో నిల్చొని ముణిచిన రంగుల గొడుగు చంకన పెట్టి రుమాలు వూపిందావిడ మూర్తిని చూస్తో. ఏం చెయ్యాలో తోచని మూర్తి రెండు చేతులూ ఊపేశాడు.

బస్సు దూరంగా పోయింది. ఆమె గుమ్మంలోంచి బస్సులోకి పోయింది.

ఈవిడే కాబోలు మోహిని !!

ఎక్కడ వుంటోంది? ఏమిటి చదువుతోంది?

అనిల్ కుమారు దెవరు? ఈవిడకీ వాడికీ ఉన్న సంబంధం ఏమిటి?

"ఎందుకోగాని ఈవిణ్ణి చూస్తే నాకు ఎంతో ఇష్టంగావుంది" అనుకున్నాడు మూర్తి.

'అనిల్ కుమార్'ని తల్చుకొంటే ఇష్టంగా లేదు.

"అనిల్ కుమారేమిటి అనిల్ కుమారు? షోకు పేరు. ఎందుకూ పనికిరాని షోకిల్లా రాయళ్ళు పెట్టుకొనే పాడుపేరు." అనిల్ కుమార్ కి ఆవిడ ఉత్తరం రాసినందుకు విచారించినా తనచేత ఆవిడ ఆ ఉత్తరాన్ని పోస్ట్ చేయించినందుకు గొప్పపడిపోయేడు మూర్తి.

తన బస్సు పోయినందుకు మూర్తి విచారించనే లేదు. ఏదో ఘనకార్యం చేసినట్టుగా, ఎంతో సంతోషంతో, సంతృప్తితో మరో బస్సులో బైరాయించేడు మరో అరగంటకి. తరువాత డబ్బు కట్టడానికి ఖజానాలో ఉన్నంతసేపూ, తిరిగి యింటికి పాతమాంబళం వెళ్తున్నంతసేపూ, మధ్యాహ్నం ఇంట్లో ఉన్నంతసేపూ, సాయంకాలం పానగల్ పార్కులో కూర్చున్నంతసేపూ మోహిని గురించే, ఆమె గురించే ఆలోచిస్తూ కూర్చున్నాడు.

ఆలోచిస్తూంటే సుఖంగావుంది.

అంతా ఏదో క్రొత్తగా కనిపిస్తోంది.


ఉద్యోగం దొరకని, మంచినీళ్ళయినా దొరకని చెన్నపట్నం పాడు పట్నంలా కనిపించడం లేదు.

కంపుకొట్టే పాతమాంబళం సందూ, మూడు గదుల మేనమామ యిల్లూ, ఎప్పుడూ మాసిన గడ్డంతోవుండే మేనమామా, చస్తేనే గాని పోని స్ఫోటకంమచ్చల మేనత్తా, ఎప్పుడూ తనతో ఆమె, ఆమెతో తను మాట్లాడ్డానికి సందేహించే పదహారేళ్ళ మరదలు వరహాలూ, అన్నీ, అంతా ఎంతో అందంగా, ఆనందంగా మూర్తికి కనిపించేయి, కనిపించేరు. రాత్రి మేనమామ ఎందుచేతనోగాని ఎక్కడికో వెళ్ళేడు అప్పుడప్పుడే. చింతమొద్దులా పడుకొంది మేనత్త అప్పుడే.

"నేను నిద్ర పోతాను. నాన్నగారికి తలుపు తియ్యాలి ఎవరో పకరు" అంది పక్కగదిలో వున్న వరహాలు మూర్తికి వినిపించేలా.

ఇది నన్ను ముద్దుగా "బావా" అని ఎందుకు పిలవకూడదు? అనుకున్నాడు మూర్తి.

మూర్తికి ఆవేశంగా వుంది. ఉత్సాహంగా వుంది. గర్వంగా వుంది.



"అయితే వెంటనే వెళ్లి వాళ్లిద్దర్నీ చితకతన్ను వేగిరం... వేగిరం..."

"వరహాలూ! ఇలా రా" అన్నాడు మెల్లిగా, అత్తని లేపకుండా, వరహాలుకి వినిపించేలా.

మెల్లిగా ఉచ్చరించినప్పటికీ మాటల్లో అధారిటీ కనిపిస్తోంది, వినిపిస్తోంది.

"ఇలారా వరహాలూ!"

ఇంతకాలం పలకరించడానికి భయపడ్డ వాణ్ణి ఇవాళ దీన్ని ఎలా పిలుస్తున్నాను?! మారుమాటాడకుండా ఎలా వచ్చింది వరహాలు పిలవగానే?!

"ఎందుకు బావా?"

"ఇందుకు"

చుట్టూ చేతులు వేస్తే ఎందుచేత ఊరుకొంది వరహాలు?!

క్రొత్తగా ఆడదాన్ని అదుముకొన్న మైకంలో కళ్లు మూసి "మోహినీ! మోహినీ!" అన్నాడు అస్పష్టంగా.

వరహాలు కూడా అంతా క్రొత్తే అయినప్పటికీ "మోహి నెవరు?" అని అడిగింది ఆడదాని అప్రమత్తతతో.

"నువ్వే! మోహిన్నా ఈ స్నావ్" అన్నాడు మూర్తి, ఒక్కసారిగా తెలివి

తెచ్చుకొని, అలాటి సమయాల్లో మొగవాడికి ఉండే అబద్ధపు సైజంతో.

ఇంతలో మామయ్య తలుపు తట్టడం జరిగింది.

రాత్రి పడుకొనే ముందు మూర్తి కళ్ల ముందు మెరిసింది, మద్రాస్ ఎండలో రంగుల గొడుగు నీడని నిల్చున్న మోహిని. రాత్రంతా కలల్లేని నిద్రపోయేడు.

మర్నాడు అన్నాడు మామయ్య.

"మరయితే దబ్బేలానూ కట్టి అప్లికేషను పడేశావుకదా! ఎగ్మూరు పోయి ఆ రామయ్యగారి కూడా ఓ సారి కనిపించు. దర్శనం చేసి బతిమాలితే ఏదైనా సాయం చేస్తా డాయన."

ఎగ్మూరు వెళ్ళి రామయ్యని చూడాలని లేనేలేదు మూర్తికి. మైలాపూర్ పోయి మోహిని కనిపిస్తుందేమో చూడాలని వుంది.

"సరే" అన్నాడు.

రెండేళ్ళు కష్టపడి చదివి స్కూల్ ఫైనల్ సాధించి ఇంటర్మీడియేట్ చదువుదామని ఉబలాటపడుతూవుంటే, "మీ మావఁదగ్గరకి పోతే అతనే వయినా ఉద్యోగం ఇప్పిస్తాడు. వెళ్లు వెళ్లు, మెడ్రాస్ వెళ్లు" అన్నాడు నాన్న.

దాన్తో పై చదువుకి వెళ్దామన్న సరదా అలానే వుండిపోయింది. మద్రాస్. చూద్దామనే సరదాతో మద్రాస్ వచ్చి రావడంలో ఆ సరదా తీరిపోయింది.

పాతమాంబళంలో పగలే చీకటిగా ఉండే గదిలో కూర్చొని "ఛీ, పాడువూరు. పాడువెధవ్వూరు. పనికిమాలిన వూరు" అని మద్రాస్‌ని నిందించుకున్నాడు మూర్తి.

ఇంతవూళ్లోనూ యాభైరూపాయీ లిచ్చే ఉద్యోగంకూడా దొరకదు. దొరికినా, ఆ జీతం బతకడానికి చాలదు. అదయినా లక్షాయాభైమంది కాళ్లువట్టుకొంటేనేగాని దొరకదు. కాళ్లుబట్టుకోడానికి రోజుకి అధమం పదిమైళ్లయినా తిరిగి తిరిగి చావాలి.

ఎగ్మూరు వెళ్తానని చెప్పి మైలాపూర్‌కి బయల్దేరిన మూర్తి "ఛీ! పాడువూరు" అనుకోలేదు.

ఉద్యోగం లేదు సరే. కాని, వూరంత పాడుగా లేదు.

మాంబళం బస్ టెర్మినస్‌దగ్గర కాఫీ హోటేల్లోకి చకచకా పోతున్నాయి రెండు సిల్కు చీరలు.

"పొడుగుటావిడ మోహినికాదుకద"అని పరిశీలించి చూసేడు. అవిడ మోహిన్లాలేదు. అవిడ మోహిని కాదు.

మోహిని మాంబళంలో ఉండదు. కాని, మైలాపూర్లో మాత్రం ఉంటుందని నిర్ధారణ ఏముంది?

ఇంతపట్నంలో ఆవిడ మళ్ళీ కనిపించడం అసంభవమేమో? మోహిన్ని సులభంగా వెతకడానికి వీల్లేకుండా మద్రాస్ నగరం తగుమాత్రం పెద్దదిగా అయినా ఉండడం మూర్తికి ఇష్టంలేకపోయింది.

"ఛీ! పాడువూరు" అని మళ్లీ విసుక్కున్నాడు లజ్ కార్నర్లో దిగుతూ.

"హల్లో, మిస్టర్!" అంది ఎదురుగా పొడుగ్గా నిల్చున్న ఆడమనిషి.

మూర్తికి నవనాళ్ళూ లాగేసినట్టయింది.

ఒకేసారి మల్లెలూ మందారలూ పూసిన తీగలా నిల్చొంది మోహిని, తెల్లటిచీరతో, ఎర్రటిజాకెట్టుతో.

ముఖం కోలగావుంది. నడుం సన్నగా ఉంది. కన్ను పెద్దగా ఉంది. కళ్లకి కాటికుంది. సిగలో పువ్వు లున్నాయి. పెదవుల మీద నవ్వులున్నాయి. మనిషి ముచ్చటగా ఉంది.

"హల్లో! మళ్లీ కనిపిస్తా ననుకోలేదు. ఏమీ అనుకోకు నిన్న శ్రమ ఇచ్చినందుకు నీకు. థాంక్స్ మాత్రం తీసుకో, నావి" అంది ఇంగ్లీషులోనే, జోరుగానే.

'థాంక్స్' ఒక్కటే మాట అర్థమయింది మూర్తికి.

"తెలుగుమనిషిలా లేదు" అనుకొంటోన్న మూర్తికి వీధిలో అంతా తమవైపే, చూస్తున్నట్టుగా తోచింది.

ఏ కాలేజీలో చదువుతున్నావని అడిగింది.

ఎక్కడా చదవనందుకు ఆ సమయంలో ఇదివరకన్నింటే ఎక్కువ బాధపడ్డాడు. ఇంగ్లీషులో జవాబు వెంటనే ఇచ్చే భాషా జ్ఞానం లేనందుకు కించపడి బాధపడ్డాడు.

మెల్లిగా ఒక్కొక్కమాటా వచ్చింది ఇంగ్లీషులో.

"నేను స్కూల్ ఫైనల్ పరీక్ష పాస్ చేసి ఉన్నాను. నేను ఇప్పుడు కాలేజీలో చదువుచుండుట లేదు."

"అయితే ఈవూళ్లో ఏంచేస్తున్నట్టు?"

ఈవిడకి ఇంగ్లీషుతప్ప మరి యే భాషా రాదా?

ఏమ్మే చదువుతే నేనుకూడా వరపర లాడించేద్దును ఇంగ్లీషు ఈవిళ్ళాగే.

"నేను యీవూరు ఉద్యోగం నిమిత్తం వచ్చియున్నాను."

ముక్కముక్కకీ తడుముకోవాలి. దిక్కుమాలిన బాధ.

ఈ కుర్రవాడితో ఇంకేమిటి మాట్లాడ్డం

ఆపట్నంలో మహిళా సంఘ సహాయార్థం సభ్యురాండ్రందరూ కలిసి ఒక వేలంపాట నడుపదలిచారు. ఆవిషయాన్ని ఎరుక పరుస్తూ వూరిలోని అమ్మలక్కలకందరికీ దిగువ విధంగా నోటీసులు పంపించారు"...ఇంట్లో అట్టే పెట్టుకోవటానికి చోటు దండుగ అయిన వస్తువులు ఏవివున్నా రే మాకు అప్పగించండి. వాటినే అమ్ముకొని మన సంస్థకు నిధి సేకరిద్దాము. పై ఆదివారం నాటికి మీకు పనికిరాని వస్తువులన్నీ మాకు అందచేయండి. మీ భర్తలను కూడా తీసుకురండి."

అనుకొంటూన్నట్టుగా ముఖం పెట్టింది మోహిని. పెదవులమీద నవ్వుమాత్రం పోలేదు.

ఇద్దరూ మొహమాటపడుతూ అరనిమిషం నిల్చున్నాక ఆ అరనిమిషంలో అనవలసిన మాటలు తర్జుమా చేసికొని "అయిన యెడల నేను పోయెదను మరియు వచ్చెదను" అన్నాడు మూర్తి, పోడానికి ఎంతమాత్రం ఇష్టం లేకపోయినా.

ఆవిడ కళ్లలోకి చూడలేకపోయేడు. మెడవైపు చూసేడు. ఎడంచేతిలో పుస్తకం మీదకి కళ్ళు జార్చేడు.

మోహిని, V ఆనర్స్ క్లాస్, ఫలానా కాలేజీ అనే పదాలు నల్లటి అక్షరాల్తో నోట్ బుక్ అట్టమీద రాసిఉన్నాయ్. ఏ కాలేజీలోచదువుతోందో తెలుసుకోడంతో మూర్తిలో సంతోషం చరచరా లేచింది.

"అయితే, ఛీరియో" అందామె.

ఏమనడానికీ పాలుపోక ఏదోయిదిగా నవ్వేసిన మూర్తిని "అడగడం మర్చిపోయేను. నీ పేరేమిటి" అని అడిగిందామె.

తన పేరేమిటో తెలుసుకోవాలనే కుతూహలం ఆవిడకి కలిగినందుకు మూర్తిలో ఈసారి సంతోషం జరజర లాడింది.

"నా పేరు 'మూర్తి' అయివున్నది."

అని సుస్పష్టంగా ఇంగ్లీషులో చెప్పేడు గొప్పగా.

"ఫీరియో" అన్నదామె.

మూర్తి కూడా అదే అన్నాడు.

ఇంతలో వచ్చి నిల్చొన్న బస్సులోనికి ఎక్కింది మోహిని, సునాయాసంగా పది మందిని వెనక్కి నెట్టి.

పదిమందిమీదా చెప్పలేనంత కోపం వచ్చింది మూర్తికి. ఎగ్మూర్ వెళ్ళడానికి బస్సు ఎక్కుతూ తనో పన్నెండు మందిని తోసిపారేశాడు మోచేతులో.

ఆ రోజున మూర్తికి కోపం కలిగించిన వారి సంఖ్య అంతటితో ఇరవైరెండయింది.

పెద్దపెద్ద ఉద్యోగస్థుల్ని ఆశ్రయించడం అన్నివిధాలా మంచిదనేది మామయ్య చెప్పే సూత్రం.

ఆ సూత్రాన్ని ఆచరణలో పెట్టమని మేనల్లుడికి సదా ఉపదేశిస్తూ ఉంటాడు.

ఆ ప్రకారంగా ఎగ్మూరు వెళ్లి రామయ్యగారి కాళ్లు పట్టుకోమని బోధించి పంపించేడు మామయ్య.

రామయ్యగారి పిలక పట్టుకోందికి సందేహించని వాళ్ళొ వెళ్ళి మాట్లాడేడు మూర్తి, ఆరోజున మోహిన్ని విడిచివెళ్ళేక.

అదివరకు నలుగు రైదుగురు ఉన్నతోద్యోగుల్ని చూడ్డానికి వెళ్ళినప్పుడు వార్ని చూడ్డమే జరిగింది, కాని వారితో మాట్లాడ్డం జరిగింది కాదు. ఎందుచేత?

నోటంట మాట రాకపోవడంచేత?

మరయితే ఇప్పుడింత చురుగ్గా, సమానఫాయిదాలో ఇతన్తో ఎలా మాట్లాడుతున్నాను?

కారణం ఉంది. నాకా కారణం ఎంతో బాగా తెలుసు. ఏమిటది?

"కుర్రాడు చాలా చురుగ్గా ఉన్నాడే" అనుకున్నాడు రామయ్య. తప్పో ఒప్పో, ఇంగ్లీలో మాట్లాడుతే చాలు తరించిపోయేమనుకొనే జాతి రామయ్యది.

తప్పులున్నా సరే ఇంగ్లీషులోనే మాట్లాడాలని ఆనుకొనివచ్చి అలాగే ఇంటర్వ్యూ సాగిస్తున్నవాడు మూర్తి.

రామయ్య ఆఖరికి అన్నాడు.

"అబ్బాయ్. అప్లికేషన్ పంపించేశావు కద! ఏమయినా వీలుంటే చూస్తానే. నాల్రోజులు పోయాక మళ్ళీ ఓసారి కనిపించు" అని.

"థాంక్యూ వెరీమచ్" అన్నాడు మూర్తి.

"బై బై. మీ 'అన్క' లెలా ఉన్నాడు?"

"హి యీజ్...ఒకే"

ఒకే అంటే అర్థం?

తరువాత రామయ్య కుర్చీలోంచి లేచేడు. మూర్తికూడా లేచేడు.

రామయ్య ఇంట్లోకి పోయేడు. మూర్తి బైటకి వచ్చేడు.

బైటకి వస్తూ "థాంక్యూ మోహినీ" అనుకున్నాడు ఎందుకో. సాయంకాలం ఇంటికివస్తూనే మామయ్య అడిగేడు:

"రామయ్యగారేమన్నార్రా?"

"తన చేతిలో వున్న సాయం అంతా చేసి తీరుతానన్నాడు"

"నిజంగా, నిజంగా ???"

"నిజంగా, నిజంగా."

"రామయ్యగారలా అన్నార్రా?"

"అవౌ! అన్నాడు. నీ గురించికూడా భోగట్టా చేసేడు"

"నిజంగా, నిజంగా ????"

"ఎంతో నిజంగా నిజంగా"

"ఈ మామయ్యని చూసి ఇన్నాళ్ళూ ఎందుకు గడ గడ లాడేను?" అనుకున్నాడు మూర్తి.

మామయ్య తనలోతను నవ్వేసుకొంటూ,

★ మగవాడు - ఆడమనిషి ★

కోటు విప్పుకొంటూ అవతల గదిలోకి పోయేడు.

తరువాత, బాత్‌రూమ్‌లోకి ముఖం కడుక్కోందికి వెళ్తోన్న వరహాల్ని పైటపట్టుకు లాగేడు మూర్తి.

"అమ్మా నాన్నా చూస్తే చంపేస్తారు. నీకో దండం బాబూ" అంది వరహాలు.

"మీ అమ్మా నాన్నా చూస్తే నాకేం భయం?"

"పోనీ, నీక్కాకపోతే. నాకు, ఒదిలెయ్ బావా" అని జాలిగా అడిగింది వరహాలు.

ఆ మాత్రం మగతనం ఆ పిల్లమీద ఆ పూటకి ప్రదర్శించి ఆ పాటికి వదిలిపెట్టేడు మూర్తి.

కాణీఖర్చు పెట్టకుండా పెద్ద పెద్ద భవంతులు గాల్లో కట్టేస్తూ మర్నాటి పొద్దుటా వెళ్ళేడు మైలాపూర్, సాయంకాలమూ వెళ్ళేడు, మైలాపూర్. ఆ రీతిగా మూడు రోజులు వెళ్లేడు.

మోహిని కనిపించింది కాదు. నాలుగో రోజు 'ఫలానా' కాలేజీ దగ్గర పొద్దుటా సా యం కా లం కా సి నా ప్రయోజనం లేకపోయింది. కళ్లు మాత్రం కాయలు కాచేయి.

కళ్లు కాయలు కాసినా, కొంచెం చీకటి పడినా, మెరీనావెంబడి శాన్‌థోమ్ వైపు నడుస్తూ, మోహినికోసం చూసుకొంటూ నడుస్తూ "ఆవిడ కనిపిస్తే కపాలేశ్వరుడికి కొబ్బరికాయ కొడతాను" అని మొక్కుకున్నాడు.

"ఉద్యోగంకోసం కూడా దేవుడికి కొబ్బరికాయ కొడదామనుకోలేదు" అనుకొంటూ శాన్‌థోమ్ దగ్గర ఏదో సందులోకి మళ్లేడు. నాలుగడుగులు నడిచేడు.

ఆవిడ అక్కడే కనిపించింది, ఎదురుగా వస్తూ.

మోహినే మోహినే!

ఈ మోహిని నా మోహమును చూస్తుందా చూడదా? చూడకపోతే ఎలా? నా అంతట నేను పలకరించలేనుకదా ఎలా? హల్లో అనడమా? ఏమండీ అనడమా? మోహిని గారూ అనడమా? ఏం చేయడమేం చేయడం?

అని తీవ్రాతి తీవ్రంగా ఆలోచిస్తూ, బితుకూబితుకూ చూస్తోన్న మూర్తి మోహిని కంటపడ్డాడు.

మూర్తిని చూడగానే ఆమె ఓ పెద్ద నిట్టూర్పు విడిచింది. ఆమె ఓ పెద్ద నిట్టూర్పు విడిచేక, కళ్ళలో సంతోషం ప్రకటించడం, తొందరగా ముందుకొచ్చి అతని రెండు చేతులూ పట్టుకోడం, అతను ఆనందంలో వణికిపోడం అన్నీ అటు తరువాత ఒక్కక్షణంలో జరిగేయి.

"*Thauk God!* సరిగ్గా సమయానికి కనిపించేవు" అని వూపిరి విడిచింది మోహిని.

ఊపిరి పీల్చడంకూడా మర్చిపోయాడా అన్నట్టుగా ఉండిపోయేడు మూర్తి.

ఈలోపున, పొట్టిగా ఒకడూ పొడవుగా ఒకడూ, సూట్లు తొడుక్కున్న వాళ్లిద్దరు, వాళ్ళని దాటి ముందుకు పోయేరు. ఇరుగ్గా లేని సందులో, కార్పొరేషన్ దీపాల కాంతిలో కొద్దిపాటి జనం నడుస్తున్నారు. పక్క ఇంట్లోంచి ఎవరో చూస్తున్నారు.

మోహిని దగ్గరగా నిల్చొంది. చేతులు వదల్లేదు.

"నాకు మళ్ళీ ఓ వుపకారం చేసి తీరాలి"

"చేసి తీరతాను" అని మనసులో ఆవెంటనే నిశ్చయం చేసుకొన్న మూర్తి "యస్ యస్" అన్నాడు.

"వెనక్కి చూడు" అంది మోహిని.

వెనక్కి చూసేడు మూర్తి.

వెనక్కి చూస్తే ఏముంది? ఏమీ లేదే!

"ఏమి? ఏమి?" అన్నాడు.

"కార్నర్లో వాళ్ళిద్దరూ నిల్చున్నారు చూడు."

"యస్ యస్."

పొట్టిగా ఒకడు, పొడవుగా ఇంకొకడు, నిల్చొని చూస్తున్నారు తమవైపు.

"నీకు ధైర్యం ఉందా?" అని అడిగింది మోహిని.

"యస్ యస్."

"అది బాగుంది. అయితే వెంటనే వెళ్లి వాళ్ళిద్దర్నీ చితక తన్ను."

"యస్ యస్" అనేశాడు, దేనికి 'యస్' అంటున్నాడో అర్థం చేసుకోకుండానే, జీవితంలో అంతవరకూ తన్నులు తప్పించి మరెవర్నీ తన్నకుండానే.

సరే అనేశాక తెలిసివచ్చింది వాళ్ళని కొట్టమంటోందని. అప్పుడయినా, ఆమె ప్రవర్తన కొంచెం విపరీతంగా ఉన్నట్టు తోచలేదు.

ఉత్తరం పోస్ట్ చేయడం, పెద్దమనుష్యుల్ని పట్టుకు తన్నడం, అనే రెండు పనులకీ తేడా కనిపించలేదు మూర్తికి. అదెంతో ఇదీ అంతే. అది సాధ్యమైతే, ఇదీ సాధ్యమే!

"అయితే, వెళ్లు వేగిరం."

"ఏల? తన్నుట?" అని మాత్రం అడిగేడు.

"ఇందాకటినుంచీ 'ఫాలో' అవుతున్నారు. డర్టీ రాస్కెల్స్. వాళ్ళకి బుద్ధి చెప్పేనేగాని లాభంలేదు. వేగిరం, వేగిరం వెళ్ళి తన్ను."

వాళ్ళామెని అవమానిస్తున్నారనీ, వాళ్ళని చితగ్గొట్టవలసి వుంటుందనీ గ్రహించేడు మూర్తి.

మూర్తి కదిలేడు. వాళ్ళవైపు నడిచేడు. పళ్లు పటపట కొరుకుతూనే వున్నాడు.

అంతవరకూ బాగా జ్ఞాపకం ఉంది.

తరువాత ఏం జరిగింది?

వీరాభిమన్యుడు కదిలేడు. శత్రువుల్ని సమీపించేడు. నరాధములదగ్గర సెంటు వాసన వేస్తోంది. పగతురు పొగ వదుల్తున్నారు. తరువాత ఇంగ్లీషులో కీసుపాసులు. తెలుగులో ఒకటోరకం తిట్లు. బండబూతులు.

తరువాత?

తరువాత ఏమున్నది? గభీగభీ, కొట్టో, తన్నో, నరుకో, అడీ అడీ! అడిచిను! కొట్టు! కొట్టు!

ఒకడూ, ఇద్దరూ! ముగ్గురి తన్నులాట!

తరువాత?

పొంగిన ఛాతీతో నిల్చొన్న మూర్తి పక్కన నిల్చొన్న మోహిని, ఎదురుగా నిల్చొన్న పోలీసు జవాన్‌తో గడ గడ గడ గడ ఇంగ్లీషులో చెప్తోంది. పోలీసువాడు ఏర్చి కూర్చిన పదాల్తో, అరవ బూతుల్తో వాళ్లతో చెప్తున్నాడు, వాళ్లని తిడుతున్నాడు. వాళ్లిద్దరూ వాజమ్మల్లా నిల్చున్నారు, విరగని ఎముకల్తో, చిరిగిన చొక్కాల్తో, తగిలిన దెబ్బల్తో.

తరువాత?

ప్రేక్షకులు వెంటవెళ్లగా వాళ్లిద్దరూ పోయేరు. ప్రేక్షకుల్ని తప్పించుకొందికి మోహిని తనని రిక్షాలోకి తోసింది.

తనూ ఎక్కింది.

తరువాత?

"నేనూ మోహినీ రిక్షాలో కూర్చు

న్నాం" అనే విషయం గమనించ గలిగేడు మూర్తి.

పొట్టి వెధవా, పొడుగు వెధవా, పోయేరు. ఇవాళ రాత్రి చస్తారు. చావనీ.

ఇంగ్లీషులో ఏవేవో ముద్దుపేర్లలో పిలుస్తోంది మోహిని. పిలుస్తూ, మాట్లాడుతూ మధ్యలో ఆగింది.

ఆగి రెండు ముద్దులు పెట్టుకొంది మూర్తిని, ఈ బుగ్గమీద ఒకటీ, ఆ బుగ్గమీద ఒకటీ.

తరువాత మళ్లీమాటలు.

ఆమె అలా ముద్దు పెట్టుకున్నందుకు మూర్తి ఆశ్చర్యపోలేదు. జరగవలసిన దేదో జరిగినట్టుగా భావించేడు.

ఇప్పుడు ఉండవలసింది అనిల్ కుమార్ గాడు! ఉంటే ఏం చేసేవాడు? దెబ్బలాటా ఉండకపోను. ఏమీ ఉండకపోను. ముందు తనే దొడు తీసి తోక ముడిచేసేవాడు.

"రా. మోహినీ. వాళ్ళతో మన కేల? మన మానాన్న మనం పోదాం" అనే బాపతు అయివుంటుంది అనిల్ కుమార్ ది.

అంతే అంతే.

ఇంతలో రిక్షా ఆగింది, ఏదో డిస్పెన్సరీ ముందు.

దిగుతూంటే వళ్ళు నొప్పిగా ఉంది.

డిస్పెన్సరీలో టించర్ అయొడిన్ రాస్తూంటే బాగా తెలివొచ్చింది.

కంపౌండర్ కి మోహిని డబ్బు ఇస్తూంటే,

"ఒద్దొద్దు. నే నిస్తాను" అనగలిగేడు మూర్తి.

"వద్దూ, వద్దూ నాన్ ఇస్తానూ" అంది మోహిని, ఒక్కమాట మినహాయించి తెలుగులో పట్టిపట్టి మాట్లాడుతూ, నవ్వుతూ. తరువాత డిస్పెన్సరీలోంచి బైటికి వస్తూ.

"మీరు ఆంధ్రాస్ కారా?" అని ప్రశ్నించేడు మూర్తి.

"నో" అంది మోహిని.

ఆవిడ తెలుగుమనిషి కానందుకు కొంచెం విచారించేడు.

ఇంగ్లీషుమాట కొంచెం జోరుగానే వస్తోంది.

"మీ రేమిటి చదువుతున్నారు?"

"నేనా? హిస్టరీ ఆనర్స్. ఫైనలియర్."

'V ఆనర్స్ అంటే ఆఖరేడాదన్న మాట' అనుకున్నాడు మూర్తి.

ఆనర్స్ చదవని జీవిత మేల? అని వ్యధ చెందేడు.

అంతటితో మూర్తికి మోహిన్ని తప్పించి మిగతా చదువుతున్న వారందరిమీదా డబ్బున్న వాళ్ళందరిమీదా, లోకంలో చాలాభాగంమీదా ఎంతో కోపంవచ్చింది.

ఆ సమయంలో పొట్టిగా పొడవుగా ఉన్న వారిద్ద రెవరయినా కనిపించినట్లయితే కొంచెం ప్రమాదం సంభవించేది.

"నిన్నెలా 'థాంక్' చెయ్యాలో తెలియకుండాఉంది" అంది మోహిని నిల్చుండిపోతూ.

మూర్తి కూడా ఆగేడు.

పక్కనే పెద్దగేటు. గేటుమీద పువ్వుల పందిరి. లోనికి పోతోన్న రోడ్డు. రోడ్డుకి రెండుపక్కలా చెట్లు. వెనక ఎక్కడో వెలుగుతోన్న దీపాల్లో భవన్తి ఉన్న సూచన.

"ఇదే మా హాస్టలు."

"యస్ యస్"

"మళ్ళీ రేపోసారి రావూ?"

"యస్ యస్"

మోహిని, వెనక్కీ ముందుకీ, చుట్టూ చూస్తోంది, అదోలా ముఖంపెట్టి. పొట్టీ పొడుగూ మళ్ళీ వస్తున్నారా? అనుకున్నాడు మూర్తి. లేదు. వాళ్లు రావడం లేదు.

అయితే, ఎందుచేత అలా చూస్తోంది మోహిని?

జవాబు వెంటనే వచ్చింది.

ఒక్కసారి, అకస్మాత్తుగా, అతని మెడ చుట్టూ చేతులు వేసి పెదవులమీద తన పెదవులాన్చి, అంతవేగిరంగానూ వదిలి వెనక్కిపోయింది. మోహిని.

కొంచెం దూరం వెళ్లేక "రేపు సాయంకాలం తప్పక రావాలి" అంది.

"యస్, యస్, యస్" అన్నాడు మూర్తి.

ఆక్షణంలో కనిపెట్టగలిగేడు.

వరహా లెలా వణుకుతుందో మోహిని కూడా అలానే వణికింది. ఇలాటి విషయంలో ఇద్దరాడవాళ్ళమధ్యా తేడా లేదు.

మూర్తి కొంచెం గర్వంగా అక్కణ్నించి కదిలేడు.

ఇంటికి వెళ్ళేసరికి చాలా రాత్రయింది. ఇంట్లో అంతా గాభరా పడ్డారు.

వాళ్లలా గాభరా పడ్డందుకు చాలా సంతోషించేడు మూర్తి.

"ఏమిరా, దెబ్బ లెలా తగిలేయ్ రా? ట్రాములోంచి కాని పడ్డావా? ఏమిటి సంగతి? మాట్లాడవేం?" అని మామయ్య ఆందోళనతో అడిగేడు.

ఎక్కువబాధ నటిస్తూ "హిస్" అంటూ వాలుకుర్చీలో కూలబడ్డాడు మూర్తి.

"చెప్పరా? చెప్పవేం? బాగా నొప్పిగా ఉందా? ఆస్పత్రికాని వెళ్ళాల్సుందా? వేగిరం చెప్పు" అన్నాడు మామయ్య.

అందుకు సమాధానంగా "మరేం ఫర్వాలేదు. మీ గాభరా చూస్తే నవ్వొస్తోంది" అన్నట్టు కొంచెం నవ్వి "వరహాలూ, మంచి నీళ్ళు తే" అన్నాడు మూర్తి.

"తేవే, తేవే" అన్నాడు మామయ్య.

తెచ్చింది వరహాలు.

గళాసు చేతికి అందిస్తున్నప్పుడు తన కాల్తో ఆమె కాలు నొక్కేడు మూర్తి.

తరువాత ఓ కథ చెప్పేడు:

టెర్మినస్ దగ్గర బస్సులోంచి తను ఎలా దిగినదీ, అప్పణ్నించీ ఎవరో వెంటాడుతున్నట్టు ఎలా అనుమానించినదీ, నిజంగా ఎవరో ముగ్గురు ఎలా వెంటాడినదీ, చీకటి సందులోకి రాగానే జేబులో పర్సుకోసం తనని వాళ్ళు ఎలా ఆపినదీ, ఆపగానే

(56-వ పేజీ చూడండి)

కామెడీ ఆఫ్ ట్రాజెడీ

స్థలం : కాలేజీహాస్టల్సు.

21-వ షూటింగు.

(సందర్భం: అమావాస్య. అర్ధరాత్రి. సమయం సరిగ్గా చెప్పాలీ, అంటే, పన్నెండుగంటల పదిహేను నిముషాలు. కను చీకటి-కటికచీకటి మధ్య.)

(దూరంగా "భౌభౌభౌభౌ"
"భీ,భీ,భీ,కర్ర తే, కొట్టు, భీభీ"

ఇవే, అనగా, కుక్క మొరగడమూ దాన్ని అదిలించడమూ ఫేడిన్ అవుతాయి. చివరకి కుక్క మూలుగుతుంది. నిశ్శబ్దం.)

(ఫోటోగ్రాఫర్, లైటింగువిషయంలో సూచన. అమావాస్య అని గ్రహించి చీకటిగావుంచు. కాని ఏదన్నా వొకవ్యక్తి నడుస్తుంటే కనుపించీ కనుపించనట్టుమాత్రం వుండాలి.)

(వ్యక్తావ్యక్తమైన చీకట్లో ఒకవ్యక్తి రొప్పుతుంటూ ప్రవేశిస్తాడు. లాంగ్ షాట్.)

ఒకటోవ్యక్తి: అమ్మయ్య, అయ్యారూ, తలుపు, తలుపు. ఒరేయ్ అయ్యారూ కుక్క తరిమిందిరా బాబూ ఆ సందు మలుపుదగ్గర నుంచి. ఆ తహసీల్దారుగారు కుక్కని కట్టెయ్యడూ! ఎప్పుడూ రాత్రి ఇదేగోల. వెధవకుక్క. తలుపు తియ్య. తలుపు తియ్యరా.

(వెలుతురు కనపడదు కనక తలుపుకొట్టిన చప్పుడు వినబడుతుంది.)

ఒకటోవ్యక్తి: ఒరేయి,తలుపుతియ్యరా. అయ్యారూ. ఏం నిద్దరా, వెధవ నిద్ర. తియ్యరా. ఒరెయ్.

(వరుసగా కొంతసేపు తలుపుతట్టిన చప్పుడు. తరువాత నిశ్శబ్దం. టిక్కుమని చప్పుడు. లైటు వెలుగుతుంది. ఆలైటు ఒక వరండాలోనిదనీ, అది వెలిగితే కొంతి ఆ రూములో పడుకునివున్న వ్యక్తిమీదకు కిటికీగుండా పడుతుందనీ ఫొటోగ్రాఫర్ గ్రహించాలి.)

(లోపలవ్యక్తికి లాంగ్ షాట్. పూర్తిగా రగ్గు కప్పివుంటుంది—మొహంతోకూడా. లైటువయ్యగానే గుర్రుచప్పుడు వినబడుతుంది.)

ఒకటో వ్యక్తి: ఒరెయ్. శతకోపం. తలుపు తియ్యరా, ఒరెయ్. నిద్దరొస్తూందిరా. మరీ అంత మాట పట్టింపు కూడదురా ఒరెయ్. నువ్వు లేటుగా వొస్తే నేను తియ్యనూ తలుపు?

(దబదబదబమని చప్పుడు. మధ్యమధ్య "అయ్యారూ," అనీ "తలుపు తలుపు" అనీ కేకలు. క్లైమాక్సురీచ్ అవుతుంది. అప్పుడుగానీ మ్యూజిక్ డైరక్టరు తలుపు చప్పుడికి సాయంగా ట్యూన్సుఇచ్చాడంటే క్లైమాక్సు గ్యారంటీగా అందుకుంటుంది.)

(క్లోజప్. కదలని మెదలని ముసుగువిగ్రహం.)

ఒకటోవ్యక్తి: కటకటా! శతకోపం! ఎంతదురాగ్రహమ్మైతివిరా! తలుపు బ్రద్దలు చేయుదమన్నచో ఈ బిల్డింగు కట్టించిన ఇంజనీరుగారు గట్టితలుపులు పెట్టించినాడు గదా! హా లక్ష్మణా!

శ్రీ ప్రభాకరం

(ఒకటోవ్యక్తికి క్లోజప్. ఈయన మొహానికి పట్టిన చెమట చేతిరుమాలుతో తుడుచుకుని, రుమాలు పిండెయ్యాలి. మ్యూజిక్ డైరెక్టరు "ఏదీ గతినాకూ" అన్న పాట ట్యూన్‌మాత్రం వాయించాలి.)

ఒకటో వ్యక్తి: (తలుపు కొడుతూ) అయ్యారూ, నీ కడుపు కొయ్య తలుపు తియ్యరా.

(తలుపుచప్పుడు ఆగుతుంది. గుర్రు చప్పుడు వినబడుతుంది.)

(రెండో వ్యక్తికి లాంగ్ షాట్. దూరం నుంచి.)

రెండోవ్యక్తి: ఏయ్, ఏమిటాచప్పుడు? ఇవతల మేమేమన్నా నిద్రపోవాలా? ఎవరా తలుపు కొడుతున్నది? తలుపు విరిగి పోగలదు జాగ్రత్త.

ఒకటోవ్యక్తి: (కంఠం మాత్రం వినిపిస్తుంది) నేనురా, నాయుడూ, ఈ తలుపు విరుగదుగా. ఖర్మం! విరిగిపోతే లోపలి కన్నా పోదును హాయిగా.

నాయుడు (ఇక్కడనుంచీ 'నాయుడు' అనే వ్యవహరిద్దాం) నువ్వురా వెంగళప్పా. ఏం తలుపు తియ్యటంలేదా అయ్యారు గాడు? సరేలే. (నిష్క్రమిస్తాడు)

(ఢర్రున గుర్రు వినబడుతుంది)

ఒకటోవ్యక్తి (వెంగళప్ప): హా! హాత విధీ! ఏం ఖర్మమొచ్చిందీ! (తలపట్టుకుని వదిలేస్తాడు) ఒరేయ్, అయ్యారూ, తలుపు తియ్యరా. (తలుపు బాదుతున్న చప్పుడు)

(వరండాలో లైట్లు వెలిగాయని ఇందాకానే తెలియజెయ్యబడింది ఇప్పుడు ఫొటోగ్రాఫరు చెయ్యవలసినపని. అన్ని రూములకీ ఒక లాంగ్ షాట్. మొదటి రూముకీ రెండోరూముకీ క్లోజప్పులు. ఈ రూములలో పడుకున్న మనుష్యులు ఈ చప్పుడు విని, మూలిగి వొత్తిగిల్లి, కొంచెం కదిలి, "అబ్బ, ఏమిటి, గొడవ" అని విసుక్కుని చివరకి లేచికూర్చుని లైటు వెలిగించినట్లు తాపీగా క్లోజప్ చూపించి తరువాత లైట్లు అన్ని రూముల్లోనూ వెలిగినట్లూ, మనుష్యులు తలుపులు తీసుకుని ఇవతలికి వచ్చినట్లూ చూపించాలి ఒకలాంగ్ షాట్‌లో)

22 వ షూటింగు:

సందర్భం: అమావాస్యే. అర్ధరాత్రే. సమయంమాత్రం పన్నెండున్నర దాటుతుంది.

(మధ్యని నాయుడూ, చుట్టూ మనుష్యులూ, నాయుడు లుంగీ పైకి విరిచి కట్టాడు. పైని బనీను వేసుకున్నాడు. నాయుడికి ఒక క్లోజప్పు.

నాయుడు: వాడినేం చెయ్యమంటారు. తలుపుతెరిస్తేనా? మీరంతా లేచారే, ఇన్నిరూముల వాళ్ళు! వాడికి వినపడలేదంటారా తలుపుచప్పుడు? ఈ అయ్యారుగాడి కేమొచ్చింది చెప్పండి? వినండి, ఆ గుర్రు. (గుర్రు వినబడాలి' అని వేరే చెప్పనక్కరలేదు)

(గీతారావు: జనంలోంచి వస్తాడు. గీతారావు చారల పైజామా వేసుకున్నాడు. పైనికూడా అల్లాంటిదే ఓపెన్‌షర్టు. లాంగ్ షాట్.)

గీతారావు: ఒరేయ్ నాయుడూ, వాడికి మేలుకొలుపులు పాడితే లేస్తాడనుకుంటాను.

(జనం అంతా ఉల్లాసంగా భేష్ భేష్ అంటారు. భూపాలరాగం సన్నగా లాగుతోంది.)

(మ్యూజిక్ డైరెక్టరూ, నీకు 'షైన్' అయ్యే ఛాన్సు ఏదన్నావుంటే ఇదే. అలా



గన్నామని నాలుగు క్లారినెట్లూ, అయిదు వీణలూ, ఎనిమిది ఫ్లూట్లూ, పది మద్దెళ్లూ పెట్టి 'ఆర్కెస్ట్రా' ప్రళయం తీసుకురాకు. ఒక మాత్ ఆర్గనూ, ఒక బుల్ బుల్, ఒక ఫ్లూటూ ఒక తంబురా, చాలు. డైరక్షన్‌తో పాటు ఇదిగో పాట.)

("కస్తూరి రంగ రంగా" ట్యూన్ వేసుకో.)

నాయుడు : 1. పాట. (ఇది ఘంటసాల చేత పాడించవచ్చు.)

అయ్యరూ మేలుకోరా.
అయ్యయ్యో అదేం నిద్దరా!

(క్లోజప్. ముసుగు విగ్రహం కొంచెం కదిలీ కదలనట్లు చలనం చూపిస్తుంది.)

గీతారావు : 1. పాట. (గీతారావు గొంతుకకి సరిపోయేవాడు ఫిలింఫీల్డులో ఒక ప్లేబాక్ ఆర్టిస్టూ లేడు. ఈ సినేరియో రచయితకి వొక్కడికే ఆ గొంతుక వున్నది. అయితే కొంచెం కీచుగొంతుక.)

గీతారావు : (రహస్యం చెపుతూన్నట్టు) 1. పాట.

వయ్యారు లొచ్చారురా
వలపులా
సయ్యాట లాడంగనూ,
వెయ్యారు లిస్తారురా
అయ్యయ్యొ
అయ్యరూ లేచిరారా.

(గుర్రు ఆగుతుంది.)

(క్లోజప్—ముసుగు మొద్దు కదుల్తుంది. క్లోజప్—జనం సంభ్రమాశ్చర్యచకితులై చూస్తారు విజయహాసంతో. క్లోజప్—ముసుగు మొద్దు ఒత్తిగిలుతుంది. క్లోజప్—జనం పెదిమ విరుస్తారు.)

జనంలో ఒకడంటాడూ : లాలిపాటకి మేలుకుంటారుట్రా ఎవరైనా? మేలుకొలుపు పాడండి.

నాయుడు : (క్లోజప్) (సకిలిస్తాడు గొంతుకు సర్దుకుందుకు) 2 వ పాట.

మేలుకొనుమీ భరత పుత్రుడ,
మేలుకొనుమీ అరవ వీరుడ,
మేలుకొను మీ కుంభకర్ణుడ
మేలుకోవేంరా, ఒరేయ్, మేలుకో॥

క్లోజప్. ఒత్తిగిల్లిన విగ్రహం మొహం మీది ముసుగు కొద్దిగా దిగజారి అయ్యరు మొహం కనబడుతుంది. మాంఛి కసిగా వున్నట్టుగా వుంటుంది మొహం. నాలిక రెండు పెదవుల మధ్యకి తెచ్చి నొక్కి పెట్టి వుంటుంది)

గీతారావు : 2 వ పాట*

తెల్లవారెను కోడికూసెను

(నాయుడు సడెన్‌గా వాచి చూస్తాడు. క్లోజప్ గం 1-5 ని)

తెల్లవారెను కోడికూసెను
మెల్ల మెల్లగ మేలుకోరా
మేలుకొను మీ కుంభకర్ణుడ
తలుపుతియ్యగనూ.

(పాటపాడుతున్నంతసేపూ లాంగ్ షాట్. ముసుగు మొద్దు కదలదు. మెదలదు)

నాయుడు : 3 వ పాట*

చిటపట చినుకులు
దుప్పటి తడిసెను
తలుపుతియ్యవే, భామా.
గోవర్ధనగిరి
గోవుల గాచెడి
గోపాలకృష్ణమ్మ, నేనే
గోవుల గాచేది నేనే

గీతారావు : (గొంతుక ఇంకా కీచుగా పెట్టి)

"హా, నాదా, నాకేటిదెచ్చావ్?"

(ఈపాట పాడుతున్నంతసేపూ

*ఈపాటలు రచయితవి కావు. కాని వాటి అమూల్యావసరాన్ని గుర్తించి రచయిత సంగ్రహించినవని రచయితే చెప్పుకుంటున్నాడు. దీన్ని ఏడైరెక్టరూ ఆక్షేపించడానికి వీల్లేదు.

అగ్ని మాపక దళం వారి ఆఫీసులోని టెలిఫోను గణగణా, గణగణా మోగింది. అధికారి ఒకడు, ఎక్కడ ఎవరి కొంపకు నిప్పు అంటుకొందో నన్న దిగులుకొద్దీ గబగబా రిసీవర్ పైకి ఎత్తి "హల్లో"అన్నాడు.

"హల్లో! అది ఫైర్ సర్వీస్ ఆఫీసేనా?"

"అవునండి."

"మా డండి! నేను క్రొత్తగా యిల్లు కట్టించుకొన్నాను."

"అయితే...?"

"ఆయింటి చుట్టూ ఎంతో డబ్బు ఖర్చుపెట్టి ఎక్కడలేని పూల మొక్కలు తెప్పించి వేయించాను."

"పూలమొక్కల విషయం మాకు చెప్పుతా రెందుకండీ?"

"ఆఁ! మరేం లేదు - మా యింటి ప్రక్కయింటికి నిప్పు అంటుకొంది. మీరందరూ ఎల్లాగు యిక్కడికి వచ్చిపడి మాపూల మొక్కలన్నీ ధ్వంసం చేసేస్తారేమో నని...!!!"

కామెడిలో ట్రాజడీ

నాయుడు హావభావాలు ప్రదర్శిస్తూ వుంటాడు. గీతారావుకూడా. మొద్దు కదలదు)

నాయుడు: ఒక అరవపాట ఎత్తుకుందాం.

బాలన్ కరుణై పురివాన్ నంద
బాలన్ కరుణై పురివాన్ నందబాలన్
స రి గ మ ప ద నందబాలన్—
రి స గ మ ప ద నందబాలన్...
రీ సా రి గమ పద నందబాలన్. సారీగమ పదా నిదరిగరీ పమదపా రిగమపద నంద బాలన్...

(విగ్రహం కదలదు కాని కాలివేళ్ళు మాత్రం పాటకి తాళం వేస్తూన్నట్లు కదుల్తూ వుంటాయ్.)

లాంగ్ షాట్

నాయుడు: ఒరేయ్, వెంగళప్పా. ఏం లాభంలేదు. వీడు మేలుకునివుండి, తలుపు తియ్యడం ఇష్టంలేక నాటక మాడుతున్నాడు. మాదారిని మేం పోతున్నాం. రండి పోదాం.

వెంగళప్ప: (తొందరగా) నాయుడూ, మ వ్వల్లాగంటే ఎల్లాగ చెప్పు? నేను రాత్రికి నిద్రపోవాలా?

నాయుడు: లేకపోతే నా రూముకిరా పడుకుందువుగాని.

గీతారావు: అయినాగానీ వీడిని లేపడానికి మార్గం లేదంటారా.

నాయుడు: ఎందుకు లేదూ. ఏరా మీ రూములో ఎవరిదగ్గరైనా మూడు నాలుగడుగుల లాఠీ వుందా?

(క్లోజప్. ముసుగు విగ్రహం గభీమని కదుల్తుంది. బోర్లా పడుకుంటుంది ముసుగు పూర్తిగా లాక్కుని.)

(నిశ్శబ్దం)

నాయుడు: ఎవడిదగ్గరా లేదూ వొక లాఠీ? ఆచారీ మీ గదిలోకి వెళ్ళి గొడుగు ఇల్లా పట్టుకురా.

వెంగళప్ప: ఒరేయ్, అయ్యరూ, నిమ్మన గుడి పెరకోపయ్యరూ, తలుపు తియ్యరా గొడుగు కర్రతో తంతాడు గావును నిన్ను!

(ముసుగు విగ్రహం ఒక్కమాటు సద్దుకున్నట్టు ఝాడించుకుని నిశ్చలంగా బోర్లా పడుకుంటుంది.)

23 వ షూటింగ్.

సందర్భం: ఇందాకటి సందర్భమే.

(గొడుగుకర్ర కొంకీ వున్నవైపు అయ్యరు క్యాంపు కాటులోని ఖాళీకి తగిలించి వుంటుంది. గొడుగు కొస నాయుడి చేతిలో వుంటుంది.)

నాయుడు: వీడిని కిటికీకి దగ్గరగా మంచంతోపాటు ఈడిస్తే కాళ్ళూ చేతులూ దొరక పుచ్చుకుని లేపవచ్చు. (స్టెడీ!)

(అసలు మంచిఘ్యాచరువున్న కమేరామాన్ చక్క నిక్లోజప్పులు తీస్తాడిఘట్టంలో)

(నాయుడు గొడుగు చివర పట్టుకుని గట్టిగా లాగుతాడు పళ్లుబిగించి, కళ్లుపెద్దవి చేసి; లాభంలేదు)

నాయుడు: ఒరేయ్, గీతారావూ నా నడుంపట్టుకుని లాగు.

గీతారావు: (అల్లాచేస్తూ) ఆచారీ, నా నడుం పట్టుకో

(ఇల్లాగ ఒక గొలుసులా తయారై మంచం లాగడానికి ప్రయత్నిస్తారు. అందరి మొహాలూ వేరేవేరే చూపించాలి వాళ్లు లాగుతున్నప్పుడు. అప్పుడుగానీ వాళ్లెంత బలంగా లాగుతున్నారో ఆడియన్సుకి తెలియదు)

(మంచం కదలదు. సినీమా జాగ్రత్తగా చూసే ప్రేక్షకుడికి మాత్రం ముసుగులోని విగ్రహంకూడా కొంతబలం వుపయోగించి తన నిశ్చలతని రక్షించుకుంటున్నట్టు కనపడకతప్పదు.)

(గొడుగు ఫెళఫెళ్లాడి గొడుగుకామ మంచానికి తగులుకుని మిగిలినగుడ్డ నాయుడి చేతులో మిగలగా ఫోర్సుమూలాన నాయుడూ అతని నడుంపట్టుకు లాగుతున్న అందరూ కిందపడతారు.)

(నాయుడు మెల్లిగా లేచికూర్చుంటాడు)

వెంగళప్ప: (క్లో జప్) (శోకకరుణ రసాలు మూర్తీభవించగా ఏడుపు మొహంతో) ఏందారిరా?!

(లాంగ్ షాట్) నాయుడు: గోదారి! పోరా! పోయి నాలుగురాళ్లు తీసుకురా!

* * *

(నాయుడి చేతులో రాళ్లుంటై)

నాయుడు: దుర్యోధనుడు ద్వైపాయన హ్రదంలో దాక్కుని కూట్టాడకుండా కూర్చున్నట్టు, ఖర్మ మేం కాలింది

(22 వ పేజీ చూడండి)

మళ్ళీ ఎప్పటిలాగే

నిజంగా ఇంతకన్నా ఏం జరగలేదు.

తండ్రి బజార్నుంచివొచ్చి, మంచం వాల్చుకొని కూర్చుంటూ-ఎదురుగ్గా అరుగు మీద కూర్చున్న చిన్న కొడుకును చూసి, "ఏంరా! పొలం వెళ్ళలేదేం?" అన్నాడు, మామూలు గొంతుతోనే.

రాముడు మాట్లాడలేదు. వినిపించుకొని కూడా వినిపించుకోనట్టు మెదలకుండా వాడు వూరుకోవడంలో బ్రహ్మాండమైన నిగూఢార్థం ఉండి వుంటుంది. పైగా వాడు లోలోపల తన నిశ్చయాన్ని వొదలకూడదనుకొంటున్నాడు.

తండ్రికి ఆశ్చర్యంతోపాటు అరికాలి మంట నెత్తి కెక్కడంలో వింతలేదు. ఆయనకు విశ్వామిత్రుడికోపం అనుక్షణమూ ముక్కు మీద తారాడుతూనే ఉంటుంది. ఆ కోపాన్ని, ఆయన ఎప్పుడూ - ముఖ్యంగా కొడుకులమీద ఒకే పద్ధతిలో ఉపయోగించి ఉపశమింప జేసుకోవటం కద్దు.

"ఏం మాయరోగం వచ్చిందా? అట్లా గోడకుచేరి గిలబడి కూర్చున్నావు. ఫో. పొలంవెళ్ళి కూలివాళ్ళతోపాటు గడ్డపని చేయి." అన్నాడు తండ్రి.

ఆ మొట్టమొదటి వాక్యానికి రాముడి హృదయంలో కొన్ని నెలలుగా జరుగుతోన్న సంఘర్షణకి పరి పక్వదశ వొచ్చింది. మనస్సు తిరగబడింది. అట్లా తండ్రి చాత మాటలు పడటం వాడికి కొత్తకాదు. కాని కొత్తగానే కోపం ప్రజ్వరిల్లింది. కొడుక్కి-రావాల్సిన కోపానికి మించి వొచ్చింది. 'ఏమిటి తను - వెధవది, ముప్పొద్దులా గానుగ ఎద్దులాగా పనిచేయడం? అన్నయ్య అట్లా జల్సాగా తిరగడం ఎందుకని?' అనుకున్నాడు. కోపం చెమట రూపంలో ద్విగుణీకృతమైది. తల పైకెత్తాడు. జులపాల క్రాపు అటూ ఇటూ ఊగింది.

"నే పొలంపోను" అన్నాడు గంభీరంగా. తండ్రిమీద తిరుగుబాటు చేసినట్టు గర్వపడ్డాడు, ఆ క్షణంలో రాముడు.

తోక తెగిన కోతిలాగా ఉగ్రుడయ్యాడు, తండ్రి. తన కొడుకు తనని ఎదిరించటం ఇదే ప్రథమం. పెద్దవాడు ఎంత చదువుకున్నా తనని ఎదిరించి యెరుగా? వీడు - ఈ వెధవాయి, తన మాటలు కాదననా? వీడికింత ఆలోచన ఎక్కణ్ణుంచి వచ్చింది? ఏ కారణం లేకండా కొడుకు పొలం వెళ్ళననటం పలువిధాల ఆలోచనలకు దారి తీసింది. కాని తండ్రి ఆలోచించదలచలేదు. తాత్కాలికంగా వాడ్ని నానా చీవాట్లూ వేయదలిచాడు; వొచ్చిన కోపాన్ని అణచుకొనేందుకు.

"ఏం. అంత పొగరబోతుతనం బలిసిందా? వెధవా! పొలం పోకుండా కూడు ఎట్లా తింటావో చూస్తాను. కాస్త లేవ్వూ, వడ్లబస్తా ఎత్తలేవూ, అప్పుడే తండ్రిని ఎదిరించే ధీరుడవయ్యావూ! ఎదిరించు! ఒరేయ్-

"సులోచన"

నువ్వు కిష్టయ్యగారి చెంచయ్యలాగా ఎందుకూ పనికిరాకండా పోతావని నేను యీక్షణాన వ్రాసియిస్తాను. ఏమిటనుకొంటున్నావో! తండ్రిని ఎదిరించినవాడు బాగుపడ్డట్టు ఏ చరిత్రలోనూ లేదు. నీకు చదువా - రాదు. ఇంక పొలంపని కూడా చేయక ఏం నిర్వాకం ఏడుద్దామని. అంట్ల వెధవా. సిగ్గు లేకుండా బెదిరింపా! ఎవరి మీదరా నీ బెదిరింపు! అర కాసీ విలవ చెయ్యవు. తండ్రిమీద తిరగపడటమా? ఎవరన్నా నూరిపోస్తున్నారా! నీ పాడుముఖానికే పుట్టిందా ఈ బుద్ధి."

రాముడు రోషంగా లేచాడు. తండ్రి వొంక తీక్షణంగా చూశాడు. ఏమిటో మాట్లాడాలని నోరు విప్పబోయాడు; మాటలు వూడిరాలేదు. కోపం, తండ్రిని నమిలి మింగేయాలన్న ఏదో ఆవేశం - వాడిలో ఉధృతం కాసాగి, తండ్రి ముఖాన అనదలచుకున్న నాలుగు మాటలూ అననివ్వలేదు.

'ఛీ, ఈ ఇంట్లో తను ఒక్క క్షణం ఉండరాదు' అనుకున్నాడు, రాముడు. వెంటనే బయలుదేరాడు బయటికి విసురుగా.

"అయ్యో! ఎక్కడికి వెళుతున్నావురా! ఒరేయ్ - రాముడూ!" అంటూ తల్లి ద్వారందాటి బయటికి వొచ్చింది.

అప్పుడే రాముడు గొంది దాటి వెళ్ళిపోయాడు.

"అంతతొందర పనికిరాదు, మనిషికి, ఎప్పుడూ వాడిమీదే విరుచుకు పడతారేం? పోండి. తీసుకురాండి, ఏం అఘాయిత్యం తలపెడతాడో!" అన్నది తల్లి కొడుకు విసురుగా పోవటంచూసి.

"ఏం ఫర్వాలేదు. ఎక్కడికి వెళ్ళుడుతే" అన్నాడు తండ్రి, నిర్లక్ష్యంగా.

రాముడు అపోవటం పోవటం శివాలయం ప్రక్కనవున్న చెరువు గట్టుమీద మర్రిచెట్టుక్రిందకు పోయి కూర్చున్నాడు. ఆ చెట్టుక్రింద కూర్చుని కబుర్లు చెప్పుకొంటూన్న ఇద్దరు ముగ్గురుమనుష్యులు రాముడి వాలకాన్ని కనిపెట్టి అడిగారు, "ఏంరా అబ్బాయీ! ఇక్కడున్నావూ. ఏం పనుల్లేవేమిటి?"

రాముడు నిశ్చలంగా ఉన్నాడు. ఇంకోసారి అడిగి, ఇంటిదగ్గర అలిగి వొచ్చిన బాపతని ఊరుకున్నారు.

తను ఇక ఆయింటిముఖం చూడకూడదు. తన నాయింట్లో 'కొడుకుగా' చూసుకొనే వాళ్ళు లేరు, ఒక్క తల్లి తప్ప. తను తండ్రికంత చేదసిపోయాడు, ఎందుకో. తనకి చదువు చెప్పించలేదు. చదువురాదు. గొడ్లదగ్గర ఉండమన్నాడు. ఎందుకురాదు? నాలుగేళ్ళు ఆలస్యంగా వొచ్చేదేమో - రెండోక్లాసు రెండేళ్ళు తప్పినంతమాత్రం చాతనే చదువు రాకండా పోతుందా? ఆయనకు తనని చదివించాలని ఏకోశానా లేదు. వేలకువేలు పోసి అన్నయ్యను చదివిస్తున్నాడు. చదువుకోవటం చాతనే అన్నయ్యనంత గొప్పగా చూస్తున్నారు. ప్రొద్దున్నా, మధ్యాహ్నా మూ కాఫీ యిస్తారు. తనకు జ్వరం వొస్తేనే తప్ప ఇవ్వరు. అన్నయ్య ఎన్ని సినిమాలకు వెళ్ళినా అడేమని అనేవాళ్ళ

★ మళ్ళీ ఎప్పటిలాగే! ★

లేరు. తను సినిమాకు అమావాస్యకో, పున్నమకో వెళితే ఆయన విరుచుకుపడతాడు. తిడతాడు. ఏమిటీ బానిస బ్రతుకు? పొలంలో ముప్పొద్దులా పనిచేసినా మెచ్చుకునేవాళ్లు లేరు. పైగా అది సరిగ్గా చెయ్యలేదు – ఇది సరిగ్గా చెయ్యలేదని చలాయింపు. మాట్లాడితే తిట్టటం. ఏం బ్రతుకు? వెధవ బ్రతుకు! వాళ్ళ వెంకట్టయ్య పొలంలో పనిచేస్తే – తండ్రి ఎంత మెచ్చుకుంటాడు. సినిమాకెళ్లాలంటే మాట్లాడకుండా డబ్బులిస్తాడు. ఎన్నెన్ని మంచిగుడ్డలు కుట్టిస్తాడు. తనకేం కర్మం? అన్నయ్యకు కుట్టించే గుడ్డలలో సగం కుట్టించినా తను సంతోషపడును? వాడికంటె తనేం తక్కువ!

ఈవిధంగా రాముడు ఆత్మవిమర్శ చేసుకో మొదలెట్టాడు. వాడికి తన బ్రతుకే బ్రతుకు చాల నీచమైందని తెలుసుకున్నప్పట్నుంచీ ఆ బ్రతుకునుంచి ఏదో ఒకతిరుగుబాటు చేసి, బయటపడాలనే కుతూహలం కలుగుతూనే ఉంది. తెలివితేటలు అనేవి పుట్టినప్పుడు అందరిలోనూ సరిసమానంగానే ఉంటాయి- కాని, అవి ఒక్కొక్కరిలో నిశితంగా రాణించటానికిన్నూ, మరికొందరిలో ఏమీ రాణించలేక పోవటానికిన్నూ – ప్రధాన కారణం ఆ తెలివితేటలకు పరిపూర్ణస్వయా పొన్నిచ్చి వినియోగించుకోవటంలో నిపుణతని ప్రదర్శించటం. అది చాతకాని వాళ్లు తెలివితక్కువ దద్దమ్మల్లాగా కనబడటమూ, అందరిచాతా తక్కువగా చూడబడటమూ మనం చూస్తున్నదే! పసిపాప చిరునవ్వులోని అమాయకత్వమే రాముడిలో ఉందనటానికి సందేహం అక్కర్లేదు. నిజంగా వాడికి ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం, పరిస్థితుల్ని గమనించాల్సిన అవసరం – అకస్మాత్తుగా ఏర్పడలేదు.

మర్రిచెట్టుక్రింద కూర్చుని తనకర్తవ్యాన్ని నిర్ణయించుకున్నాడు, రాముడు. ఆ నిర్ణయానికి వాడు వొచ్చేందుకు దాదాపు ముప్పావు గంటపట్టింది. ఏమిటంటే అది: తత్‌క్షణం ఈ వూరినుంచి ఎక్కడికన్నా పారిపోయి కొన్నాళ్లపాట బ్రతకటమే. ఎక్కడేనా బ్రతకటం వాడికి కష్టంగా తోచలేదు. పనిచేసుకొనేవాడికి బ్రతుకు చింత అక్కర్లేదనే అభిప్రాయానికి తేలిగ్గా గురయ్యాడు. పారిపోయి పట్టంలో సులభంగా బ్రతికి, మేడలు కట్టించినట్టు – వాడు ఒకటి రెండు సినిమాల్లో చూడడం కూడా జరిగింది. వాడు పారిపోయి ఎక్కడేనా బ్రతుకుదామనే నిర్ణయానికి రావటానికి అదొక కారణం కాకపోదు.

మర్రిచెట్టుక్రింద నుంచి లేచాడు, రాముడు. నేరుగా స్టేషన్‌కు వెళ్ళాలని బయలుదేరి స్టేషన్‌కు చేరుకున్నాడు. మనసులో చేసుకున్న నిర్ణయం ప్రకారమే వాడు పట్నం పోదలుచుకున్నాడు. ఆ నిర్ణయంయొక్క మంచిచెడ్డలు ఆలోచించడం వాడికి ఇష్టంలేదు. మంచో, చెడో – అనుకొన్న మార్గాన వెళ్లటానికి రాముడు చదువుకొంటే – ఇట్లా సాహసించి వుండేవాడు కాడు.

రైలు స్టేషన్కి వొచ్చింది.

అందరితోపాటు రాముడూ ఎక్కాడు, బండి. కాని ఆ ఎక్కడంలో రాముడికీ, అందరికీ ఉన్న తేడా ఎక్కడంటే: రాముడు టిక్కట్టుకొనలేదు. అందరు టిక్కట్టుకొన్నారు. బండి బయలుదేరింది. టిక్కట్టుకొనకుండా బండి ఎక్కితే పట్టుకుంటారనే ఊహ వాడిలో వొచ్చింది కానీ భయపడాల్సిన అగత్యం లేకపోయింది. వాడిజేబుల్లో చిల్లికానీలేదు. వేలికి ఉంగరంమాత్రం వుంది.

* * *

పాపం రాముడు పట్నం చేరుకొనేప్పటికి చాలా అవస్థలకు గురికావాల్సి వచ్చింది. ముఖ్యంగా టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేయటం వాడికి కొత్తకావటం చాత యిన్ని అవస్థలూ పడాల్సివొచ్చింది. దొంగచాటుగా, రైల్వే అధికారులకు కన్నుకప్పి ప్రయాణం చేయటం వాడికి తెలీకపోవటం మూలాన నాలుగైదుచోట్ల క్రిందకు దిగాల్సిరావటమూ, తిట్లు తినటమూ మొదలైనవి భరించాల్సిన గతి పట్టటమే కాకుండా – తగని ఆకలివేసి, 'తను ఎందుకు పట్నం వెళ్తున్నట్టు?' అన్న ప్రశ్నకు జవాబు చెప్పుకోలేని స్థితికి దిగజారటం జరిగింది.

అనుకున్నకాడికి రెండు రోజులు ఆలస్యంగా పట్నం చేరుకున్నాడు. ఈలోపల దారిపొడుగునా మంచినీళ్లు త్రాగి ఆకల్ని చంపుకున్నాడు.

మద్రాసు మహా నగరాన్ని చూడటంతోటే వాడికి ఆకలిసంగతి గుర్తుకు రాలేదు. ఆ మేడలు, బజార్ల మధ్యగా ట్రాములు పోవడం, వింత మనుష్యులు, ఆడవాళ్ళు సైకిళ్లు తొక్కుకుంటూ పోవడం, దుకాణాలు – అంతా కొత్తగా కనిపించినయ్. ఇన్నాళ్ళూ తను పల్లెటూళ్లో వెధవ జీవితం జీవించినట్టు నొచ్చుకోసాగాడు రాముడు. పల్లెటూళ్లో ఏముంది? చెరువు, మర్రిచెట్టు, పొలము, గుడి, రచ్చబండ, చావిడి, ఇల్లు, ఎడ్లబండి, ఊరికి దూరంగా రైలు— ఇంతేగా! అక్కడికీ – ఇక్కడికీ, ఛ్ఛ— ఏం పోలిక? నిజంగా ఇదే స్వర్గలోకమంటే. సినిమాలు కూడా తయారుచేస్తారంట, ఇక్కడ. చూడాలి. సముద్రానికి కూడా వెళ్ళాలి. ఓడలు ఒక్కొక్కటి చిన్న పల్లెటూరంత ఉంటుందంట.

తను ఇక్కడకు పారిపోయి రావటమే మంచిదైంది. లేకపోతే ఆపల్లెటూళ్ళోవుంటే తను ఇదంతా చూసేవాడా? నాన్న కలలోనైనా పట్నం పంపించేవాడా? బజార్లో ఎలక్ట్రిక్ స్తంభంక్రింద నిలుచోని ఇట్లా సంతోషపడసాగాడు, రాముడు.

వాడికి తనఊళ్ళో బయలు దేరేప్పుడు కలిగిన సందేహమే మళ్ళీవొకసారి కలిగింది.

ఇంత మహాపట్నంలో తనకు తిండి దొరక్కపోతుందా అని.

కాని ఆరోజుసాయంత్రానికి వాడికి తెలిసి వొచ్చిందేమంటే, తనట్లా అభిప్రాయపడడం కేవలం పొరపాటని. ఆసాయంత్రంవరకూ ఎంత తిరిగినా వాడికి అన్నం దొరకలేదు. ఏ దుకాణందగ్గిరికి వెళ్ళి అడిగినా 'ఫో.' అని చీదరించుకో నేవాళ్ళేగాని, 'ఇందా' అని కొస్త రొట్టెముక్కయినా ఇచ్చిన వాళ్ళులేరు. అప్పు డనిపించింది, వాడికి, ధర్మగుణానికి పల్లెటూళ్ళు ఇంత అధ్వాన్నంగా లేవని. ఆకలైన అనుక్షణమూ తను ఇంతదూరం రావడం వాడికి తెలివి తక్కువ అనిపిస్తోంది. ఇంటిదగ్గర తినే అన్నాన్ని తలుచుకున్న కొద్దీ ఆకలి, ఆరాటం అధికం కాసాగింది. కళ్లుపీక్కు పోయినయ్. నూనెలేక జులపాలజుట్టు రేగి మరీ అసహ్యంగాఉంది. గుడ్డలు మాసిపోయినయ్. తన ఊరివాళ్లు ఎవరేనా కనపడతా రేమోనన్న ఆశని కళ్లల్లో పెంచుకుంటూ వెతకసాగాడు. లాభం లేకపోయింది. రాత్రి పడింది. మంచినీళ్ళు త్రాగి ఏదో అరుగు మీద పడుకున్నాడు. అర్ధరాత్రివరకూ వాడికి నిద్రపట్టలేదు. ఏడ్చాడు, ఇంటి దగ్గర అందర్నీ తలుచుకొని బావురుమన్నాడు. ఆరాత్రి వాడు గతిలేక వొక నిర్ణయానికి వొచ్చాడు. వెల్లవారిం తరువాత వ్రేలిన ఉన్న ఉంగరాన్ని అమ్మి కడుపునిండా కూడు తిందామని. ఈ నిర్ణయం చేసుకున్న పిదపనే వాడికి నిద్ర పట్టింది.

తెల్లవారింది. రాముడు నిద్రలేవలేదు. పిచ్చికలలు కంటూనే ఉన్నాడు. ఇంటి యజమాని కాలితో తన్నేవరకూ వాడికి మెలకువ రాలేదు. లేస్తూనే వ్రేలిన ఉన్న ఉంగరాన్ని తనివితీర చూసుకున్నాడు. కళ్లు నులుముకుంటూ బజార్న నడుస్తున్నాడు. సూర్యోదయం అయింది కాని ఎండ అగపడటంలేదు.

"ఏయ్! ఆగు" వెనకనుంచి ఎవరో బలంగా, అధికారంగా పిలిచారు. ఎప్పుడూ వినని గొంతే! ఆగి వెనక్కి తిరిగిచూశాడు, రాముడు.

"ఏ ఊరు నీది?" రాయిగుద్ది అన్నట్టు అన్నాడు. ఉలిక్కిపడ్డాడు, రాముడు. మనిషి భీకరంగా ఉన్నాడు. ఆజానుబాహుడు. లావుగా, బలంగా ఉన్నాడు. ఏం చేస్తాడో, ఎందుకు అట్లా అంటున్నాడో అంతుపట్టలేదు. 'ఏ వూరైతే నీకేం?' అని తనుకూడా భీకరంగా అందామనుకున్నాడు. కాని ఎందుచాతనో వొళ్ళు భయంతో వొణకసాగింది. అంచాత వాడి నోటినుంచి మాట రాలేదు.

"ఏ...ఏం...ను" మాటలు తడబడ్డాయి.

బూటుకాలు నేలకేసి కొట్టాడు. రాముడు వొణికిపోతున్నాడు.

"వెధవా! నిజం చెప్పు. చూస్తే దొంగలాగా ఉన్నావు. నీ జుత్తూ, నీ వాలకం, నీ గుడ్డలు - అంతా చూస్తే పచ్చి దొంగలాగా ఉన్నావు. పద పోలీసు స్టేషన్‌కు" అన్నాడు అధికారంగా.

రాముడి కాళ్ళక్రింద భూమి కదులాడింది. ఇంతలో ఇద్దరు ముగ్గురు చేరారు, అక్కడకు. అందరూ వింతగా చూస్తున్నారు.

"ఊఁ! పద పోలీస్ స్టేషన్‌కు" మళ్ళీ గద్దించాడు అతను.

రాముడికి వొళ్లు తెలీని భయం వేసింది. అక్కడివాళ్లు గుసగుసలు మొదలెట్టారు. అతను సి. ఐ డి. అట.

"లాభం లేదు. పోవాల్సిందే." అన్నాడు అక్కడికి చేరిన ఇద్దరు ముగ్గుర్లో ఒకడు.

"ఏదో పాపం. కనికరించండి" అన్నాడు ఇంకొకడు.

"ఛట్. వాగవాకు" అని చేతిలో ఉన్న లాఠీతో ఒక్కటి తగిలించాడు సి. ఐ. డి. కనికరించండి అన్నవాడ్ని. రాముడికి ఒకటి పడటం ఒక్కటే మిగిలింది.

"ఎక్కడ దొంగిలించాడో - చేతిన ఉంగరం కూడా ఉంది" అన్నాడు ఒకడు.

"అది సి. ఐ. డి. గారికివ్వు. వొదిలిపెడతాడు" అన్నాడు, ఆ దెబ్బలు తిన్నవాడు మెల్లగా. సి. ఐ. డి. గారు వాడివంక భీకరంగా చూశారు.

రాముడికి ఏం తోచలేదు. ఆపాదమస్తకమూ వొణికి పోతున్నాడు. ఉంగరం తీసి సి. ఐ. డి. కిచ్చి, దయతలిచి వొదిలిపెట్టమని - కాళ్ళమీదపడ్డాడు రాముడు.

సి. ఐ. డి. ఉంగరాన్ని జేబులో వేసుకుంటూ "జాగ్రత్తగా మసలుకో, వెధవా. దయతలచి వొదిలిపెడుతున్నాను!" అన్నాడు సి. ఐ. డి.


తరువాత సి. ఐ. డి, తనకు సలహాలు ఇచ్చిన (దెబ్బలుతిన్న వాడితో సహా) ఇద్దరూ కలిసి కాఫీహోటల్లోకి వెళ్ళటం స్వయంగా కళ్ళారా చూసి, బావురుమన్నాడు - రాముడు. పరిసరాలు నవ్వినై. ఏం చేయటం? కడుపులో అగ్నిపర్వతాలు బ్రద్దలౌతున్నాయి. అధ్వాన్నపు అడవి మధ్య ఉన్నట్టు తోచింది.

పట్నం ప్రజల్లో ఇంత మోసం ఉన్నట్టు వాడికి తెలీదు. వాడి కలలన్నీ జారిపోయినయ్. బ్రతుకుమీద ఆశకూడా పోయినట్టు బాధ పడుతున్నాడు. ఎట్లా ఇంటికి చేరుకొనేది?

పది గంటలకు ఒక పావలాని సంపాదించ గలిగాడు, రాముడు. బస్‌స్టాండ్ నుంచి ఇళ్ళకు సంచులు చేరవేయటంలో కూలిక్రింద వొచ్చింది, ఆ పావలా. ఆ పావలాలో, చాకలో కొంతవరకు కడుపునిండే చిరుతిండి తిని - నిండుగా మంచినీళ్లు త్రాగాడు.

'తను చేస్తూన్న పనేమిటి?' అనుకున్నాడు రాముడు, ఎండలో పన్నెండు గంటలప్పుడు బెడ్డింగు నెత్తిమీద పెట్టుకుని నడుస్తూ. ఇంతదూరం వచ్చిన తనకు ఈ దుర్గతేమిటి? శాస్తి జరగవలసిందే! ఏమిటి? ఎందుకు రావాలి? తండ్రి తిట్టినంత మాత్రం చాత పారిపోయి రావటమే? - ఇట్లా అకస్మాత్తుగా తనమీద ద్వేషం ప్రబలి

(19-వ పేజీ చూడండి)



సతీమణితో చీట్లాట

మూర్తి ఆఫీసునించి వచ్చేక కాఫీ త్రాగి, బట్టలు మార్చుకుంటుండగా రాధ మేడమీదికి వచ్చింది.

"ఏవండీ, రోజూ క్లబ్బుకి వెళ్ళకపోతే ఏం? కాస్సేపు కులాసాగా కబుర్లు చెప్పుకుందాం ఇంట్లో ఉండకూడదూ?"

"అయిందా ఏడుపు, రోజూ నువ్వు ఏడవడం, నేను వెళ్ళడం, బుర్ర గోకుడై రావడం అవుతోంది. నువ్వుతూ ఒక్కనాడైనా పంపించేవా?"

"నే నేమన్నా మీకు ఏడుపుగానే ఉంటుంది. మీరు ఏం చేసినా మరి, నె నేమో నవ్వాలి. ప్రొద్దస్తమానం ఇంటి చాకిరీతో విసుకెత్తిపోయి, మీరు వచ్చేకయినా రెండు కబుర్లు చెప్పుకు ఆనందిద్దామంటే - సరి, మీరు క్లబ్బుకి తయారవుతారు."

"అవును, నీదగ్గర కూర్చుంటే ఏం తోస్తుంది. నలుగురి స్నేహితులతో కలిసి

శ్రీమతి డి. సత్యవతి

పేకాట ఆడుకోవచ్చు. నలుగురివల్లా ఊళ్లో సంగతులన్నీ తెలుస్తాయి."

"ఓస్, ఇంతేనా! అయితే కూర్చోండీ. నాకు అన్నిరకాల ఆటలూ వచ్చు. ఆ పేకేదో ఇంట్లోనే ఆడుకుందాం. ఇహ, కబుర్లంటారా ఎక్కడ - ఏం జరిగిందీ ఒక ఆడది చెప్పినన్ని పదిమంది మగవాళ్ళయినా చెప్పలేరు. మీక్కావలిస్తే రోజూ కావలిసినన్ని వార్తలు. పేకాట ఆడుకుంటూ పక్కింటివీ, ఎదురింటివీ, అవతల వీధివీ, ఇవతల వీధివీ అన్నీ చెప్తాను."

"సరే, కూర్చో." అంటూ భార్యపోరు పడలేక మూర్తి ఆ రోజునుండి ఇంట్లోనే తిష్ఠ వేసేవాడు సతీమణితో చీట్లాటకి.

ఆరోజు ఆదివారం. ప్రొద్దుట్నించీ ఆట మొదలెట్టేరు ఇద్దరూ. పందెం వేసి ఆడదామంది రాధ. ఎవరెక్కువ ఆట్లు కొడితే తక్కినవాళ్లు ఆ వారమంతా గెలిచినవాళ్ళు చెప్పినట్టూ నడుచుకోవాలి. ప్రొద్దుట్నించి ఇంట్లోనే ఉండడంచేత మూర్తి డల్‌గా ఉన్నాడేమో, సరిగా ఆడలేక ఓడిపోయేడు. ఇంకేముంది! రాధా రాణీగారి పరిపాలన మొదలైంది. ఒకరోజు ప్రొద్దుట మూర్తి ఆఫీసుకి బయలుదేరుతుండగా రాధ వచ్చింది.

"ఏవండి." ఏవండి? ఏమి సెలవు? పువ్వులూ, రిబ్బన్లూ వగైరాస్ రోజూ వస్తునే ఉన్నాయిగా! ఈరోజు ఏ కిళ్ళీ మిఠాయికో ఆర్డరు వేస్తున్నట్టున్నారు."

"అబ్బే, నేనేమైనా చిన్నపిల్లనా ఏం? మిఠాయి అదీ కావాలనడానికి. మరేం పక్కింటావిడ కొనుక్కుందండి జారీట్టు చీర. ఎంత బాగుందనుకున్నారు! బజారు కెళ్ళి నాక్కూడా ఒకటి కొనితేరూ?"

"ఆ, డబ్బో!"

"ఊఁ, మీ కెప్పుడూ డబ్బు వుండదు సిగరెట్లకయితే..."

"క్లబ్బు మానేసి నీతో ఆడమన్నావ్, సిగరెట్లు మానేసి ఆ డబ్బుతో నీకు చీర కొనమంటున్నావ్! బాగుంది."

"ఏయ్, మరిచిపోయినట్టున్నారు, ఈ వారంరోజులూ నేను చెప్పినవన్నీ మీరు చేసి తీరాలి."

"చిత్తం, చిత్తం" అంటూ ఆఫీసుకి బయలుదేరేడు మూర్తి.

"నిజమే, ఉద్యోగంలో ప్రవేశించేక ఇప్పటికి ఒక్క మంచిచీరయినా కొనలేదు. సరే, కొందాం. వెధవ డబ్బుకి ఎప్పుడూ చిక్కు పడుతూనే ఉంటాం." అని, ఆలోచించుకున్న మూర్తి సాయంకాలం ఇంటికి వచ్చేటప్పుడు చీర కొనితెచ్చి శ్రీ రాణీ వారికి సమర్పించుకొన్నాడు.

మూర్తికి ఆ నెల్లో డబ్బుకి చాలా అవస్థ పడాల్సొచ్చింది. కేప్స్టన్ సిగరెట్లు మానేసి డక్కన్‌తో కాలక్షేపం చేసేడు. రాధమీద చాలా కోపంవచ్చింది. అటు క్లబ్బుకి వెళ్ళకుండా ఆపేసింది - ఇటు డబ్బుకి అవస్థ పెట్టింది "ఈ ఆదివారం నేను గెలవకపోతేనా దాని భరతం పట్టకపోతానా" అనుకున్నాడు. మళ్ళీ ఆదివారంవచ్చింది. ఈసారి గెలుపుమూర్తిదే. మూర్తి రాజాగారి వద్ద దాసిగా మెలగవలసి వచ్చిందిరాధకి. రాధ ఎప్పుడూ సిగరెట్లను అసహ్యించుకునేది. అంచేత, ఆమెచేతే అగ్గిపుల్ల అరగదీయించి సిగరెట్టు ముట్టించుకునేవాడు. తన బూట్లకి రోజూ ఆమెచేతే పాలిష్ చేయించేవాడు. ఇలా ఇన్ని చేయించినా తన అక్కసు ఇంకా తీరలేదు. ఆరోజు ఆఫీసుకు వెళ్తూ రాధను. "ఓసారి ఇలా వస్తావా?" అని కేకవేసేడు." ఏమిసెలవు?" అంటూ రాధ దగ్గరకు వచ్చింది. "నేనొకటి అడుగుతాను ఇస్తావా?" "ఏలినవారి సెలవు

ఇద్దరు వణిక్ ప్రముఖులు వియ్యంకుల మౌదామని నిశ్చయించుకొని, ఆ విషయమై ఒకనాడు ఎంతో సేపు మాట్లాడుకొన్నారు. ఆ తరువాత ఎవరివూరికి వారు వెళ్లిపోయారు. కానీ ఒకాయనకు ఎందుకో అనుమానంతోచి, రెండో ఆయనకు వుత్తరం వ్రాస్తూ "మొన్న మీతో వియ్యమందుకొనే విషయం ప్రస్తావించాను కానీ, అందుకు మీరు అంగీకరించారో, నిరాకరించారో సరిగా జ్ఞాపకం లేదు. కాబట్టి ఆవిషయాన్ని తేట పరుస్తూ వెంటనే జాబు వ్రాయించవలసిందని" ప్రార్థించాడు.

మూడో రోజున సమాధానం వచ్చింది. అందులో యిలా వుంది. "ఆరోజు నేను ఎందరితోనో మా పిల్లవాడి పెళ్లివిషయం మాట్లాడాను. వారిలో చాలా మందితో వియ్యం అందుకోలేనని చెప్పినట్లు మాత్రం నాకు బాగా జ్ఞాపకం వుంది కానీ, ఎవరెవరితో ఆమాట చెప్పానో యిప్పుడు ఎంత జ్ఞాపకం చేసుకొన్నా జ్ఞాపకం రావటం లేదు"

అయితే ఇంక..." "నీమెళ్ళో మూడు పేటల గొలుసును ఇలాతే."

"ఎందుకూ ?" "ఎదురింటాయన రోజూ నేను వీధిలోంచివస్తున్నప్పుడు మారేడియో వింటున్నావా ? అన్నట్టూ వీధి అరుగుపై నిల్చొని నావైపు చూస్తుంటే తలకొట్టేసినంత పనవుతోంది. గొలుసు అమ్మేసి సాయంకాలం ఇంటికివచ్చేటప్పుడు రేడియోకొని తెస్తాను. "చాల్చాలు ! కుప్పతగలేసి పేలాలు వేపుతారా ?" "ఏయ్, మరచిపోయినట్టున్నావ్ ఈ వారం నే చెప్పినట్టూ చెయ్యాల్సిందే." అని మూర్తి భల్లూకపట్టులో చిక్కుకున్న రాధకి గొలుసు ఇయ్యక తప్పిందికాదు. సాయంకాలానికి రేడియో ఇంట్లో రెడీ అయికూర్చుంది.

అమర్నాడు సాయంకాలం అయిదుగంటలకి ఆఫీసునుండి మూర్తి ఇంటికి వచ్చేసరికి రేడియో ముందుకూర్చుని రాధ సిలన్ నుండి రికార్డులు వింటోంది. మూర్తి ఫ్లాస్కులో కాఫీ త్రాగడం పూర్తిఅయేక "ఏం, పేకాడదామా ?" అన్నాడు. "చాలు బాబు, ఈసారి పందెంగెలిచి, అవతల ఇంటాయనకి మోటారుసైకిలు ఉంది నేనూ కొనుక్కోవాలి - నీ నెక్లేస్ ఇచ్చెయ్యంటూరు." తీరిందా సరదా ? నీ కాలక్షేపానికి రేడియో ఉందిగా ! ఇహ నేను క్లబ్బుకిపోతాను." అంటూ మెల్లిగా క్లబ్బుకి త్రోవతీసిన మూర్తి తనలో ఇలా అనుకున్నాడు "రేడియో ధర్మమా అంటూ ఈరోజుతో పతీమణితో చీట్లాట సమాప్తం.! " ★

★ మళ్ళీ ఎప్పటిలాగే! ★

(17-వ పేజీ తరువాయి)

పోతోంది. వొచ్చినందుకు తిట్టుకోసాగాడు. పశ్చాత్తాపపడుతున్నాడు.

"ఒరేయ్ ! రాముడూ !" కీసుక్కున వెనక్కు తిరిగాడు, రాముడు.

అన్నయ్య ! కాళ్ళమీదపడి బావురుమని యేడవాలనిపించింది. అన్నయ్యకు ముఖం ఎట్లా చూపించటం - ఈస్థితిలో. రాయిలా నిలుచుండి పోయాడు రాముడు. పట్టరాని దుఃఖం వాడిలో పొంగి పొర్లుకొస్తోంది.

అన్నయ్యకు తగని జాలివేసింది - తన తమ్ముణ్ని ఈ స్థితిలో చూడటంతో. చిక్కి, శల్యమై పోయినందుకు అతనికి పెద్దవిచారం వేయలేదుకాని, 'కూలికి బెడ్డింగులు మోస్తున్నందుకు జాలీ, అవమానమూ వేశాయి.

"ఇంటికెళ్దాం, వొస్తావా ?" అన్నాడు అన్నయ్య.

సమాధానంగా నోరువిప్పలేక పోయాడు, రాముడు. 'రాక ఏంచేస్తాను ?' అన్నట్టు తల ఆడించాడు. బెడ్డింగు యజమానికి వొప్పజెప్పి అన్నయ్య వెంట నడుస్తున్నాడు. కొంతదూరం వొచ్చాక "ఆకలి వేస్తోంది" అన్నాడు.

ఆ ఫళంగా హోటల్లోకి తీసుకెళ్ళి భోజనం పెట్టించాడు. కరువుదీరాతిన్నాడు. బయటికి వొచ్చారు. ఉంగరంసంగతీ, అసలు మద్రాసు ఎందుకు వొచ్చిందీ'— ఎన్ని అవస్థలు పడ్డదీ అన్నయ్య అడిగి, చీవాట్లు వేస్తాడేమోనని రాముడు భయపడ్డాడు; కాని అట్లాజరగలేదు, అన్నయ్య ఇప్పుడు తాను చీవాట్లు వేస్తే మరీ క్రుంగిపోతాడని తలచటం చాత. జట్కాలో స్టేషన్‌కు వెళ్ళారు.

* * *

తన ఊరుస్టేషన్లో కాలుపెడుతూ అనుకున్నాడు, రాముడు : 'మళ్ళీ ఎప్పటిలాగే...తన బ్రతుకు ఆరంభం కాబోతోంది. ముప్పొద్దులా గానుగ ఎద్దులాగా పొలంలో పనిచేయటం - చావట్లో పేడకళ్లు తీయటం - తండ్రిచాత మాటలు పడటం...'

కాని రాముడు ఒకటి తలచలేదు, తను తన తండ్రికింద ఇదివరకన్నా తేలిక అవుతాడని!' ★

చరిత్రకందని వెంకయ్య

శ్రీ కాసుఖేల సోమేశ్వరరావు

ఆ వూరు అంత పెద్ద పట్నవాసం కాదు. అలాగని కేవలం ఓ చిన్న పల్లెటూరనటానికీ వీల్లేదు. తాలూకా సెంటరుగూడా కావటంచేత మునసబు కోర్టు, పోలీసు ఠాణా, పెద్ద బస్సు స్టాండు ఇవన్నీ ఉన్నాయి. షుమారు పది పదిహేను కాఫీ హోటళ్ళైనా ఆ వూర్లో కనిపిస్తాయి. వీధి వీధినా రెండు మూడు మంగలిషాపులు, కిల్లీ దుకాణాలు ఉంటుంటాయి. మచ్చుకు అక్కడక్కడా పెద్దపెద్ద రెండంతస్తుల భవంతులు కనిపిస్తాయి. ఉత్తరపు సరిహద్దున పెద్దబావి పక్కన బ్యాటరీ కరెంటుతో నడపబడే రేడియో అరేంజిమెంటు గల చిన్న పార్కున్నూ, అందులో చిన్న గ్రంథాలయ మొకటిన్నీ ఉన్నాయి. వాయవ్యదిశగా ఒక టూరింగ్ టాకీసు కూడా ఉంది. బహుశా దీనిమూలంగానే ఆ వూరు చాలా జనసంకీర్ణంగా కనుపిస్తుంది. చుట్టుపక్కల పల్లెలనుంచి గ్రామస్థులంతా కుటుంబాలు కుటుంబాలుగా తరలి వచ్చి మొదటాట సినిమా చూసుకొని ఆ రాత్రికి ఆ పంచనా ఈపంచనా నడుంవాల్చి పొద్దు పొడవకుండా తమ తమ గ్రామాలకి చేరుకుంటారు. పల్లెప్రజలకి ఈ వూరు పట్నవాసంగా కనుపించి విస్తుపోతారంటే ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. 'బాలనాగమ్మ'లో నాగేశ్వరావును చూచిన తర్వాత వేమూరి గగ్గయ్యమీద మోజు తగ్గిపోయింది. రాత్రుళ్లు ఆరుబయట కూర్చొని సినిమా తారలను గురించి రకరకాలుగా కబుర్లు చెప్పుకుంటూ ఉంటారు. ఈ 'సినిమా పిచ్చి' పట్టి పని పాటలు మానేసి సాయంకాలం, రాత్రీ సినిమా తేర్రాలదగ్గర తిరుగాడే కాపుకుఱ్ఱాళ్ళని చూస్తే ఏదో బాధగా, ఎవరో, ఎవరికో అన్యాయంచేస్తున్నట్టుగా ఉంటుంది. రెండు విభిన్న సంస్కృతుల మధ్య ఆవూరి ప్రజలు నలిగిపోతున్నారు. ఏది నాగరికతో అవగాహన చేసికొనే తాహతు లేదు పాపం. ముందర జానెడు వసారా, వెనక రతుక భటుడులాగా నిక్కిఉండే పిలక-జుట్టూ, నుదుట నూటపదకొండూ గలిగి సినిమా తారల బుష్‌కోటు వేసికొన్న ఆచారిగారి అబ్బాయిని చూస్తే నవ్వాలో ఏడవాలో కూడా తెలియదు. ఇలాంటి 'పట్టణ గ్రామా'ల్లో ఏ స్పెసిమన్ కావాలిస్తే ఆ స్పెసిమన్ దొరుకుతుంది. కేవలం పల్లెజీవనాని కలవాటుపడి 'మారే లోకం' మాయామర్మాలు తెలియని మనుష్యులూ వుంటారు. ఆధునిక యుగం వేసిన హ్యాటు, బూటు, కోటు, నెక్‌టై లాంటి స్టాంపులు తగిలించుకొని చలామణీ అయ్యే మనుష్యులూ ఉన్నారు.

ఆ వూర్లో పోలీసు వెంకయ్యని ఒకసారి చూసిన వాడెవడూ మఱిచిపోలేడని జబ్బమీద దెబ్బకొట్టి చెప్పవచ్చు. వస్తాదులాంటి మనిషి. మొహమంతా కండలు దిరిగి దవడలు ఇరు వైపులా ఉబ్బుకొచ్చి, చదరంగా ఉంటుంది. ఉబ్బెత్తుగా పొదిగిన తెల్లని బుఱ్ఱమీసాలు మొహాని కెంతో వింతకళ నాపాదిస్తున్నాయి. విశాలమైన నుదురు ముడుతలు పడి కుంచించుకుపోతున్నట్లుగా అగుపిస్తుంది.

తీర్చిదిద్దినట్లుగా, సమానాంతరంగా ఉన్న రేఖలతోటి నొసలు గతజీవితంలోని కష్టసుఖాలన్నీ రికార్డైన గ్రామఫోను ప్లేటులాగా ఉంటుంది. విగ్రహం కనీసం ఆరడుగుల ఎత్తైనా ఉంది. నలభై నలభై యైదేండ్ల వయస్సుంటుంది. దొంగల్ని పట్టుకోడంలో ఆరితేరిన ఘటం పోలీసువెంకయ్య. పదిహేనేండ్లక్రిందట ఉదయగిరికొండల్లో జింకలకోటిగాడు, పగ్గాల అంకడు అనే ఇద్దరు ఘరానా గజదొంగలుండేవాళ్ళట. ఆపేర్లలోనే వాడివాడి విశిష్టత కనపడుతుంది. మొదటివాడు తుపాకి గుండుకంటె ముందర పరుగెత్తేవాడు. రెండో దొంగ పగ్గాలతో బిగదీసి కట్టినా రాత్రికి రాత్రే మాయమయ్యేవాడు. ఉదయగిరి, కనిగిరి తాలూకాల్లో ఆ దొంగలపేరుచెప్తే పోలీసులు, అధికారులు హడలెత్తి పోయేవాళ్ళట. ఇలాంటి ఆరితేరిన దొంగలనాఠకుల్నిద్దరిని తానెలాపట్టుకున్నదీ పోలీసు వెంకయ్య వర్ణిస్తూ చెప్తుంటే (ముఖ్యంగా మంగలిషాపుల్లో) వినేజనానికి ఒళ్ళు జలదరించేది. ఓపిగ్గా వినేవాడుంటే గంటల తరబడి తన వీరగాథను వర్ణించగలడు వెంకయ్య. ఆవర్ణనతో ఒక వారపత్రికను రెండుమూడు నెలలు నిరాక్షేపణీయంగా నడపవచ్చునని నొక్కి వక్కాణిస్తున్నాను. పోలీసు వెంకయ్య ఆవూర్లో ఇంత చరిత్ర చేసినా చరిత్రకందని కొందర్లో ఒకడై పోయాడు.

ఇతన్ని పోలీసు వెంకయ్యనే పిలుద్దాం. ఎందుకంటే కోర్టులో 'దావాల' వెంకయ్య, బజార్లో, బొరుగులవెంకయ్య, 'పాతూర్లో' బేలుదారువెంకయ్య అని చాలమంది వెంకయ్యలున్నారు. ఇరవైఏళ్ళనుంచి ఇళ్లల్లో శుభకార్యాలైనా, సంతర్పణలైనా, శ్రాద్ధకర్మలైనా గైరుహాజరయ్యే అవధాన స్లోకాయన ఉండేవాడు. ఎప్పుడెవరు ఏముహూర్తాన ఎందు కెలాగ నామకరణం చేశారోగాని 'తద్దినం సుబ్బయ్య' అని వాడుకైపోయింది.

పోలీసు వెంకయ్య చాలా నిక్కచ్చైన మనిషి, కట్టె విరిచినట్టుగా, నిర్మొహమాటంగా తనకు నచ్చిందేదో చేసుకుపోతుంటాడు. అందువల్ల అతని కెక్కువమంది స్నేహితులెవరూ లేరు. మామూలు మనిషైతే అందరూ ఏవగించుకొనేవాళ్ళు. కాని ఎర్రబుట్టని, లాఠీని చూసి బెదిరిపోతారు. ఇంతవయసొచ్చినా వెంకయ్యకు ప్రమోషన్ గాక పోవటానికి పైనచెప్పిన సుగుణాలే కొంతవరకు కారణాలై యుంటాయి. ఒక రోజు సర్కిల్ ఇన్‌స్పెక్టరుగారి చిన్నబ్బాయి బజార్లో రెండు మూడు మామిడిపండ్లు పట్టుకొని ఉడాయిస్తుంటే వెంకయ్య వెళ్ళి కళ్ళురిమి జైల్లో వేస్తానని బెదిరించాడట. అతని కిదివరకుండే మెరిట్ రికార్డువల్ల ఉద్యోగమూడిపోలేదన్నారు తోటి పోలీసులు.

వచ్చిన కాసిన్ని రూకల్తోనే జీవయాత్ర వెళ్ళబోస్తున్నాడు వెంకయ్య. అణాకి, పైసకి చెయిజాపే రకంగాదు. తనెన్ని కల్లుకుండల్ని పట్టుకున్నాడో లెక్కలేదు. రెండేండ్లక్రిందట భార్య చనిపోయింది. ఇరవై అయిదేండ్ల కొడుకొకడున్నాడు. ట్రైనింగ్ చదువుతున్నాడు. కాటికి కాళ్ళు చాచుకొన్న ముసలి తల్లి ఒకర్తె ఉన్నది.

*   *   *



రెండుమూడు రోజుల్నించి ఊరు ఊరంతా గగ్గోలెత్తిపోతున్నది. ఎక్కడి నుంచో దొంగలమూక వచ్చి పడిందని, ఇళ్ళల్లో సొమ్ముదోచుకుంటున్నారని వింత వింత కథ లల్లి వాగ్వాదాలు చేస్తున్నారు ప్రజలు. నిన్న రాత్రే పూటకూళ్ళ సుబ్బమ్మ ఇంట్లో రెండొందల రూపాయల కిమ్మత్తుగల పెట్టొకటి, రెండు పట్టుబట్టలు, మరచెంబు ఇవన్నీ పోయాయట. పాప మావిడ లబోదిబోమని, ఆ దొంగల్ని నూరు తరాల వెనకటివాళ్ళనీ బూతులు తిడుదూ ఆ పూటకి హోటలు కట్టేశింది. కరణంగారి పెద్దకుమార్తె ఒంటిమీద నగలన్నీ దోచుకొన్నారని మన్నాడు మళ్ళా ఒక వార్త వచ్చింది. ఈ దెబ్బతో ప్రజలు బేజారెత్తిపోయి ఇళ్ళల్లో బందోబస్తు చేసుకున్నారు. ఊరిలో పోలీసుల గస్తీ ఎక్కువైంది. ఇద్దరు ఘూర్కాలు కూడా రాత్రిళ్ళు తిరుగుతున్నారు.

పోలీసు వెంకయ్య ఈ అత్యాచారాల సంగతి విని ఆపాదమస్తకం ఉప్పొంగిపోయాడు. తన ప్రజ్ఞావిశేషాలు ప్రదర్శించటానికి మరో తరుణం దొరికినందుకు భగవంతుణ్ణి అభినందించాడు. యువకావేశంతో ఒక్కసారి వేడిరక్తం నవనాడుల్లో ఉరకలెత్తసాగింది. ఈసారి దొంగను పట్టాడంటే హెడ్‌కానిస్టేబిల్ పోస్టు ప్రమోషన్ తప్పదు. ఆ విషయం స్ఫురణకొచ్చేసరికి వెంకయ్యకెక్కడలేని ఉత్సాహం వచ్చింది. తన కారాత్రి డ్యూటీ లేదు. వేషం మార్చెయ్యడంలో మంచి నిపుణత గలవాడు. వెంటనే సివిల్ డ్రెస్ వేశాడు. తలకో పాగా చుట్టి, నల్లటి కోటు వేసుకొని, కాకీనిక్కరు తొడిగి, చంకలో బుఱ్ఱ బద్దలు కొట్టే దుడ్డుకర్ర తగిలించి వెనకటి సంఘటనలన్నీ ఒక్కసారి మననం చేసికొని మీసాలు మెలేశాడు. గడియారం పన్నెండు గంటలు కొట్టింది. ఈ హడావిడికి ముసలి తల్లి లేచి "ఏడకిరా ఈ రేత్రి డూటీ ఉండదా ఎట్టా" అనడిగింది.

"జౌనే" అని ముక్తసరిగా జవాబిచ్చి "నువ్వు తొంగోశే. నీ కేందు కదంతా." అన్నాడు విసుగ్గా.

"కోటిగాడింకా రాలేదు. ఏడకెళ్లాడో ఎత్తికుంక. అమ్మ సచ్చిందన్న సింతైనా లేదాడికి. టయామెంతైం దబ్బాయ్".

"పదిగంటలే. నే నీకేం భయమే గుండె మీద చెయ్యేసుకోని కళ్ళు మూస్కొ. రెండో ఆట సినిమా కెళ్ళాడులే. "నే నొస్తా" అంటూ గుమ్మం దాటాడు వెంకయ్య. అమావాస్య చీకటి. వెంకయ్య కారునలుపు ఆ నిశీధిలో ఐక్యమైపోయింది. ఊరిచుట్టూ ఒకసారి పచారుచేసి వద్దామనుకొన్నాడు. చెప్పులు కిర్రు కిర్రుమని శబ్దం చేస్తున్నాయి. మళ్ళా వెనక్కు పోయి ఇంట్లో చెప్పు లొదిలేసి బయలుచేరాడు. ఉత్తరాన, కొండదిగువన దొరువు, దానికి షుమారు ముప్పైగజాలదూరాన ఒక పాడు పడ్డగుడీ ఉన్నాయి. ఒకసారి ఆ ప్రాంతం పరిశీలిస్తే ఎందుకైనా మంచిదనుకొన్నాడు. బజార్లల్లో గస్తీ తిరిగితే ఏమీ లాభం లేదు. కాళ్ళు పీకుడు తప్ప. ఒక ఘూర్కాని తనతో వెంటబెట్టుకొని ఇద్దరూ బయల్దేరారు. దొరువు గట్టెక్కి నిశ్శబ్దంగా నాలుగు దిక్కులు చూశాడు. ఆ కారు చీకట్లో దూరాన్నుంచే కొండ నల్లటి భూతంలాగా కనపడుతున్నాది. వెంకయ్యకి పాముచెవులు, డేగదృష్టి ఉన్నాయి. ఘూర్కావాడేదో మాట్లాడబోతుంటే నోటి మీద చెయ్యేసి 'ఛుఫ్' అన్నాడు. గాలిలో చిన్న వెలుగొకటి కనపడి టప్పున ఆరిపోయింది. ఒక మనిషి తల స్పష్టంగా కనుపించింది వెంకయ్యకు. నిశితంగా చూసి అతను సిగరెట్టో, బీడీయో కాలుస్తున్నట్టు నిశ్చయంచేసికొన్నాడు. అవ్యక్తి నెమ్మ

ఒక పెద్ద హోటల్లో మిత్ర బృందం ఒకటి అనుకోకుండా ఒకనాటి సాయంకాలం సమావేశమైంది. అందులో ఒక ప్రబుద్ధుడు యింకెవ్వరినీ మాట్లాడనీయకుండా ఎంతసేపూ తాను 'యివి చేసెయ్యగలను; అవి చేసెయ్యగలను' అంటూ తెగ వాగేస్తున్నాడు.

ఈధోరణి అంతా చూసి వాళ్లల్లో ఒక బుద్ధిమంతుడికి వొళ్లు మండుకొచ్చి "అదికాదు మిత్రమా! ఇవి చెయ్యగలను, అవి చెయ్యగలను చెప్పకుపోతుంటే యిది ఎప్పటికి తెమలను? అందుకని నువ్వు ఏం చెయ్యలేవో అవే చెప్పరాదూ?" అన్నాడు.

ఆ వాగుడుకాయ ఒక క్షణం ఆలోచించి "అల్లాగైతే సరే! నేను చెయ్యలేని పనుల్లో మొదటిది - ఈహోటల్ బిల్లు చెల్లించకలేకపోవటం!" అన్నాడు.

★ చరిత్రకందని వెంకయ్య ★

దిగా పాడుబడ్డ గుడిలో ప్రవేశించి మాయమయ్యాడు.

వెంకయ్యకు సందేహాలన్నీ తీరిపొయ్యాయి. అర్థరాత్రి, అమావాస్య చీకట్లో ఇంత నిర్భయంగా ఈ గుడికి వచ్చే వ్యక్తి తప్పకుండా దొంగే అయివుంటాడు. ఘూర్కావాడిని తనతో రమ్మన్నట్టుగా సైగచేసి తప్పటడుగులు వేసుకుంటూ గుడి వెనక్కు చేరుకున్నారు. లోపల ఖంగు ఖంగుమని శబ్దమైంది. ఘూర్కా ఉన్నట్టుండి తుపుక్కున తుమ్మాడు. వెంకయ్య అదిరిపడి గుడిద్వారం దగ్గిరికి పరుగెత్తి పొంచాడు. లోపల వున్న వ్యక్తి 'అవురే రహిమాన్ అవురే' అంటూ నిర్భయంగా బయటికొచ్చి ఎదుట నిలబడిఉన్న ఇద్దరు అపరిచితులను చూసి నిలువునా స్తంభించిపోయాడు. ఒక్క ఉదుటున లంఘించి ఘూర్కావాడు గట్టిగా నడుము వాటేసుకొన్నాడు. వెంకయ్య రెండు చేతులూ విరిచికట్టి ఘూర్కా కప్పగించి ఆ గుడంతా కళ్లతో తమిడాడు. మూలగా ఒక మూటున్నది. దాంట్లో ఏవో నగలు నాణ్యాలు, ఉన్నట్టుగా తోచి నిక్కరు జేబులో భద్రంజేశాడు. "క్యోం రే తుమ్, సువర్ కా బచ్చా" అని వెంకయ్య బయటికొచ్చి ఆ వ్యక్తిని పరిశీలనగా చూశాడు. మరుక్షణంలో ఆ వ్యక్తి తల వొంచేసి నిశ్శబ్దంగా ఏడిచాడు. "తాణాకు పద. ఇవేనా, ఇంకేమైనా గుళ్లో వున్నయ్యా" అని గదమాయించాడు. జవాబు లేదు. వెంకయ్య దార్లో తన ప్రశ్నలకి జవాబు లేకపోయేసరికి రెండు తాపులు కూడా తన్నాడు. అప్పటికీ ఆ వ్యక్తి నోరు మెదల్పకుండా తల వంచేసి నడుస్తున్నాడు.

రెండో ఆట సినిమా వదలిపెట్టేరు. జనం నానా రచ్చ, ఆర్భాటం చేస్తూ బయటికి వచ్చింది. పోలీసు వెంకయ్య, ఘూర్కా ఎవర్నో పట్టుకొస్తున్నట్టు చూసి అందరూ పరుగెత్తి చుట్టూ మూగారు. వెంకయ్య పంచాయితీబోర్డు పెట్రొమాక్సు దీపం వెలుతుర్లో ఆ వ్యక్తి మొగం జుట్టుపట్టుకొని పైకెత్తాడు. 'నీవా' అని నిర్ఘాంతపోయి "ఘూగాడైకొడకా, చావు" అంటూ ఎడంకాలితో ఎగిరి గుండెమీద తన్నాడు.

మన్నాడు జైల్లో కొడుక్కు పహరా ఇచ్చే పోలీసు వెంకయ్యని చూడటానికి జనం విరగబడివచ్చింది. ★

★ కామెడీలో ట్రాజెడీ ★

(14-వ పేజీ తరువాయి)

అయ్యారూ. తలుపు తీస్తావా, రాళ్లెయ్యమన్నావా?

(ముసుగువిగ్రహం వొత్తిగిలుతుంది. ఒకటోరాయి మంచానికీ రెండోరాయి తుంటికీ మూడోరాయి కంటికీ తగుల్తాయి. వెంటనే విగ్రహం లేస్తుంది. మంచం క్రిరుమంటుంది. మ్యూజిక్ డైరెక్టరు యుద్ధవిజయ గీతం ట్యూన్ వేస్తాడు)

అయ్యారు: (తలుపు తియ్యకుండానే) ఎవడురా వాడు! రాళ్ళు మీదమీదకు రువ్వినాడు! నడురాత్రి సమయమే! ఎవ్వడురా ఆ పైత్కారి! ఎవుడురా ఆ ముశ్కాళ్!

(తలుపు 'ధన్'మని తెరుచుకుంటుంది. అయ్యారు వరండాలోకొస్తాడు.)

అయ్యారు: (కంటిన్యూటీ పోకుండా) ఎవుడురా ఆ యిడియట్! ఎవుడురా ఆ ఫూల్!

నాయుడు: ఒరేయ్, మాటలు సరిగ్గా రానీయ్. పైత్కారీ, ఫూల్ అంటే పీక నొక్కెయ్యగలను. ఏమిట్రా నీ నాటకం. ఇంతమందికి మెళుకువవొస్తే నీకు రాలేదేం? ఇడియట్!

అయ్యారు: ఏమి చేస్తువురా డామిట్! మెడపట్టి వూడుస్తును!

(ఇక్కడ ఒక చిన్న స్టంటు చేయించాలి. స్టంటు లేకపోతే సినీమాలకి డబ్బు రాదంటారు పెద్దలు, అంటే డైరెక్టర్లు. అయితే స్టంటు మోడరన్‌గా వుండాలి, కత్తులూ, కటార్లూ, తుపాకులూ, బందూకులూ ఏమీ వొద్దు. పోతన్నగారన్నట్టు "సమాజంబులగు కరాంజలులు లేవున్నవే!" వొట్టి చేతులతోనే.)

(యుద్ధం తీవ్రంగా జరుగుతోంది. అయ్యారు అలిసిపోయాడు. అయ్యారు తల నాయుడి చేతిలో వుంది. ఈ సందర్భంలో వెంగళప్ప కొంప్‌కాట్‌కి తగులుకున్న గోడుగుకామ అయ్యారుకి అందిస్తాడు. అయ్యారు కర్రతీసుకుని 'థాంక్స్' చెప్పి ఆ కర్రతో నాయుడిని కొడతాడు గట్టిగా. నాయుడు "అమ్మా" అంటాడు.)

(జనం చూసి ఆశ్చర్యపోతారు.)

గీతారావు: ఆ దేమిట్రా, నీకోసం యుద్ధంచేస్తున్న నాయుడికెదురు తిరిగావు?

ఆచారి: లేకపోతే అయ్యారు తరవాత వాడిని తన్నడూ!

నాయుడు: (వెంగళప్పకేసి చూసి) *You too Brutus!* హతోస్మి, హతోస్మి. (అంటూ పరిగెడతాడు అయ్యారుని తప్పించుకుని. అయ్యారు వెంటబడతాడు. ముందు నాయుడు, వెనక అయ్యారూ. రెండు సెకన్ల తరవాత అయ్యారు వెనక్కి తిరుగుతాడు.)

(అవతల చీకటి. అమావాస్య. అర్థరాత్రి. "ఢా ఢా ఢా ఢా" ఉరుము మెరుగు. "ఫే ఫే ఫే ఫే" నాయుడిగొంతు. ఫేడవుట్. గడియారం ఠంగు ఠంగున రెండు కొడుతుంది.) ★

(సీరియల్ నవల)

దత్తత

7

రెండుసంవత్సరాలు గడిచిపోయాయి. మళ్ళీ చంద్రయ్య ఒక్కసారి కూడా రాలేదు, ఇక వచ్చి తన కష్ట సుఖాలు కనుక్కుంటాడనే నమ్మకం కూడా శాంతమ్మకు లేదు.

వెంకమ్మ దగ్గూ ఆయాసంవల్ల మంచం పట్టింది. ఆమెకు సేవచేస్తూ నాలుగు మెతుకులు తింటూ జీవనోపాధి చేస్తోంది. కాని భవిష్యత్తు తలపునకు వచ్చేటప్పటికి శాంతమ్మ కంపించడం జరుగుతుంది. రవి యిప్పుడిప్పుడే తప్పటడుగులుమాని సాఫీగా నడవగలుగుతున్నాడు. రామూ జ్ఞాపకానికి వచ్చినప్పుడు, ఏదో ఆశ శాంతమ్మ అంతరాన మెదిలేది. కాని వెంటనే నిస్పృహతో కూడిన ఒక నిట్టూర్పు విడిచి పెట్టేది.

ఒకరోజు ఉదయం లేచి చూసేసరికి సావిట్లో ఒక అపరిచితయువకుడు కూర్చుని వున్నాడు. తెల్లవారు ఝాము అయిదుగంటల బండికి రైలుదిగి వచ్చినట్లుగా ఆమె ఊహించింది.

మనిషిని చూస్తే; నాగరికుని వేషంతో ఉన్నాడు. ఎదురుగా రెండు పెట్టెలు, ఒక బెడ్డింగూ పడి ఉన్నాయి. ఎరమరిక ఏమీలేకుండా చావిట్లో ఉన్నవాలు కుర్చీ మీద కూర్చొని సిగరెట్టు పీలుస్తున్నాడు.

శాంతమ్మ మెల్లగా కుర్చీని ప్రక్కనుంచి తప్పుకొని వెంకమ్మ గదిలోకి వెళ్లిపోతుంటే—"మీరెవరూ?" అని వెనకనించి ఆపెద్దమనిషి ప్రశ్నించాడు. శాంతమ్మ ఆశ్చర్యంగా చూసింది. తాను వేయవలసిన ప్రశ్న అతడే వేశాడు. సమాధానం యివ్వడం ఆమెకు యిష్టం లేక వెంకమ్మ గదిలోకి వెళ్ళింది.

ఈదృశ్యం మరీ ఆశ్చర్యాన్ని కలిగించింది శాంతమ్మకు. వెంకమ్మ మంచం ప్రక్కగా ఒక తుంగ చాప పరుచుకొని, ఒకయువతి గాఢ నిద్రలో మునిగిఉంది.

"అత్తా" శాంతమ్మ వెంకమ్మ దగ్గరకు వెళ్లి మెల్లగా పిలచింది. వెంకమ్మ సుఖ నిద్రలో చిన్నగుర్రు కూడా పెడుతూ వుంది.

"అత్తా!" కాస్త బిగ్గరగా పిలచింది మళ్లీ. క్రిందపడుకున్న యువతి కాస్త కదలి "ఆరాత కోతలు పూర్తిచేయండి...తరువాత మాట్లాడదాం" అని అస్పష్టంగా పలికింది. శాంతమ్మ కాస్త దూరంగా తప్పుకొని పరిశీలించి చూస్తుంది.

వెంటనే నవ్వు వినిపించి వెనక్కి తిరిగి చూసింది.

శ్రీ పినిశెట్టి
శ్రీరామమూర్తి

"కలవరింతలు లెండి మీరేం కంగారు పడొద్దు...తెల్లార్లూ రైలుప్రయాణం"

చావిట్లో కూర్చున్న అతనే గది గుమ్మంలోకి వచ్చి ఆమాట అన్నాడు.

"అయితే మీ రెవరో చెప్పేరుకాదు" మళ్ళీ ప్రశ్నించాడు శాంతమ్మ సమాధానం యివ్వలేకపోయింది.

"రాత్రి వీధి తలుపు వేసింది మీరేనా ?" కాస్త ఆక్షేపణగా ధ్వనించిందా స్వరం.

శాంతమ్మ ఆలోచించింది. తాను చేసిన పొరపాటు గుర్తించింది. వీధి తలుపు గడియ వేయకుండా తలుపు జేరవేసి, పరధ్యాన్నంగా వచ్చి పడుకుంది.

"ఎవరయినా దొంగలు వచ్చినా అంతె కదూ?" అది నిజమేకావచ్చు. ఆ అపరిచితవ్యక్తి, ఇంత చనువుగా మాటలు కలపడం శాంతమ్మకు చిరా కనిపించింది.

"అత్తా" ఈసారి బిగ్గరిగా తట్టిలేపింది. వెంకమ్మ త్రుళ్లిపాటుగా కళ్ళు తెరచింది. "ఏవమ్మా" ఆందోళనగా లేవకుండానే ప్రశ్నించింది.

"అమ్మా" ఈకంఠం విని గుమ్మంవైపునకు తలెత్తిచూసింది. మనిషినికూడా గుర్తించింది. కాని ఏమీ ప్రశ్నించలేదు. ఆమె మొగంలో ఒకవిరక్తి భావం వెల్లడికావడం శాంతమ్మ గమనించింది.

"నాలుగు గంటల బండికి వచ్చాంతే! నీ ఆరోగ్యం ఏలావుందీ ?" ఈమాట అంటూనే మంచం దగ్గరగా వచ్చాడు.

"పెద్దమ్మ యిప్పుడు కావలసివచ్చినట్లుంది" అని వెంకమ్మ మొగం ప్రక్కగా తిప్పుకుంది.

"ఏంచేయను పెద్దమ్మా...ఊరి కాని వూళ్లో ఉద్యోగం. నెల్లాళ్ళనించి ప్రయత్నంచేస్తే; ఈనాటికి కాస్త శెలవు దొరికింది" అంటూనే చనువుగా వెంకమ్మ కాళ్ళదగ్గర కూర్చుని "పెద్దమ్మా! వా రెవరూ?" మళ్ళీ శాంతమ్మకేసి చూస్తూ అడిగాడు.

పదేపదే ఈలా ప్రశ్నించడంలో తగిన కారణం లేకుండా పోదని శాంతమ్మ గ్రహించినా - శెలవులో వచ్చిన మనిషికి తెలుసుకోతగ్గ కాలం కరువు కాలేదని కూడా తెలుసుకుంది. అందుకే కాస్త దూరంగా తప్పుకుంది.

"మా మేనగోడలు."

"అరె! రామయ్యచౌదరీ భార్యా?"

దీనికి వెంకమ్మ సమాధాన మివ్వలేదు.

"పెళ్ళి నాడు చూశాను...అబ్బో! అప్పుడే పన్నెండేళ్ళయింది. అప్పుడు నేను స్కూల్ ఫైనల్ చదువు

★ దత్తత ★

తున్నా-" అని కాస్సేపాగి "పాపం! ఆయన బావున్నాడా" అని నోరు అలాగే ఆవలించి కాస్సేపటివరకూ ఉంచాడు.

శాంతమ్మకు ఈ ప్రశ్నే మరొకళ్ళు వేసివుంటే తప్పక తనకు నవ్వు వచ్చేదేమో; హిందూస్త్రీని కళ్ళారా చూసి కూడా కన్యో, పునిస్త్రీయో, విధవో, గుర్తించలేని హిందువు దున్నాడంటే;ఆడది తప్పకుండా నవ్వుతుంది. అయితే మతాన్ని విస్మరించిన మనువ కాదని తెలిసికూడా ఈ తెలివి తక్కువ ప్రశ్న వేయడంలో, పూర్తిగా అమాయకత్వం కాదనీ, అతిగా మాట్లాడే వాళ్ల లక్షణాల్లో ఇదొకటని మాత్రం శాంతమ్మ ఊహించింది.

"ఏమేవ్!" అని క్రిందకూస్తూ బిగ్గరగా పిలచాడు.

"అబ్బబ్బ! చంపుతున్నారే...ఒకటే గోల" అంటూ అటు తిరిగి పండుకుంది.

"ఇస్! ఇది మన యిల్లు కాదే" అన్నాడు నోరు నొక్కుకుంటూ.

"ఎవరిల్లు కానివ్వండి...బద్ధకం తీరే వరకూ చచ్చినా లేవను" వెంటనే కాళ్లు ముడుచుక పండుకుంది. మళ్లీ కాస్త చలించి "ఏమన్నారూ? మనిల్లు కాదూ?" అని లేచి చాపమీద కూర్చొని "పరాయి యిల్లుగా చేద్దామనేగా యింత కాలం పట్టనట్లు కూర్చున్నారు!" ఈసారి లేచి, మంచమ్మీదఉన్న వెంకమ్మను చూస్తూ "విన్నావూ? అత్తయ్యా? చెవిని యిల్లు కట్టుక పోరగా పోరగా యిచటికి కదిలేరు. కన్న తల్లి వేరున్న పెత్తల్లంటే వేరూనా? మనుషులకి కాస్త జ్ఞానం ఉండాలి..."అని ఆయన మొగంలోకి కోపంగా చూస్తూ, "మీ చదువుకీ - మీ వెలుక్కీ కారణం ఎవరో మర్చిపోతే పుట్టగతులుంటాయా?" అని అడిగింది.

"ఊ-రు-కోవే" వెంకమ్మ మెల్లగాఅంది. కంఠంకూడా ఆమెకు కళ్లనీళ్లు వచ్చినట్లుగా స్ఫురింపచేస్తుంది. రవి అప్పుడే లేచి

"అమ్మా!" అంటూ పిలిచాడు. శాంతమ్మ తన గదిలోకి వెళ్లిపోయింది.

వెంకమ్మ ఆపత్కాలంలో ఆదుకోడానికివచ్చిన ఈ పుణ్యదంపతులిద్దరూ వెంకమ్మకు కావలసినవాళ్లు.

మరదికొడుకైన రవణయ్యను చిన్ననాటి నించీ స్వంతకొడుకుగా పెంచి పోషించి విద్యాబుద్ధులు చెప్పించింది వెంకమ్మ. ఒకయింటివాణ్ణిగాకూడా తనేచేసింది, అయితే కాకిగూటిలో పెరిగిన కోకిలలా రెక్కలు రావడంతోనే తన పరివారంలో చేరిపోయాడు. ప్రస్తుతం నెల్లూరులో పోస్టు క్లార్కు ఉద్యోగం చేస్తూ భార్యతో అక్కడే ఉంటున్నాడు.

ఇంతకాలానికి పెత్తల్లిని చూడ్డానికి రావడంలో అంతరంగికంగా పెంచిన ప్రేమ లేదని అనలేముగాని, హోటలు పెట్టి స్వయంకృషితో పదివేలరూపాయలవరకూ ఆర్జించి ఉంచిందనీ యిక ఎంతోకాలం బ్రతకదనే, వదంతి యధార్థంకాదనే నమ్మకంకూడా అతన్ని రప్పించి ఉంటుంది.

రవణయ్య భార్యపేరు కాంతం. భర్తను మించిన వాగ్ధాటి, భర్తపడే పొరపాట్లు సవరించగల నేర్పరితనంకూడా ఆమెలోఉంది. శాంతమ్మ పనిపిల్ల సహాయంతో పనిపాట్లలో మునిగిఉంది. కాఫీలు అయిన తర్వాత శాంతమ్మ వెంకమ్మ గదిలోకివచ్చి "ఏం కూరలు చేయనత్తా"అని అడిగింది.

వెంకమ్మ ఆలోచిస్తుంది.

కాంతం మెల్లగా అంది "అత్తయ్యా! నల్లకోడి ఏమన్నా గుడ్లు పెడుతోందా?"

వేరే ఆలోచనకు తావివ్వక వెంటనే "దాని మొగంలే నాలుగురోజులు గుడ్లు పెడితే, నెల్లాళ్లు అణుగుతుంది" అని వెంకమ్మ సమాధానం యివ్వగానే రవణయ్య గుటకలు వేస్తూ "అయితే ఎందుకూ! యీరోజు కోడిని కానివ్వండి" అన్నాడు.

కాంతం నవ్వింది "సిగ్గూబొగ్గూ లేదు... వచ్చినచుట్టాలు అడిగి ఎక్కడైనా వంట చేయించుకుంటారా?" అని అంది.

"ఎక్కడైనా చేయించుకోవచ్చు— ఇక్కడ మాత్రం కాదు. ఇది నా స్వంత యిల్లు...ఇష్టంలేకపోతే నువ్వు తినడం మానేయి" మొహం పెడగాపెట్టించి, తన తెలివితేటలకు తనే ఆనందించే దుస్థితిలో ఉన్నాడు రవణయ్య.

ఆ భంగిమచూసి కాంతం రెండోసారి కూడా నవ్వింది. శాంతమ్మ అంతసేపూ నిలబడి చూడ్డం కొంత విసుగ్గానే తోచింది "ఏం చేయమంటావూ?" అని మళ్లీ రెట్టించి అడిగింది.

ఆ కోడిపెట్టపై తనకున్న అభిమానాన్ని మరచి అనాలోచితంగా అన్నమాట వెంకమ్మను ఇరుకునపడేటట్లు చేసింది "సరే కోణ్ణి కోయించు"అని మెల్లగా మూలిగింది.

శాంతమ్మ వెనక్కి తిరిగింది.

"ఏం అక్కా! నన్ను పరాయిదానిలా అనుకుంటున్నావా?" అని కాంతం ప్రశ్నించింది.

ఈ అకారణనిందకు శాంతమ్మ ఆశ్చర్యంగా వెనక్కు చూసింది. లేదమ్మా" అని కూడా అంది. కాంతం నవ్వబోయి ఆగిపోయింది. వెంకమ్మకేసి చూస్తూవుండిపోయింది.

ఆ ప్రశ్న ఆ ప్రవర్తనలో అర్థాన్ని శాంతమ్మ గుర్తించలేదు. గుర్తించాలని ప్రయత్నించలేదు. మెల్లగా వెళ్లిపోయింది.

"అంగటికి పోయివస్తా ఏం తోచట్లే" వళ్లు విరుచుకుంటూ లేచాడు రవణయ్య. వెంకమ్మ సరే అన్నట్లు తలపంకించింది.

కాంతం ముందుగానే లేచి వెళ్ళింది. రమణ చావిట్లోనించి వీధి గుమ్మంలో అడుగు పెట్టబోతుంటే "మాట" అనే మాట వినిపించింది.

కాంతం రెండో గది గుమ్మంలో నిలబడి వుంది. రవణయ్య భార్యదగ్గరగా వచ్చాడు.

"నేను చెప్పింది ఏం చేశారూ?" కొత్త రహస్యంగా ధ్వనించిందా కంఠం.

"ఇదిగో వెళుతున్నాగా" ఒకడుగు వేసి వెనక్కు తిరిగి "మరి అమ్మతో చెప్పద్దూ?" అనూయికంగా మొగం పెట్టి అడిగాడు.

"అయ్యో! తెలివి" చేతులు తిప్పి, పెదవి విరచింది కాంతం.

ఈ అభినయంతో రవణయ్య కొత్త చిన్నబుచ్చుకున్న చిహ్నాలు మొగంమీద కనిపించాయి.

కాంతం భర్త చెవిదగ్గరగా మొగంపెట్టి, కళ్లు పెద్దవిగాచేసి "అడక్కుండా తీసుకు రావడమే మంచిది. అడిగితే ఆమె ఒప్పుకుంటుందా?" అని అడిగింది కాంతం.

"ఔనౌను" తల పంకించాడు.

"వెళ్లండి మరీ" అని హెచ్చరించింది మళ్లీ కాంతం.

రవణయ్య వెళ్ళిపోయాడు.

వంట చేస్తున్న శాంతమ్మ దగ్గరగా కాంతం వెళ్లి, క్రింద ఉన్న ఉల్లిపాయ

(52-వ పేజీ చూడండి)



విజ్ఞాన వీధులు

"డాక్టర్"




113. సూర్యరశ్మి 'కుక్కర్'


అనగా ఏమిటి? అని చీరాలనుంచి పాలెపు బిక్షాలుగారు అడుగుతున్నారు.

సూర్యరశ్మిలో వేడి ఉన్నదని అందరికీ తెలుసును. ఎండలో పెట్టి వదలిన కాగులోని నీళ్లు వేడెక్కుతాయని కూడా మనకందరికీ తెలుసును. అయితే బియ్యాన్నిగాని, కూరల్నిగాని వండడానికి నీళ్లు సలసల మరగాలి. ఎండ వేడి నీళ్లనిమరిగించడానికి చాలదు. ఇక ఎండవల్లనే వంట చెయ్యాలంటే ఏమి చెయ్యవలసిఉంటుందీ? చాలా మేరపడే యెండని కొంచెము మేరకి కేంద్రీకరింపజేసి, సూర్యకిరణాలు కేంద్రీకరించినచోట కుక్కరు పాత్రపెట్టాలి. అప్పుడు పాత్రయొక్క వైశాల్యమున్నంత మేరలోనే పడే సూర్యరశ్మి మాత్రమేకాక చాలా మేరలో పడే సూర్యరశ్మి పాత్రని వెచ్చబెట్టడానికి పనికివస్తుంది. నీళ్ళు మరుగుతాయీ, కూరలూ ఉడుకుతాయి.

అయితే ఏసాధనమువల్ల ఎక్కువ మేరని పడే సూర్యరశ్మిని ఒక చోట కేంద్రీకరింపజేయవచ్చును? అద్దమువల్ల. కాని అద్దము బల్లపరుపుగా వుంటే కేంద్రీకరణము జరగదు. ఈ అద్దము కందులు వేయించుకునే బాణలిలాగ, అంటే కుండ అడుగు భాగం లాగవుంటే, పటములో చూపించినట్లు దానిమీద పడ్డకిరణాలన్నీ ఒకే కేంద్రముదగ్గర కలుస్తాయి. అక్కడగాని పాత్రని ఏ ఇనప కమ్మీల మీదో నిలబెట్టినట్లయితే పాత్రకి. విశాలమైన మేరని పడ్డ సూర్యరశ్మి అంది, పాత్రలోని నీరు మరుగుతుంది. అయితే ఈ అద్దము గాజుది కానక్కరలేదు. అల్యూమినియము రేకులు, ఒక వైపు మెరుగుపెట్టినవి వాడి, ముక్కలన్నీ చేరి అద్దమయేటట్లు చెయ్యవచ్చును. సూర్యుడు నడునెత్తినుండి వాలినకొద్దీ, పాత్రని జరుపుకుంటూ ఉండాలి.



సముద్రము నీటిని మరిగించి, ఆవిరిని చల్లారిస్తే త్రాగేనీరు అవుతుంది. ఇలాగ మంచి నీరు నీరు పోగాపోగా చిక్కబడ్డ ఉప్పునీటిని ఎండబెడితే ఉప్పు అవుతుంది. ఇది జరపడము ఎలాగా?




పటములో 'అ' అన్నది అల్యూమినపు రేకుతో పొడుగాటి దోన్నెలాగ వంచిన 'అద్దము'. ఇది తూర్పు పడమరలకి వుంటుంది. సూర్యరశ్మి దీనిమీదపడి, పొడూగునీ నడిచే గొట్టాముమీద కేంద్రీకృతమై ఆ గొట్టములోని సముద్రపు నీటిని లేదా ఉప్పునీటిని వెచ్చబెట్టుతుంది. ఆవిరి క్రమంగా 'ఆవిరి' అన్నవైపుకీ, నీరు బరువు కనక కిందికీ వెళ్లుతుంది. ఆ ఆవిరిని వంపులు తిప్పిన గొట్టాముద్వారా పోనిచ్చి, ఈ గొట్టాన్ని ఉప్పునీటితో చల్లబరిస్తే వంపు గొట్టాము కొసనుంచి బొట్లుబొట్లుగా మంచి నీరు వస్తుంది. వంపుగొట్టాము పందిట్లో నీటితొట్టెలో మునిగివుండీ, దాని కొస పైపులాగ పైకి రావచ్చును. అద్దము ఎండలో ఉండాలి. సూర్యుడు క్రమంగా ఎక్కే దారి చూసుకుని అద్దాన్ని ఉత్తరానికిగాని దక్షిణానికిగాని వంచుకోవచ్చును. ఈ సర్దుబాటు రోజు కొక్కమారు చేస్తే చాలు. దీనినుంచి వచ్చే నీరు నిరోగము.

నీరు గొట్టాములో ప్రవహించే వేగము బహుకొద్ది. నీరు వచ్చేసేవేపు కొంచెము ఎత్తుగా పెడితే నీరు నిలిచి, వెచ్చబడుతుంది. గంగాళంలో నీరుపోసి, కింది పైపులోంచి నీరు గొట్టాములోకి బొట్టు బొట్టుగా వదలడము మెరుగు. ఉప్పునీరు ఎక్కువ చిక్కబడితే గొట్టాన్ని లోవైపు తినేయవచ్చు. నీటివేగాన్ని హెచ్చిస్తే ఈ చిక్కదనము తగ్గించవచ్చును.

114. విత్తు ముందా చెట్టు ముందా?

అన్న ప్రశ్న పెద్ద గడ్డు ప్రశ్న కింద లెక్క. కాని ఆధునిక విజ్ఞానదృష్ట్యా ఈ ప్రశ్నకి జవాబు చెప్పడము చాలా సులువు. ఏమంటే ఒకే ఒక్క జీవకణమునుంచి, విత్తనాలు పెట్టే చెట్లవరకూ జరిగిన పరిణామంలో విత్తనాలసాయం లేకనే వృద్ధి అయే మొక్కలెన్నో వున్నాయి. సూక్ష్మ జీవులవంటి ఏకకణపు మొక్కలు రెండుగా విడిపోతాయి. ఒకభాగం పెద్దదీ, రెండోది చిన్నదీను. ఈ చిన్నభాగం పెద్దదై తానే ఒక మొక్క అవుతుంది.

గరికి గడ్డిమొక్కని తవ్వి పరిశీలించండి. మర్రి చెట్టులాగ శాఖలకి అక్కడక్కడ వేళ్లు పెట్టి, వేళ్ళు పెట్టే చోటనల్లా వేరే మొక్కలాగు పెరుగుతుంది. గన్నేరు మొక్క పువ్వుల్ని విత్తనాల్ని పెట్టినా, పై రీతి శాఖీయోత్పత్తి చేసుకుంటూనే వృద్ధి అవుతుంది. విత్తనాలు తయారయ్యేలోపున గన్నేరు చాలా దూరం వ్యాపించిపోతుంది. గన్నేరులో చెట్టే ముందనాలి. చెట్టు బాగా పిల్లలతో వృద్ధి అయిన తర్వాతే విత్తనాలు బయల్దేరతాయి.



కి త్తనార ఒకటి. ఐదారు ఏళ్ళదాకా, అరటిచెట్టు పిలకల్ని పెట్టి వంశాభివృద్ధి చేసుకున్నట్లు, శాఖోత్పత్తివల్లనే వృద్ధి అవుతుంది. ఏడేళ్ళ తరవాత కాబోలు వృంతము పొడుగ్గా పెరిగి పాగడ రంగు పూలు పూచి విత్తనాలు పెట్టి, మొక్క చచ్చిపోతుంది. విత్తనము చెట్టు చాలా ముదిరిన తర్వాత గాని రాలేదు. కాని వంశ వ్యాప్తి మాత్రం విత్తనాల సాయం అక్కర లేకుండానే జరిగిపోయింది.

అంటే విత్తన మన్నది చెట్టు బాగా పరిణతి పొందిన పిమ్మటనే పుట్టుతున్నది. వృక్షజాతి వికాసము విత్తనాలు పెట్టే చెట్లలో కడలేరుతోంది. అంటే చెట్టే ముందు, విత్తు తరవాతిదే నన్నమాట.

చిట్టిప్రశ్నలు - జవాబులు

—అవును సూర్యచంద్రగ్రహ నక్షత్రాదులవలెనే భూమికూడా ఆకాశంలో నిరాధారంగా ఉంది. భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతూ తనకక్ష్యనుంచి తప్పుకుపోడానికి యత్నిస్తుంది. సూర్యుడు భూమిని ఆకర్షిస్తూ అలా తప్పుకుపోనివ్వకుండా పట్టి ఉంచుతాడు.

"ఒకవేళ భూమిని ఆదిశేషుడు మోస్తున్నాడంటూ మనుకొండి. ఆదిశేషుని ఎవరు మోస్తున్నారూ ? కులపర్వతాలా ? వాటి నోమరి ? ఇలా ఎంతమంది భారవహులను చెప్పినా, చివ్వరి వారు ఆకాశంలో నిరాధారంగా వున్నారనాలి. మరి భూమే నిరాధారంగా వున్నదనుకోకూడదా" అని సూర్యసిద్ధాంత రచయిత వ్రాశాడు.

ఏ కారణముచేతనయినా భూమియొక్క వేగము ఎక్కువైతే సూర్యుడి ఆకర్షణశక్తికంటె భూమి భ్రమ్మరితనము ఎక్కువై సూర్యుడికి దూరంగా వెళ్ళిపోతుంది. సూర్యుడి నించి భూమికి అంటే వేడి తగ్గిపోయి ప్రాణికోటి నశించి పోతుంది. ఆ తర్వాత ఏమైతే మనకేం ?

—చంద్రమండలములోగాని మరి ఏ ఖగోళములోగాని మనముజీవించడానికి అనుకూలమైన ఉష్ణతా, ఆహారపదార్థాలు ఏర్పడడానికి కావలసిన కర్బనము లేదని శాస్త్రజ్ఞుల అంచనా. ఆ లోకాలన్నిటి లోనూ మనము జీవించలేము. దర్శించి రావడానికి వీలు చేసుకోవచ్చుననే నమ్ముతున్నారు ఈనాటిదాకా.

—ఏ వస్తువేనా మనకి కనబడాలంటే దానినుంచి వెలుతురు మనకంటికి చేరాలి. ఒక వస్తువునుంచి మనకంటికి వచ్చే వెల్తురు, ఆ వస్తువుయొక్క ఉపరితలమునుంచి పరావర్తమై వచ్చిన వెల్తురు కావచ్చునూ, ఆ వస్తువులో వెలుతురు ప్రవేశించి, దానిలోని కణములు విరజిమ్మడమువల్ల మనవైపు చెదిరిన వెల్తురు కావచ్చునూ, ఆ వస్తువు వెనకనుంచి మనవైపు చొచ్చుకువచ్చే వెల్తురు కావచ్చును. తెల్లని మేఘాలలోని కణాలు కాక, వాటి ఉపరితలము పరావర్తము చేసే వెల్తురే మనకి చేరుతుంది. తెల్లని వెల్తురు పరావర్తమౌతోంది గనక ఆ మేఘాలు తెల్లగా కనపడతాయి. నల్లని మేఘాల్లో బొగ్గుకణాలూ నీటికణాలు విరజిమ్మే వెల్తురు చేరుతుంది మనకి. ఆ వెల్తురులో నీలివర్ణము పాలు ఎక్కువ. కనక వాన మబ్బులు నీలివర్ణముతో కనబడతాయి. ఇక ఎర్రమబ్బులో ? వాటి వెనకవైపు ఉన్న పొరలవల్ల పరావర్తమైన తెల్లని వెల్తురు మనవైపు ఉన్న పొరలలోంచి చొచ్చుకుని మనవైపు రావడంలో, ఆ తెల్లవెల్తురులోని, నీల, హరిత, ఊదా, నీలలోహితవర్ణాల కిరణాలు ఇటూ అటూ ఎక్కువ చెదిరిపోయి, మిగిలిన ఎరుపూ, పసుపూ రంగుల కిరణాలే మనకి చేరడమువల్ల ఎర్రగా, కనబడతాయి. అంటే ఎర్రమబ్బుల రంగు వాటిది కాదు అన్న మాట. దూరపుకొండల నీలిరంగు కూడా వాటిది కాదు. వాటినుంచి మనకి వచ్చే వెల్తురుతో, ఆకొండలకీ మనకీ నడుమ గల గాలికణాలు విరజిమ్మే నీలికిరణాలు చేరుకుని మనకి అంది, కొండలు నీలంగా వున్నట్టు చూపిస్తాయి.

—ప్రాణము అంటే ఏమిటో ఆధునిక వైజ్ఞానికులు నిర్ణయించుకోలేదు. ఇక జంగమ ప్రాణానికీ స్థావరప్రాణానికీ భేదం చెప్పడం ఎలాగ?


—నిమ్మరసములో సిట్రిక్ యాసిడ్ అనే మందమైన ద్రావకము ఉంది. ఈ ద్రావకము లోహాలని తిని, లోహాల లవణములను తయారుచేస్తుంది. ఈ లవణములకు లోహాల మెఱుగు వుండదు. అందువల్లనే మచ్చలు లాగ కనపడతాయి. వెండికంచములో, గంధపు పాలు గల కూరలను కొంత సేపు ఉంచితే ఆచోట 'రజత గంధకిదము' అనే లవణము ఏర్పడి నల్లని మచ్చగా కనపడుతుంది.

—జాతకాలూ, శకునాలూ, గౌళిపలుకుల ఫలాలూ, సుదిన దుర్దినాలూ, రాహుకాలాలూ, గ్రహణపు మొర్రిలూ, తుమ్ముల ఫలితాలూ, రత్నాల మంచిచెడ్డలూ, సాముద్రికమూ,—ఇవన్నీ నమ్మకాల మీదనే ఆధారపడి వున్నాయిగాని, వీటి ఫలితాలకి నిరూపణలేదు. నమ్మకము అనగానే మీ యిష్టము. అక్కడ మరొకరి యిష్టానికి ప్రమేయములేదు. ★



'సంక్రాంతి సంబరాలు'

బెసెంట్ థియోసాఫికల్ స్కూలు (మద్రాసు) విద్యార్థిని సి. ఎల్. శాంతి గీసిన చిత్రం



బాతులు

కుమార్ అనే నాలుగేళ్ల బాలుని వూహాచిత్రం

…లబాలికల చిత్రకళ

ఫర్ వరల్డ్ ఫ్రెండ్‌షిప్ సంస్థ సహకా…
…లో బెసెంట్ థియొసాఫికల్ స్కూలు
…కారులు అడయారులో ఇటీవల అమెరి…
…బాలబాలికలు వేసిన 33 బొమ్మలతో
…), తమ స్కూలు విద్యార్థులు వేసిన
…చిత్రాలను జతపరిచి ప్రదర్శనం జరిపారు.



గ్రామ జీవితం

చిత్రకారిణి: చి॥ డి. రుక్మిణి (వయస్సు 11)



కంచరగాడిద

మార్గన్ స్కూలు (అమెరికా)
పంపిన చిత్రం

బొమ్మరిల్లు

పాపాయి పాప

రచన: శ్రీనివాస కాశ్యప

★

"అమ్మ తెచ్చానమ్మ
బొమ్మ తెచ్చాను!
బొమ్మకూనీళ్ళోసి
బొట్టు పెట్టాను!

* * * *

చిట్టి పాపాయమ్మ
చిన్నారి పాప!
ఒట్టినే యేడుస్తు
రచ్చ చేస్తోంది!

* * * *

అస్తమానూ నేను
ఆడించలేనూ!!
బొత్తుగా చెయిదిగదు
పోరుపెడుతోంది!

కొస్త పాలోస్తేను
కక్కేసి పాప—
పిక్కటిల్లిందమ్మ
పక్కమీదుండే!"

* * *


అని తనలో తానేమొ
అనుచుండగానే—
అమ్మొచ్చి వాకిట్లో
నిలుచుండి పోయె!

* * * *

అమ్మరాకను చూచి
గుమ్మమ్ము చాటునే
సిగ్గుతో దాగింది
చిట్టి పాపాయి.

•

జంతుకోటిలో మానవలక్షణాలు



(గతసంచిక తరువాయి)

తల్లి యిచ్చే స్తన్యం తాగి బ్రతికే వర్గానికి చెందిన జంతుతతిలో తల్లి జంతువులకి పిల్లలపై మమకారం వుండటం చాలా ప్రధాన లక్షణం. ఈవర్గానికి చెందిన జంతువు లన్నిటిలోనూ పసి పిల్లలను పెంచి పోషించే బాధ్యత తల్లి ప్రాణి మీదనే వుంటుంది. అంతటి బాధ్యత పైన వేసుకొని పిల్లలను సాకుతాయి కనుకనే, యీ తల్లులకు పిల్లలపై విపరీతమైన ప్రేమవుంటుంది.

తను కన్నబిడ్డలపై ప్రేమ వుండటం సహజమే. కానీ ఆప్రేమా తిశయంలో అవి తన బిడ్డలైంది, యితర తరహాల జంతువుల తాలూకు కూనలైనదీ కూడా చూసుకోకుండా యీ తల్లులు వాటికి పాలిచ్చి పోషించుతాయి.

తను కన్న కూనలని కారణాంతరాల చేత పోగొట్టుకొన్న పిల్లి, కుక్క పిల్లలకీ, కుందేలు పిల్లలకీ, వుడత పిల్లలికీ పాలిస్తుంది. పిల్లులు సామాన్యంగా ఏడాదికి 15 మొదలు 20 దాకా కూనలని కంటాయి. ఏడాది ఏడాదికి 20 పిల్లుల చొప్పున యింట్లో పెరిగిపోతూ వుంటే, ఎంత పిల్లుల ప్రియుడైనా, అందుకు ఒప్పుకోడు. పిల్లి యీనగానే దాని కన్నుగప్పి ఆపిల్లలని దూరంగా పట్టుకుపోయి వదిలెయ్యనైనా వదిలేస్తాడు; లేకపోతే ఏ చెరువులోనైనా పడేసి చంపేస్తాడు. ఆవిధంగా ఎప్పటికప్పుడు సంతానాన్ని కోల్పోయే పిల్లి, కాలుకాలిన పిల్లిలా వాడవాడల తిరిగి, తల్లి చాటున లేకుండావున్న ఏకుక్క పిల్లనో, కుందేలు పిల్లనో, నోటగరిచి తెచ్చి తన నివాసంలో పడేసుకొంటుంది. తన సంతు యింకేవైనా మిగిలి వుంటే, వాటితో పాటు, యీ ఆంగతుక సంతానానికి కూడా సమానంగా పాలిస్తుంది.

ఇటీవల మన ఆంధ్రదేశంలో ఒకచోట తల్లి లేని ఆవుదూడకి కుక్క పాలియ్యటం మొదలు పెట్టింది. ఆదృశ్యాన్ని ఫోటోతీసి పత్రికల్లో కూడా ప్రకటించారు. అలాంటిది జరుగటానికి రెండు కారణాలు వుండి వుండవచ్చు. ఆవుదూడకి తల్లిలేదు. తల్లిలేని ఆదూడ తనకి ఎవరు పాలిస్తే వారినే అంటిపెట్టుకు తిరుగుతుంది. ఈకుక్కకి కూడా పుట్టిన సంతానం దానికి తెలియకుండానే నష్టమై పోయి వుండవచ్చు. అది తన సంతానమే నన్న భ్రమలో ఆకుక్క యీ ఆవుదూడకి పాలుయిస్తూ వుండవొచ్చు. లేదా - తనకు ఆసారి పుట్టిన సంతానం ఎంత మందో ఆకుక్కకి గమనంలేకపోయి వుండవచ్చు.


ఇలాగే యితర రకాల జంతువులకి పాలుయిచ్చిన కుక్కలను గూర్చిన వుదంతాలు ఎన్నో వున్నాయి.

టెక్సాస్ ప్రాంతంలో ఒకడికి ఒక లేడిపిల్ల కనుపించిందట. దాని తల్లికోసం వెదికితే అదెక్కడో చచ్చి పడివుంది. ఆమనిషికి ఆ లేడి పిల్లమీద జాలివేసి, దాన్ని తన యింటికి తీసుకొచ్చి, కట్టేసి, ఆవుపాలు పోయటం ప్రారంభించాడు. ఆవుపాలు దానికి అరగక, లేడిపిల్ల

★ జంతుకోటిలో మానవలక్షణాలు ★

చిక్కిపోవటం మొదలైంది. అతనికి ఏం చెయ్యటానికీ తోచక, చివరకి తన పెంపుడు కుక్కచేత దీనికి పాలు యిప్పించాడు. ఆనాటినుంచీ లేడిపిల్ల చక్కగా కోలుకొని, పెరిగి పెద్దదైంది.

వాషింగ్టన్‌లో ఒకడు ఒక కుక్కనీ, ఒక బాతునీ కలిపి సాకుతున్నాడు. కొంత కాలానికి యీ రెంటికీ విపరీతమైన స్నేహానుబంధం ఏర్పడి పోయింది. కుక్క ఎక్కడికి పోతే అక్కడికి, యీ బాతూ పోయేది. ఆకుక్క తినే కంచం లోనే తనూ ఎగబడి తినేది. ఆకుక్క పక్కమీదనే తను పడుకొనేది. ఈబాతును చిన్నప్పటి నుంచీ యితర బాతులతో చేరనీయకుండా పెంచిన కారణంచేత దీని కెందుకనో నీటిమీద తేలటం అంటే అసహ్యంగా తోచేది. దాని నేస్తం అయిన యీ కుక్కకి మాత్రం, నీళ్లల్లో యీదులాడట మంటే వల్లమాలిన యిష్టం. తన కెంత యిష్టమైనప్పటికీ, తోటి స్నేహితుణ్ణి వదిలేసి వంటరిగా జలక్రీడ లాడటం పెద్దమనిషి తరహా కాదు చూడండీ! అందుకనీ-యీ కుక్క ఏం చేసేదంటే - ఆబాతుని తన వీపుమీద ఎక్కించుకొని నీళ్లల్లో దిగి యిష్టం వచ్చినంత సేపు కేరింతాలు కొట్టేది.



స్కన్క్

'స్కన్క్' అనే ఒకరకం జంతువు అమెరికా అడవుల్లో వుంటుందని మనం ఇదివరకు తెలుసుకొన్నాం. అడవుల్లో వుంటున్నంత సేపూ, ఆజంతువు అంటే మిగిలిన అన్ని జంతువులూ అది చేసే చేష్టలకి దాన్ని అసహ్యించుకొని, దూరంగా తప్పుకు పోతాయి. కానీ జ్యూలోనో బందీలైవున్న జంతువులకి మాత్రం యిది మంచి వూరట నిచ్చే మిత్రంగా మసులుకో గలదు.



(ర) క్కూన్

ఒకానొక జ్యూలో ఒక 'స్కన్క్' ఒక 'రక్కూన్' రెంటికీ విపరీతమైన దోస్తీ కలిసింది. రెండూ కలిసి ప్రతిరోజూ మధ్యాహ్నపు వేళల్లో వినోదంకోసం కుస్తీపట్లు పట్టుతూ వుండేవి. ఆటకాయితనంగా ఆ 'రక్కూన్' 'స్కన్క్' తోక పట్టుకు గుంజి పళ్లు యికిలిస్తూ కూర్చునేది ఆ 'స్కన్క్' మరేదో యిలాటిదే ఒక అఘాయిత్యం చేసేది. రానూ రానూ యీ రెంటి సరదాలు శృతిమించి పోయి, ఆజ్యూలో ఎవరికీ విశ్రాంతి అన్నది లేకుండా పోయింది. ఈపీడ వదలేక జ్యూ అధికారులు శాశ్వతంగా యీ రెంటినీ వేరు చేసెయ్యాలని నిశ్చయించారు. 'రక్కూన్'ని వేరొకచోటికి పట్టుకు పోవటానికివచ్చిన ఆవుద్యోగిమీద, దాని మిత్రుడైన 'స్కన్క్'కి ఎన్నాళ్లకీ కోపం తీరింది కాదు.

అన్నిటికంటే విచిత్రమైన వుదంతం ఒకటి వుంది. గొర్రెలు కాచుకొనే కుర్రాడెవడో ఒకసారి ఒక 'స్కన్క్' కనిపిస్తే దాన్ని పట్టుకు చంపేశాడు. తీరా చూస్తే, దానికి 5, 6 పసికూనలు వున్నాయి. వాడికి జాలివేసింది. అనవసరంగా తల్లి ప్రాణినిచంపి, వీటి వుసురు కూడా పోసుకొంటున్నానని వాడు దిగులుపడిపోయి, ఆపిల్లలని ఎత్తుకొచ్చి 'యింక్‌ఫిల్లరు'తో వాటికి పాలు పట్టాడు. పాలైతే పట్టగలిగాడు గానీ, వాటికి కావలసిన వెచ్చదనం ఎలా సమకూర్చగలడు. కాసేపు ఆలోచించాడు. తీరా ఎదురుగుండా చూస్తే, అక్కడ ఒక కోడిపెట్ట గుడ్లమీద కూర్చుని పొదుగుతున్నది. వాడికొక ఆలోచన వచ్చింది. 'స్కన్క్' పిల్లలని పట్టుకుపోయి, కోడిపెట్ట రెక్కల క్రింద పెట్టాడు.

ఆకోడి ' యివేవో పరాయి జీవాలు వచ్చాయని కంగారుపడక పోగా, ఆమరునాడు గొల్లవాడు వచ్చి వాటిని తియబోతే దెబ్బలాటకి కూడా వచ్చింది. 'స్కన్క్' పిల్లలు కళ్లు తెరిచి, కాస్త అటూ యిటూ తిరగటం నేర్చుకొన్న రోజునుంచీ ఆకోడిపెట్టనే అంటిపెట్టుకు తిరిగేవి. ఈపిల్లలు పెద్దవి అయ్యాక మాత్రం తగువు వచ్చి పడింది. 'స్కన్క్'కి సరదాగా వుండటం, అల్లరిచేస్తూ వుండటం పుట్టుకతో వచ్చే బుద్ధి ఇలాటి వెకిలి వేషాలు

(43 వ పేజీ చూడండి)

మతిమరుపు మనుష్యులు

శ్రీ సి. డి. ఎస్. రామయ్య

ఎబ్బెబ్బే! ఎంత కెంత మతిమరుపు!! ఈ వ్యాసాన్ని రాయాలని క్రిందట నెలలోనే అనుకున్నాను; కూర్చుని కాగితం మీద ఏదో రాయను గూడా రాశాను. కాని, వ్యాసాన్ని రాయక, పుట్టింటికి పోయివున్న మాఆవిడకి వుత్తరం రాశేశాను. ఒంట్లో బాగులేదని, మా ఆఫీసు మానేజరుతో అబద్ధాలాడి, ఆయనకి ఎలాగో మస్కావేసి సెలవు తీసుకుని, మా ఆవిడను చూడ్డానికి వూరికి వస్తున్నానని రాశాను. ఆ వుత్తరాన్ని కవరులో పెట్టాను. కవరుమీద మాఆవిడ అడ్రసు రాయడానికి బదులుగా, మతిమరుపుచేత, మా ఆఫీసు మానేజరు అడ్రసు రాసి పోస్టులో పడేశాను.

అబ్బో!... ఆవుత్తరాన్ని చూసిన మా మానేజరు ఏం చిందులు తొక్కాడనుకొన్నారూ? అసలే, ఆయనముక్కోపి. అట్లుండి, ఆరోజు [వుత్తరాన్ని ఆయన కళ్లబడ్డరోజు] నన్ను స్తుతించిన శ్లోకాలను జ్ఞప్తికి తెచ్చుకుంటే, ఇప్పటికీ నాకు భయమేస్తుంది! అప్పట్లో, రెండు రోజుల నుంచీ ఒంట్లో బాగుండని మాట కొంతవరకు నిజమే అయినా, యీ వుత్తరం మూలంగా లీవు కోసం ఆయన దగ్గరకు వెళ్లలేకపోయాను. అరిఘోస్తూ ఆఫీసుకే వెళ్లాను.

* * *

ఉత్తరం మాట అంటూంటే, యింకో విషయం జ్ఞాపకానికి వొస్తోంది. అప్పట్లో ఒకరోజు పోస్టాఫీసు కెళ్లాను. ఇంట్లోనే పెన్ వదలిపెట్టివచ్చిన కారణంచేత, మనియార్డరు ఫారం పూర్తి చెయ్యడానికై, అక్కడే నిలుచున్న ఒకరి పెన్ బదులు తీసుకుని రాశాను. పెన్‌తో పని అయిపోయాక పరధ్యానంగా దాన్ని నాచొక్కా జేబుకి తగిలించుకుని బయలుదేరాను. ఇరవై అడుగులు నడిచి వుంటానేమో!- నాకుపెన్ బదులిచ్చిన మనిషి, లబోదిబో మని అరుచుకుంటూ, నా వెనకాలే పరుగెత్తుకొచ్చాడు. ఈకాలంలో పదిమంది జనం పోగయ్యే చోట్లలో జేబుదొంగల గలాటా జాస్తిగా వుండటం సర్వసాధారణమైన విషయమే గదా! అట్లాగే నేనూ ఏదైనా జేబు దొంగతనం చేసి వచ్చేస్తున్నానేమో నని, నాముందుగా వెళ్లుతున్న ఒక కానిస్టేబుల్ అనుకున్నట్లున్నాడు!.. క్షణం ఆలసించకుండా నన్ను గట్టిగా పట్టుకున్నాడు. పెన్ యజమాని, నా వద్దకువచ్చి, పెన్ యిమ్మని అడిగేక గాని, నాకు పెన్‌గురించి జ్ఞప్తికి రానేలేదు. ఆయన పెన్‌ని, ఆయనకు అప్పగించి, నామతిమరుపుకి మన్నించమని ఆయన్ని వేడుకొన్నాను.


* * *

ప్రఖ్యాత అడ్వకేట్ ఒకాయన మతిమరుపు మనిషిగా చాలా పేరు పొందాడు. ఒకసమయంలో కోర్టులో ఏదో పెద్ద కేసులో వాదిస్తూ, తన ఎదిరిపక్షంవారి వాదనలన్నీ ఏకరువు పెట్టడం మొదలెట్టాడు. ప్రతి పక్షంవారికి అనుకూలంగా మాట్లాడి ముగించబోతూ, ఆఖరు నిమిషంలో తన తప్పును గ్రహించాడు. వెంటనే చాతుర్యంతో "నేను ఇంతవరకూ మాట్లాడినమాదిరిగా, నా ప్రతిపక్షంవారు మాట్లాడవచ్చును. అయితే-" అని ప్రారంభించి, ఆవాదనలన్నీ ఖండించి మళ్లీ తన పక్షంవాళ్లే నెగ్గేట్టు చేసుకొన్నాడుట.

* * *

ఒకరోజు నా స్నేహితుడైన చంద్రం యింటికి వెళ్లాల్సొచ్చింది; వెళ్లాను. లోపలికి ప్రవేశించి వాడిని, వాడు చేస్తున్న పనిని చూసేసరికి నాకు నవ్వొచ్చింది. వాడు ఖాళీగావున్న వుయ్యాలని వూపుతూ కూర్చున్నాడు. చంటిబిడ్డని వాడు చూచుకుంటూంటే గాని, ఆఫీసువేళకి వంటచేసి పెట్టడానికి సాధ్యంగాదని, వాడికీ వాడి సహధర్మచారిణికీ జరిగియున్న ఒప్పందం ప్రకారం, వాడు బిడ్డను చూచుకుంటుంటాడేమో!. అయితే,

★ మతిమరుపు మనుష్యులు ★



చంటిబిడ్డ ఆ వుయ్యాలలో లేదు. గదిలో ఒక మూల కూచుని, బుడ్డీలోవున్న సీరానంతటినీ మీద కుమ్మరించుకుంటూ ఆట్లాడుకుంటోంది. అల్లాంటప్పుడు బిడ్డను వీడేం చూచుకుంటున్నట్టు?... "చంద్రం!...పని లేకనా ఏం, వుత్త వుయ్యాలని వూపుతున్నావ్?" అని అడిగాను. వాడు "అరె!... వుత్తవుయ్యాలా!" అంటూ ఆశ్చర్యపోతూ నాముఖంలోకి చూశాడు. వెధవ!...అంతసేపూ బిడ్డ అనుకొని దినపత్రికను వుయ్యాల్లో పెట్టి వూపుతున్నాడు. మతిమరుపులో నన్ను మించినవాడు మా చంద్రం!

* * *

ఒక ప్రొఫెసరు, తన బంధువులకి ఒక వుత్తరం రాసి పూర్తి చేశాడట! ఆ వుత్తరాన్ని వీధి మొగలో వున్న తపాలాపెట్టెలో వేసిరావడానికి బయలుదేరాడట!...అప్పుడు బయట జోరుగా వాన కురుస్తోంది. అందుకని, ఆ ప్రొఫెసరు గొడుగును చేత పట్టుకుని, తపాలాపెట్టెవరకు వెళ్లాడు. అక్కడికి రాగానే గొడుగును మూసి, దాన్ని తపాలాపెట్టెలో దూర్చాడట! మరోచేత నున్న వుత్తరాన్ని గొడుగులాగా నెత్తిమీదికి ఎత్తిపట్టుకుని, ఇంటిముఖం పట్టాడట!!...ఎలా వుంది ఈయన మతిమరుపు!!



* * *

ఒక ప్రబలమైన బొమ్మలు అమ్మే అంగడివానివద్దకు ఒకాయన వచ్చి, అడుగు పొడవు వుండేటువంటివిగా ఆరువందల బొమ్మలు తయారుచేసి యిమ్మని, ఆర్డరు యిచ్చి వెళ్లిపోయాడు. అంగడివాడు మతిమరుపుమనిషి. అడుగు పొడవుగల ఆరువందల బొమ్మలు కావాలంటే, ఆరడుగుల పొడవుగల 100 బొమ్మలు చకచకా తయారుచేసి వాటినన్నిటినీ సైనిక దళంవలె నిలబెట్టి వుంచాడు. ఆర్డరిచ్చిపోయిన ఆసామి మళ్ళీ వచ్చి చూశాడు. ఆయనకి కోపమొచ్చింది. ఆ బొమ్మలన్నీ అంగట్లోనే వుంచుకొమ్మని వెళ్లిపోయాడు. అంగడివాడు ఆ నూరు బొమ్మల ప్రక్కన, నూటవకటో బొమ్మగా, బిక్కమొహం వేసి నిలబడి పోయాడు!

* * *

మా యింటికి సమీపంలో వున్న ఒక పెద్దమనిషి, ప్రతి సాయంకాలమూ తన మనుమణ్ణి ఎత్తుకొని, తను ప్రియంగా పెంచుకొనే కుక్కకి చైనుకట్టి, నడిపించుకుని పార్కుకు వెళ్లేవాడు. ఒకరోజు పార్కునుండి ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఏదో మతిమరపుగా కుక్కని ముంజేతులమీద ఎత్తుకొని, మనుమడి మెడకు చైను కట్టి తీసుకొస్తూన్నాడు. ఆబిడ్డ ఎంత కేకలుపెట్టినా గూడా ఆయన వినిపించుకోలేదు!...

* * *

ఒకానొక రోజు మా యెదురింటి సుందరం ఆఫీసుకు బయలుదేరాడు. వాడికి ఒక చేతిలో ఆఫీసు ఫైల్సు, మరొక చేతిలో ఒక మంచినీళ్ల చెంబున్నూ వున్నాయి. భోంచేసి, చేయి కడుక్కొని ఏదో మతిమరుపుగా చెంబును వంటింట్లో వదిలెయ్యకుండా చేత్తోపట్టుకొనే ఆఫీసుకు బయలుదేరాడు! ఘనుడు!

* * *

వాడిదాకా ఎందుకూ?... క్రిందటి వారంలో నేను ఆఫీసునుండి యింటికి తిరిగివచ్చిందే తడవుగా, మా ఆవిడని పిలిచాను.

(42-వ పేజీ చూడండి)

పండిత పుత్రులు

రామయ్య సిద్ధాంతి మహా పండితుడు. సమస్త శాస్త్రాలు చదివేడు; కాని తిండిలేదు. దారిద్ర్యం ఆయన్ని పట్టుకు బాధిస్తోంది. ఆయనకి ఇద్దరు కొడుకులు. వారిద్దరూ పండిత పుత్రులైనందుకు పండిత పుత్రులే!

ఒకరోజున రామయ్య సిద్ధాంతి విజయనగరం ప్రయాణ అయ్యేడు అక్కడ రాజుగారు పండిత సభ చేస్తున్నారని విని, మెల్లగా కాళ్లు యీడ్చుకుంటూ విజయనగరం చేరుకున్నాడు.

రాజసభ పండితులతో నిండి, పెళ్లివారి యిల్లులాగ కలకలలాడుతోంది. రామయ్య చింకి అంగవస్త్రం కట్టుకొని ఒకమూల కూర్చున్నాడు. రాజుగారు సభాసదులను చూచి ఒకసమస్య యిచ్చి పూరణం చేయమన్నారు. పండితులందరూ సమస్య విని, దిగాలుపడి ఒకరి మొఖం ఒకరు చూచుకొంటున్నారు.

మూల కూర్చున్న రామయ్య మెల్లగా ముందుకు వచ్చి రాజును దీవించి, క్షణంలో సమస్యను పూరించేశాడు. దాంతో రాజుగారికి పట్టరాని సంతోషం కలిగింది. రామయ్యను తగిన రీతిని గౌరవించారు. ఆనాటి సభ అంతటితో పూర్తి అయిపోయింది. ఎవరి ఇండ్లకు వారు వెళ్లిపోయారు.

రామయ్య బహుమానం అందుకొని మెల్లగా నడిచి వస్తూవుండగా దారిలో పేరయ్య సిద్ధాంతి, అనే ఆయన ఎదురై రామయ్యను కుశల ప్రశ్నలువేసి, ఆరోజున తనయింట ఆతిథ్యం స్వీకరించ వలసిందిగా కోరాడు. రామయ్య సిద్ధాంతి అందుకు వొప్పుకున్నాడు. భోజనాలు అయిపోయినాయి. పేరయ్య సిద్ధాంతి తన ఇద్దరు కూతుళ్లనూ, రామయ్య ఇద్దరు కొడుకులకీ యిచ్చి వివాహం చేసి వియ్యమందకో దలిచానని సవినయంగా చెప్పాడు. రామయ్య ఆలోచించి "తథాస్తు" అనేశాడు.

అనుకున్నమాట ప్రకారం పెళ్లిళ్లు జరిగాయి. కొంత కాలానికి రామయ్య సిద్ధాంతి పరమ పదించాడు. ఇంటి బాధ్యత యీ చవటలమీద పడింది. వీళ్ల భార్యలైనా తెలివైన వాళ్లు అవడంచేత సంసారం గుట్టుగా సాగిపోతున్నది. ప్రతీరోజూ ఇద్దరు అన్నదమ్ములూ చద్ది అన్నం తినడం, వీధిలో చేరి ఒక అరుగుమీద కూర్చొని, 'ఊరిపిండి వడియం బాగుంద'ని ఒకడు, 'ఉల్లిపాయ పకోడీ బాగుందని' ఒకడు-యిలాగు ఇద్దరూ వంటకాల గురించి చర్చించడం, తిరిగి, మధ్యాహ్నం వేళకి భోజనం చేసి నిద్రపోవడం – ఇదీ వాళ్ల దినచర్య!

ఒకరోజున వాళ్ల భార్యలు భర్తలను పిలిచి "తండ్రిగారి సంవత్సరీకాలకి కావలసిన దినుసులు తెచ్చినా సరే, లేదా విజయనగరం వెళ్లి రాజుగారి నడిగి వార్షికం తెచ్చినా సరే" అని హెచ్చరించారు.

అన్నదమ్ము లిద్దరు అరుగుపైన కూర్చొని విజయనగరం ప్రయాణం గూర్చి యోచిస్తూన్నారు. ఇంతలో చిన్నవాడు "ఒరె! అన్నయ్యోయ్! నాకు ఒక ఉపాయం తోస్తోందిరోయ్!.... ఈ గుర్రం ఉందే, మనగుర్రం... ఇది విజయనగరం గుర్రంరా! మనం గనక దానిమీద కూర్చున్నామా అంటే అది తిన్నగా మనల్ని విజయనగరమే తీసుకొని పోతుందిరా" అన్నాడు.

ఆ అన్నయ్య యీ తమ్ముడు తెలివికి మెచ్చుకొని, ఇద్దరూ రెండు కంచాల చద్ది అన్నం తిని, రాజుగారిచ్చిన చెమికీకోట్లు రెండు అంగవస్త్రాల్లో మూటకట్టుకొని, గుర్రం ఎక్కేరు. ఎన్నాళ్లె నుంచో కట్టు

పండిత పుత్రులు

విప్పక పోవడంచేత, రాజుగారి గుర్రం కాళ్లగుంట్లు తీరేటట్టు తిరిగి తిరిగి, సాయంకాల మయ్యేసరికి, మళ్లీ ఇంటిముఖమే పట్టింది.

సాయంకాలం కావచ్చింది, చిమచిమ చీకటి పడుతోంది. చిన్నవాడు మెల్లిగా "ఒరే! అన్నాయ్! ఇది మన ఊరి పొలిమేరలాగే ఉందిరా?" అన్నాడు. "ఊరుకోరా తమ్మయ్యా; అన్ని వూళ్లకీ పొలిమేరలు ఒక్కలాగే వుంటాయి. ఇది విజయనగరం పొలిమేరే లేరా!" అన్నాడు.

గుర్రం తిన్నగా వాళ్లఇంటి ముందుకే వెళ్లి ఆగింది. చిన్నవాడు "ఒరే! అన్నాయ్! ఇది మన ఇల్లులాగే ఉందిరోయ్?" అన్నాడు "ఛీ! ఊరుకో, ఇది మన నాన్నగారు విడిదిచేసిన పూటకూళ్ల ఇల్లు ఐవుంటుంది. మన గుర్రం చూశావా-ఎంత గమనంగా మన నిక్కడికి తీసుకు వచ్చిందో. పద పద లోపలికిపోయి యింత తిని పడుకుదాం" అన్నాడు పెద్దాయన.



గుర్రాన్ని చెట్టకు కట్టి, తలుపు తట్టి "ఏమండోయ్, ఎవరు ఇంట్లో?" అంటూ యిద్దరూ కలిసి పోలికేకలు పెట్టారు. అక్కా చెల్లెళ్లు నవ్వుకుంటూ, తలుపు దగ్గరకు వచ్చి చూశారు. చిన్నది "మన పండిత పుత్రులు? అక్కా! చూచావా వార్షికంలేదు, చట్టు బండలూ లేదు" అంది. "అది సరే కానీ పిల్లను తమాషా చేద్దామా" అంటూ ఇద్దరూ తలుపు తీసి. ఎవరు నాయనా మీరు" అని ప్రశ్నించారు.

"మేమా? మేమెవరమో మా మొఖాలు చూస్తేనే తెలియటంలేదూ - రామయ్యసిద్ధాంతి కుమారులం! వార్షికానికి వచ్చేం" అన్నారు.


"పాపం! మీరే వచ్చేరేం? సిద్ధాంతిగారు రాలేదూ" అన్నారు అడవాళ్లు.

"వారు కాలం చేసేరు! అందుకని మేమే రాకతప్పింది కాదు" అంటూ ఒకరి ముక్కు. ఒకరు చీదేశారు. "అల్లాగా పాపం!.. సరే లేవండి చాలప్రొద్దుపోయింది; భోజనం చేద్దురుగాని" అన్నారు ఆ ఆడంగులు.

ఇద్దరన్నదమ్ములూ బట్టలు సర్దుకొని, కాళ్లు కడుక్కొని భోజనం చేస్తున్నారు. చిన్నామె వడ్డిస్తోంది. చిన్నవాడు ఆమెకేసి కొంతసేపు పరీక్షగా చూసి, మెల్లగా అన్నగారితో "ఒరే! అన్నాయ్! ఇది నా పెళ్లాంలాగే ఉందిరా?" అన్నాడు.

"ఛీ! ఉరుకో, వాళ్లు వింటె

(43-వ పేజీ చూడండి)



(గతసంచిక తరువాయి)

మినుకు మినుకు మంటూ మెరుస్తున్న ఆ దీపం వెలుతురు చూసేసరికి ధనగుప్తుడికి పంచప్రాణాలు లేచి వచ్చాయి. అలాగే ఆదీపం కేసి చూస్తూంటే పెద్ద పెద్ద చెట్ల వరసలు కనిపించాయి. మెల్లిగా అతడా చెట్లవైపు నడిచి పోయాడు. అక్కడ చక్కగా చదునుచేసిన దారి కనిపించింది. దారికి రెండువైపులా దట్టమైన చెట్ల వరసలు గాలిలో మెల్లి మెల్లిగా అటూ ఇటూ తలలూపుతున్నాయి.

అలాగే ఆచెట్లమధ్యనించి నడిచి పోతూంటే కొంతసేపటి కతని కొక పెద్దభవంతి కనిపించింది. ఆభవనానికి చుట్టూరా పెద్ద ఉద్యానవనం ఉంది. ఆ ఉద్యానవనంలో ఎటు చూసినా పూలచెట్ల కొమ్మలలోనించి రంగు రంగుల పువ్వులు గుత్తులు గుత్తులుగా వేలాడుతున్నాయి. ఏవేవో ఫలవృక్షాలు మిగల ముగ్గిన పళ్ల బరువుతో బరువుగా నేలమీదికి వంగి ఉన్నాయి.

ఆభవంతి అంతా రంగు రంగుల గాజు దీపాలతో కళ్లు మిరుమిట్లు గొలిపేటట్టు ధగధగ వెలిగి పోతూంది. దానిలో ఎక్కడా జనం ఉన్న అలికిడి వినబడడం లేదు. ధనగుప్తు డిదంతా చూసి మెల్లిగా సింహద్వారం దగ్గిరికి చేరుకున్నాడు. అదంతా మేలిమి బంగారం కరిగించి పోతపోసిన ద్వారం. దానికి రత్నాల తలుపులు అమర్చారు.

శ్రీ పి. గణపతిశాస్త్రి

ధనగుప్తుడు నెమ్మదిగా గుర్రాన్ని నడిపిస్తూ తలుపులు తోసుకుని లోపలికి వెళ్ళాడు. లోపలికి వెళ్లగానే పక్కగా ఒక పెద్ద గుర్రపుసాల కనబడింది. అక్కడ పచ్చగడ్డీ, దాణా మొదలైనవన్నీ గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. పాపం! అతని గుర్రం మేత లేక ఒక్క చిక్కి ఉండడంచేత వెంటనే అది ఆగుర్రపు సాలలోకి వెళ్లి కడుపునిండా మేత మేస్తూ నిలబడిపోయింది. ధనగుప్తుడికి కూడా బాగా ఆకలివేస్తూంది. ఇప్పటికే బాగా అలిసిపోయి ఉన్నాడు. అయినా లోపల ఏమైనా కాస్త తిండిపెట్టేవాళ్లు కనబడకపోతారా అనే ధైర్యం కొద్దీ ఆగుర్రాన్ని అక్కడ కట్టివేసి నెమ్మది నెమ్మదిగా ఆభవనంలోకి వెళ్లాడు. ఎక్కడా మనిషిజాడ కనబడలేదు. ఇంకా లోపలికి వెళ్లి అటూ ఇటూ పరకాయించే సరికి అక్కడ ఒక పెద్ద భోజనాలగది కనబడింది. అక్కడ పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించిన ఒక వెండి అరిటాకు కనబడింది. అది చూసే సరికి ధనగుప్తుడికి మరింత ఆకలి వేసింది. పాపం ఏం చెయ్యగలడు? అయినా ఎవరైనా కనిపిస్తారేమో నని ఆభవంతి అంతా గాలించి చూశాడు.

ఎవ్వరూ కనబడలేదు. అప్పుడే దరిదరిగా అర్ధరాత్రి కావచ్చింది. లోపల ఆకలి దహించుకు పోతూంది. ఇక నిలబడడానికి అతనికి సత్తువ లేదు. పాపం! ఏం చేస్తాడు? ఏమైతే అది అవుతుందని ఆ విస్తరి దగ్గిర చతికిలపడి హాయిగా కడుపునిండా భోజనం చేశాడు. భోజనం



★ సుందరి ★

చేస్తూన్నంత సేపు అతని గుండెలు దడదడ కొట్టుకుంటూనే ఉన్నాయి.

భోజనం చేశాక అతనికి కొంచెం ధైర్యం వచ్చింది. బెదురుతూ బెదురుతూ నెమ్మదిగా రెండడుగులు వేసి ఆపక్కగా ఉన్న గది తలుపులు తెరిచాడు. అక్కడ ఒక చక్కని హంసతూలికా తల్పం పరిచిఉంది. పైన పట్టు పంకా ఒకటి దానంతట అదే అటూ ఇటూఊగుతూంది. ఎవరైనా ఒకవేళ పంకాలాగేవాళ్లున్నారేమోనని నాలుగు వైపులా చూశాడు. ఎవరూ కనబడలేదు. నిద్రతో కళ్లు కూరుకుపోవడం మొదలు పెట్టాయి. ఆగదిలో దణ్ణెంమీద జరీపంచెలు, కండువాలు వేళ్లాడుతున్నాయి. ఆబట్టలు కట్టుకొని ఆపరుపు మీద కూర్చుని ఈవిచిత్రం అంతా ఏమిటా అని ఆలోచిస్తూన్నాడు. అతనికి తెలియకుండా నిద్ర కమ్ముకువచ్చింది. అలాగే ఆ పరుపుమీద పడుకుని హాయిగా నిద్రపోయాడు.

తెల్లారి లేచేసరికి అప్పుడే ఇంచుమించుగా జాముపొద్దెక్కింది. నాలుగు పక్కలా చూసేసరికి ఆతోటంతా రంగు రంగుల గులాబీ పువ్వులతోను, ఇంకా రక రకాల పువ్వులతోను కలకల లాడుతూంది. అల్లాగే ఆశ్చర్య పడుతూ మళ్లీ భోజనం గదిలోకి వెళ్లేసరికి అక్కడ అన్ని రకాల ఫలహారాలు అమర్చబడి ఉన్నాయి. ధనగుప్తుడు తనకి కావలిసినన్ని పుచ్చుకొని తనలో తను ఇలాగనుకున్నాడు.

"ఈఉద్యానవనము, ఈభవంతీ చూస్తే సామాన్యం మనుష్యులు కట్టినట్టు కనబడడం లేదు. ఇది ఎవరో దేవత భవనం అయి ఉంటుంది. ఆ దేవత ఎవరో నామీద దయతలచి నాకోసం ఈసమస్తసౌఖ్యాలు అమర్చి ఉంటుంది. ఆహా! ఆ దేవతకు నామీద ఎంత దయకలిగింది!"

ఇలాగని ధనగుప్తుడా దేవతను తలుచుకుని ఎంతో భక్తితో తల వంచి నమస్కరించాడు. ఆపైన ఇక ఇంటికి వెళ్ళిపోదామనే ఉద్దేశంతో గుర్రపుసాలలోనించి గుర్రాన్ని ఇవతలకి తెచ్చి ప్రయాణమయ్యేముందర మళ్ళీ ఆ భవంతివైపొకసారి చూశాడు. రంగు రంగుల గులాబీపువ్వుల

సువాసన గుమ్ముమని సోకింది. వెంటనే అతనికి ఇంటిదగ్గిరనించి బయలుదేరి వచ్చేటప్పుడు సుందరి గులాబీపువ్వు కావాలని అడిగిన సంగతి జ్ఞాపకం వచ్చింది. తటాలున అప్పుడే విచ్చిన గులాబీపువ్వులు కొన్ని కోసి ఒక లేత అరిటాకులో పోసి పొట్లం కట్టాడు.

ఇంతలో "ఛీ! విశ్వాసఘాతకుడా! ఎవడవురా! నువ్వు!" అని ఒక పెద్ద గావుకేక వినిపించింది. ఆకేక వినిపించిన వైపు చూసేసరికి ధనగుప్తుడికి పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. ఆఎదురుగా నిలబడి అతనికేసి చూస్తున్నది—ఒక భయంకరమైన బ్రహ్మరాక్షసుడు! ఆరాక్షసుడి ఎర్రని కోరలు పెదవులచివర చింత నిప్పుల్లా మెరుస్తున్నాయి! కళ్లు రెండూ నిలబడిపోయిన పీతల్లా ఉన్నాయి! పెద్ద బానకడుపు! కాళ్లు చేతులు రోకళ్లే.

ఆరాక్షసుడు, ఈ ఇలాగ గావుకేకలుపెట్టి పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ ధనగుప్తుడి దగ్గిరకి వస్తూ "ఓరి దౌర్భాగ్యుడా! నీవేదో ఆపత్తులో ఉన్నావని జాలిపడి, నిన్ను నాభవంతిలోనికి రానిచ్చి, నీకు సకలోపచారాలు ఏర్పాటు చేయించానురా! దానికి ప్రతిఫలంగా నేను ప్రాణప్రదంగా పెంచుకుంటూన్న గులాబీపువ్వులన్నీ పుణికి పారిపోడతావురా! నువ్వు చేసిన పాపిష్టిపనికి ఫలితం అనుభవిస్తావులే! గుర్రం ఎక్కి క్రోసుదూరం వెళ్ళేసరికి హఠాత్తుగా రక్తం కక్కుకుని చచ్చిపోతావు! నీకీ వేళతో పాపం పండింది!" అన్నాడు.

ఈమాటలనేసరికి ధనగుప్తుడు గజగజ వణుకుతూ రాక్షసి కాళ్ల మీదపడి, ఇలాగ ప్రాధేయపడ్డాడు. "బాబూ! బుద్ధి గడ్డితిని పొరబాటు పని చేసేశాను. ఏదో పసి పిల్ల కావాలని ఏడ్చిందిగదా! అని నాలుగు పువ్వులు కోసుకున్నాను. ఈపువ్వులు నీ వంత ప్రాణప్రదంగా పెంచుకుంటున్నావన్న సంగతి నాకు తెలియదు! ఇంటిదగ్గిరనించి వస్తూంటే పాపం పసిపిల్ల పదే పదే పువ్వులు తెచ్చిపెట్టమని బ్రతిమాలింది.—ఒక్కసారి నాపిల్లలందర్నీ కళ్లారా చూడాలని ఉంది! నన్ను చంపెయ్యకు! నన్ను రక్షించు! రక్షించు! ప్రభూ!"

"ప్రభూ! అనేసరికి ఆ బ్రహ్మరాక్షసుడు మరింత మండిపడిపోయి, "ఛీ నన్ను ప్రభూ! అని పిలిచి అవమాన పరుస్తావురా! నేను బ్రహ్మరాక్షసుణ్ణే గాని ప్రభువునుగాను! ప్రభువులు పరమ నీచులు! వాళ్లకి దయా దాక్షిణ్యాలుండవు! మళ్లీ నన్నావిధంగా పలకరించావంటే నిలబడ్డ పళంగానీ ప్రాణాలు తోడేస్తాను!" అన్నాడు.

పాపం ధనగుప్తుడికిక ఏమనాలో తెలియక "బుద్ధి! బుద్ధి!" అని పడ పడా లెంపలు వేసుకుని, తన ప్రాణాలు కాపాడవలసిందని కాళ్లావేళ్లా పడి బతిమాలుతున్నాడు.

బ్రహ్మ రాక్షసుడీ మాటలతో కొంచెం శాంతించి ఇలాగన్నాడు.

"నీకు పిల్లలెంతమంది!"

"ఆరుగురు!"

"ఆ ఆరుగురు ఆడపిల్లలేనా? తిన్నగా సమాధానం చెప్పు!"

"పొరబాటు వచ్చింది! రక్షించు రక్షించు!– ముగ్గురు మొగపిల్లలు! ముగ్గురు ఆడపిల్లలు!"

"సరే! అయితే ఆ ఆడపిల్లల్లో ఒకత్తిని ఇక్కడికి తీసుకువచ్చి, ఈ పువ్వుల మొక్కకి బలివెయ్యి! అలా చేస్తే ఇప్పుడు నిన్ను వదిలివేస్తాను!"

వర్తకుడి మాటలు విని నసుగుతూ నసుగుతూ ఏదో సమాధానం చెప్పాడు"

బ్రహ్మరాక్షసుడు మళ్లీ అందుకుని - "నా కదంతా తెలియదు! మూడునెలల్లోగా నీపిల్లతో సహా నువ్విక్కడ హాజరుకావాలి! లేకపోతే నేనే స్వయంగా బరబరాని న్నిక్కడి కీడ్చుకువచ్చి ఈ మొక్కకి బలి వేసేస్తాను! జాగ్రత్త!" అన్నాడు.

ఆరాక్షసుడు ఇలాగ మాట్లాడేసరికి పాపమా వర్తకుడికిక ఏమనడానికీ పాలుపోలేదు. చూస్తూ చూస్తూ ఎవరినీ మొక్కకి బలి వెయ్యగలడు! ఒప్పుకోనంటే ఇక ఒక క్షణంలోనే ప్రాణాలు పోతాయి. పిల్లలందర్నీ ఒక్కసారి కళ్ళారా చూసుకోడానికైనా వీలుండదు. అందుకని 'సరే' అని ఇంటికి వెళ్ళి, ఆపిల్లల్ని అందర్నీ చూసుకుని ఆపైన ఆలోచించుకోవచ్చునని అనున్నాడు.

అందుకని బ్రహ్మరాక్షసుడితో పైకి "మీ ఆజ్ఞ ప్రకారమే చేస్తాను. నాకు ఇంటికి వెళ్లడానికి సెలవుదయ చేయించండి!" అని అడిగాడు.

★ సుందరి ★

ఈమాటలు వినేసరికి బ్రహ్మరాక్షసుడికి, పట్టరాని సంతోషం కలిగింది. వెంటనే ధనగుప్తుడి కేసి ఎంతో ఆప్యాయంగా చూసి "అయితే సుఖంగా ఇంటికి వెళ్లి నాలుగు రోజులపాటు అక్కడ ఉండి, మీ అమ్మాయిని వెంట బెట్టుకుని వేగిరం ఇక్కడికి రా! ఇదిగో! ఒక పని ఉందిగాని నాతో ఒకసారి లోపలికి వస్తావా!" అన్నాడు.

ధనగుప్తుడు బ్రహ్మరాక్షసుడి వెనకాలే అడుగులో అడుగులు వేసుకుంటూ లోపలికి వెళ్ళాడు. రాక్షసుడు అతన్ని భవంతిలో ఒక మూల గదిలోకి తీసుకువెళ్లాడు. ఆ గదినిండా బంగారు నగలు, రత్నహారాలు కన్నులు చెదిరిపోయేటట్టు మెరుస్తున్నాయి. రాక్షసుడు "అలా నిలబడి చూస్తావేమిటి! మోయగలిగినన్ని మోసుకుపో!" అని గద్దించాడు!

ధనగుప్తుడా మాటలకు విస్తుపోయి ఒక పెద్ద సంచినిండా నగలు, రత్నహారాలు నింపుకుని గుర్రం ఎక్కి రాక్షసుడి దగ్గిర సెలవు తీసుకుని ఇంటికి దౌడు తీశాడు.

ధనగుప్తుడు ఇంటికి అల్లంత దూరంలో కనిపించేసరికి పిల్లలందరు కేరింతాలతో అతని కెదురు వచ్చారు. ధనగుప్తుడు ఇంట్లోకి వచ్చి, కొంచెంసేపు విశ్రమించి. పిల్లలందరికీ తాను తీసుకు వచ్చిన హారాలు, నగలు చూపించాడు. పెద్ద పిల్లలిద్దరు తమకు కావలిసిన వన్ని ఎంతో ఆప్యాయంగా తీసుకున్నారు గాని, సుందరి వాటి జోలికే పోలేదు. ధనగుప్తుడు తను తెచ్చిన గులాబీపువ్వుల పొట్లం ఆమె చేతిలో ఉంచాడు. సుందరి ఒక్క చిరునవ్వు నవ్వి అందులోనించి ఒకటే ఒక గులాబీపువ్వు తీసుకుని జడలో పెట్టుకుంది.

పాపం ధనగుప్తుడావిధంగా పిల్లలందరినీ నగలు, హారాలు తీసుకోమన్నాడే గాని లోలోపల అతనికి గుండె తరుక్కుపోతూనే ఉంది. చాలాసేపటిదాకా అతనికి నోటమ్మట మాటే పెగల్లేదు. అయినా ధైర్యం చిక్కబట్టుకుని వారందరికీ తాను ఇంటిదగ్గరనించి బయలుదేరినప్పటినించీ జరిగిన సంగతులన్నీ వరసగా చెప్పాడు.

ఈ మాటలు విన్నీ వినడంతో సుందరికి పట్టరాని దుఃఖం వచ్చింది. అయినా కళ్ల నీళ్లు కుక్కుకొని అలాగే కూచుండి పోయింది.

ఇంక అక్కగారిద్దరు ఒక్కసారి ఎక్కడలేని దుఃఖము తెచ్చి పెట్టుకుని బావురుమని ఏడవడం మొదలుపెట్టారు. అలా కొంతసేపు రాగాలు తీశాక హఠాత్తుగా ఒక్కసారిగా ఆ రాగాలు ఆపి చెల్లెలి కేసి తిరిగి "ఈ సంగనాచి మూలానే మా నాన్నకీ ఆపత్తు వచ్చింది! దీన్ని ఆ రాక్షసుడికి బలిస్తే మనకని అంతా విరగడైపోతుంది. తిని కూచోలేక గొప్పకోసం తనకో గులాబీపువ్వు కావాలంది!... బెల్లం కొట్టే రాయిలాగ ఎలాగ కూర్చుందో!" అన్నారు.

ఆమాటలకు సుందరి అక్కలిద్దరికేసి చురచుర చూస్తూ "జరిగిపోయినదానిని గురించి ఊరికే బెంగ పెట్టుకుంటే ఏమి లాభం! నేనే స్వయంగా ఆ రాక్షసుడి దగ్గిరికి వెళ్ల నాన్నగారి ప్రాణాలకు నా ప్రాణాలు అడ్డువేస్తాను!" అంది.

ఆ మాట విని ధనగుప్తుడి కొడుకులందరు ఒకే మాటగా "అక్కడికి నువ్వు వెళ్లడం ఎందుకు?" మేం ముగ్గురం బయలుదేరి వెళ్ళి ఆ రాక్షసుణ్ణి ముక్కముక్కలు కింద చీల్చి వేస్తాం!" అన్నారు.

ఆ మాటలు విని ధనగుప్తుడొక్క నిట్టూర్పు విడిచి ఇలాగన్నాడు. "ప్రపంచంలో ఆ రాక్షసుణ్ణెవరూ జయించలేరు. మీరు వెడితే ఆ రాక్షసుడికి బలిఅయిపోవడమే గాని అంతకన్న చేసేదేమీ లేదు. ఇంతకీ నేనెలాగూ పెద్దవాణ్ణయి

పద్యాలు వ్రాసి పేరు ప్రఖ్యాతులు ఆర్జించిన ఒక పెద్దకవిని కుర్రకారు కవిఒకడు "మహా కావ్యాలు వ్రాయాలంటే వుండవలసిన ముఖ్య లక్షణం ఏమిటండీ?" అని అడిగాడు.

"ఎంత తక్కువ తిండి అయినా తిని బ్రతికివుండగల గాలి" అని ఆయన సమాధానం చెప్పాడు.

* * *

అన్నం తినకుండా మారాం చేస్తున్న పిల్లవాడితో తల్లి:- "ఈ కాస్త అన్నమూ, మట్టి బెడ్డలే ననుకొని అయినా తినరా, నాయనా నన్ను వేధించక!"

పోయాను గనక నేనే ఆ రాక్షసుడికి బలిఅయిపోతాను" అన్నాడు.

సుందరి మరింత ఆవేశంతో "మీరు వెళ్లడానికి నేనెంత మాత్రము ఒప్పుకోను. ఒకవేళ నన్నక్కడికి తీసుకువెళ్లకపోతే నా అంతట నేనే అక్కడికి వచ్చి ఆ రాక్షసుడికి బలిఅయిపోతాను. మీకోసం బెంగ పెట్టుకుని కుమిలి కుళ్లిపోవడం కంటె వాడికి బలిఅయిపోవడమే నయం!" అంది.

ఆమీద ధనగుప్తుడు సుందరిని తనవెంట రావద్దని అనేక విధాల బతిమాలాడు. కాని ఆమె ఎంత చెప్పినా వినలేదు. అక్కలిద్దరు ఆమె పట్టుపట్టడం చూసి ఇక దాన్ని ఆ రాక్షసుడు మింగి వేస్తాడని లోలోపల సంబరపడ్డారు.

ఇలాగ ఉండగా ధనగుప్తుడి దగ్గిర డబ్బు చేరిందనే సరికి పెద్దపిల్ల లిద్దరికీ మళ్ళీ పెళ్లి సంబంధాలు రావడం మొదలు పెట్టాయి. ధనగుప్తుడు వేలకువేలు కట్నాలు, కానుకలు గుమ్మరించి వాళ్లకోరిక ప్రకారం జమీందారీ సంబంధాలు చేసి సారె సామానులతో అత్తవారిళ్లకి పంపించేశాడు.

ఇవన్నీ జరిగేసరికి ఇంచుమించుగా రెండు నెలలు గడిచి పోయాయి.

ఇక సుందరి ససేమిరా అని పట్టుపట్టడంవల్ల చేసేదేమీ లేక ధనగుప్తుడామెను వెంటబెట్టుకుని బ్రహ్మరాక్షసుడి భవంతికి బయలుదేరాడు. అతనికి ముందేమి జరుగుతుందోనని లోలోపల బాగా దిగులుగానే ఉందిగాని, సుందరి మాత్రం ఏమీ చెక్కుచెదరకుండా అతనితో కలిసి ప్రయాణం చేసింది.

వారిద్దరు కలిసి అడివిలో ఉన్న బ్రహ్మరాక్షసుడి భవంతి చేరుకునే సరికి సూర్యాస్తమానం కావచ్చింది. గుర్రానికి అది అంతా నలిగినదారే. అందుచేత లోపలికి వెడుతూనే అది గుర్రపు సాలలోకి వెళ్లిపోయింది.

తండ్రీ కూతురు భవంతి హాలులోకి వెళ్లారు. వెళ్లగానే లోపల ఉన్న రంగు రంగుల దీపాలన్నీ ఒక్కసారిగా తళుక్కుమని వెలిగాయి. ఎదురుగా బంగారుపళ్లెరాల్లో భోజనపదార్థాలన్నీ నవకాయ పిండి వంటలతోను సిద్ధంగా అమర్చబడి ఉన్నాయి. అయితే ధనగుప్తుడికంతగా ఆకలి వెయ్యలేదు. సుందరి పైపైకి ఉత్సాహంగా కనబడాలని నిశ్చయించుకుని తండ్రికి కావలిసిన వస్తువులన్నీ వడ్డిస్తూ అతనికి పక్కగా నిలబడింది.

తండ్రి భోజనంచేసినతరవాత తానుకూడా భోజనం చేసింది. ఇంతలో ఎవరో మెల్లి మెల్లిగా నడుస్తూ తమదగ్గిరికి వస్తున్నట్లు చప్పుడైంది. ఆ చప్పుడు వినీ వినగానే ధనగుప్తుడు అరచేతిలో ప్రాణాలు చిక్కబట్టుకుని ఎంతో దీనంగా కుమార్తెకేసి చూశాడు. బ్రహ్మరాక్షసుణ్ణిఅల్లంత దూరంలో చూసేసరికి సుందరికి చాలా భయం వేసింది. కానీ ఏమీ చెక్కుచెదరకుండా అలాగే ఆ రాక్షసుడికేసి చూస్తూ నిలబడింది.

ఇంతలో రాక్షసుడు వారి దగ్గిరగా వచ్చి, సుందరికేసి నిదానంగా చూసి ఉరుము ఉరిమినట్లు ఇల్లాగన్నాడు.

"ఇదుగో! ఇలా చూడు! నీ అంతట నువ్వే ఇక్కడికి వచ్చావా? లేకపోతే మీనాన్న ని

అదిఒక గానసభ. గాన కచేరీ జోరుగా జరిగిపోతున్న సమయంలో సి. ఐ. డి. ఒకడు గానసభ తాలూకు కార్యదర్శిని చాటుకు పిలిచి, "నేను సి. ఐ. డి. ఇలాకా పనిమీద వచ్చాను. ఇక్కడేదో ఖూనీ జరుగుతున్నట్లు మా శాఖ కార్యాలయానికి మీ యిరుగు పొరుగుల్లోవున్న ఒక ప్రముఖ వ్యక్తి ఫిర్యాదు పంపారు. ఈ కార్యంలో నాకు మీపూర్తి సహకారం కావాలి" అని అడిగాడు.

ఆ కార్యదర్శి, ఖూనీ అన్న మాట వినగానే భయంతో సగం చచ్చి, ఎల్లాగైతే నేం చివరికి తెప్పరిల్లి "ఇక్కడ... మా గా న... స భ లో, ఖూనీయా? ఎవరినీ? ఏమిటీ?" అని అడిగాడు.

"ఎవరో త్యాగరాజు అనే ఆయన్ని ఖూనీ చేస్తున్నారటగా? అంతటి పెద్ద మనిషి ఫిర్యాదు పంపిస్తేనే అది అబద్ధ మంటారా!" అన్నాడు ఆ సి. ఐ. డి.

★ సుందరి ★

న్నిక్కడికి బలవంతంగా ఈడ్చుకు వచ్చాడా?"

"లేదు! నా అంతట నేనే వచ్చాను!"

"నిజంగా!"

"నిజంగా నే!"

"అయితే నువ్వు చాలా మంచి దానివన్న మాట! నీధైర్యం చూస్తే నాకెంతో ముచ్చటగా ఉంది!"

బ్రహ్మరాక్షసు డిలాగ అనేసరికి సుందరికి మళ్ళీ కొండంత ధైర్యం వచ్చి, లోలోపల ఉత్సాహం పొంగింది.

కాని అంతలోనే రాక్షసుడు ధనగుప్తుడికేసి తిరిగి కళ్ళెర్రజేసి చూచి ఇలాగ అన్నాడు.

"సరే! నువ్వు అన్నమాట ప్రకారం వచ్చావు గదా! నీపని తీరిపోయింది! నువ్వు పొద్దున్నే లేచి మూటాముల్లె సర్దుకుని తొందరగా ఇంటికి దయచెయ్!... ఈ రాత్రికి మీరిద్దరు ఈ పక్కగదిలో విశ్రమించండి! ఏమిటి అలాగదిగాలు పడి చూస్తారు! కదలండి!"

ఈ మాటలనీ అనడంతోనే బ్రహ్మరాక్షసుడు పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ అక్కడినించి వెళ్ళిపోయాడు.

ఆ రాక్షసుడి అడుగుల చప్పుడు వినబడడం మానేసినదాకా తండ్రీ కూతుళ్ళిద్దరూ అల్లాగే బొమ్మల లాగ నిలబడి పోయారు!

(ఇంకావుంది)

ఇద్దరు పెద్ద మనుష్యులు నడిరోడ్డు మీద నిల్చొని ఏవేవో విషయాలు మాట్లాడు కొంటూ వుండగా, ఎక్కణ్ణించో వచ్చిన గాడిద సరిగ్గా వీళ్ల చెవులదగ్గరే చేరి, బిగ్గరగా ఓండ్ర పెట్టింది. కాసేపు తుమ్మింది. కాసేపు దగ్గింది. ఇది చేసే యీమాదిరి శబ్దాల మూలంగా వీళ్లిద్దరి సంభాషణ ఆగిపోయింది. ఆచిరాకు పట్టలేక ఒక ఆసామీ రెండో ఆసామితో "యీ వెధవ గాడిదకు పడిశెం కూడా పట్టినట్లుందే?" అన్నాడు. అంతలోనే జ్ఞాపకం వచ్చింది కాబోలు—"అన్నట్లు నీపడిశెం ఎల్లా వుంది?" అని అదే గుక్కలో అడిగేశాడు.

★ మతిమరుపు మనుష్యులు ★

(34-వ పేజీ తరువాయి)

"ఇదిగో! పిల్లా! మీ అమ్మగారి వద్దనుంచి వుత్తరం వచ్చింది" అంటూ నాచొక్కా జేబులోనున్న వుత్తరాన్ని తీసి దానికి యిచ్చాను. మాఆవిడ వికసించిన ముఖంతో ఆవుత్తరాన్ని అందుకొంది. కానీ, మరుక్షణంలోనే పరాశక్తిరూప మెత్తి విషసర్పంలాగా బుస కొట్టింది. "ఇది ఐదురోజుల క్రితం నేను మా అమ్మగారికి రాసిన వుత్తరంగదా!...ఆఫీసు కెళ్లేప్పుడు తపాలాపెట్టెలో వేయమని మీచేతికిచ్చాను...ఛా ఛా! ... మీకు యిచ్చేబదులు ఏ మొండిగోడవద్ద పారేసినా వుత్తరం యీపాటికి మావూరు చేరివుండేది!" అని వురిమింది. "ఇంతకీ మాఅమ్మ రాసిన వుత్తరం ఏదీ?" అని నిలదీసి అడిగింది. కంగారుగా నాచొక్కా జేబులు, పెంట్ జేబులూ అన్నీ వెదికాను.

"ఎక్కడ?" అని మా ఆవిడ మళ్ళీ గర్జించింది. "అరెరె!... నువ్వు తపాలా పెట్టెలో వెయ్యమని చెప్పిన వుత్తరం, అదే కాబోలునని, దాన్ని ఇంతకు ముందే వచ్చే దారిలో పోస్టు చేశాను" అన్నాను.

ఆతర్వాత మా యిద్దరి మధ్యా నడచిన కీచులాట నంతా యిక్కడ వివరించడానికి నేను తయారుగా లేను. కానీ, నా మతిమరుపు మూలంగా మాఆవిడకి రెండు చీరలు నాలుగు జంపర్లు కొని యిస్తేనేకాని ఆవిడ అలక తీరలేదని మాత్రం చెప్పకతప్పదు. కాబట్టి చెప్పుతున్నాను.

ఈవిధంగా ఎంత పెద్ద మనుషులైనా సరే మతిమరుపు లేకుండా వుండరు. మన వుపప్రధాని రాధాకృష్ణగారుగూడా, కాలేజి విద్యార్థి జీవితంలో షేవింగ్‌ను సగం పూర్తి చేసుకొని, ఏదో మతిమరుపుగా క్లాసుకి వెళ్లిపోయేవారట!... మా ఆఫీసు మేనేజరుగూడా ఒకొక్క సమయాల్లో సిగరెట్ ను అంటించడానికి బదులు, పెన్సిలును నోట్లో పెట్టుకొని దానికి అగ్గిపుల్ల అంటించటంకద్దు! ఆయనకిమల్లేనే ఆయన తోటమాలి కూడా మతిమరుపు మనిషి. వాన కురిసిపోతుంటేకూడా లెక్కచెయ్యకుండా, గొడుగువేసుకుపోయి చెట్లకి నీళ్లుపోసేవాడు ★

★ పండితపుత్రులు ★

(36-పేజీ తరువాయి)

తంటారు! కన్పించిన ఆడదల్లా 'నాపెళ్లాం' అంటే బాగుంటుందా?" అన్నాడు పెద్దాడు.

ఇంతలో పెద్దాదివిడ వచ్చి "ఏమి కావాలి" అని అడిగింది. చిన్నవాడు మరి ఊరుకోలేక పోయేడు. మెల్లగా అన్నతో "ఒరే అన్నాయ్ నేను అంటే నమ్మవు కానీ యీమె నిజంగా మీ ఆవిడలాగే ఉందిరా" అన్నాడు. "మళ్లీ ప్రారంభించేవూ? ఊరుకో రాబాబూ అంటే! నీతో ఉంటే దెబ్బలు కూడా తినాలి కాబోలు, ఊరుకోరా నాయనా" అన్నాడు పెద్దాడు.

భోజనం అయిపోయింది. అన్నదమ్ములకు ఒక గది చూపేరు పడుకోమని. పగలల్లా గుర్రం మీద ప్రయాణం చేయడంచేత, యిద్దరికీ, వళ్లు అంతా హూనమయి పోయింది. తిండి తినగానే నిద్ర వచ్చింది. పడుకున్నారు. అక్కా, చెల్లెళ్లు పని పాటలు పూర్తిచేసుకొని, ఎవరి గదిలో వారు పండుకున్నాడు.

రాత్రి చిన్నవాడు రాజుగారి దగ్గర బహుమానం పుచ్చుకుంటున్నట్లు కలకన్నాడు. ప్రక్కనున్న భార్యను లేపేస్తున్నాడు, అన్న అనుకొని "ఒరే! అన్నాయ్! ఇదిగో, బహుమానం! నీవుపో, నీకూ ఇస్తారు" అంటూ కేక లేస్తున్నాడు. రెండవ గదిలో పెద్దాడు కూడా అలాగే కేక లేస్తున్నాడు.

ఈ కేకలకి పొరుగింటి వాళ్లు లేచి "వీళ్లకు పిచ్చియెత్తిందా ఏమిటి? అర్ధరాత్రి యీలా కేక లేస్తున్నారు!" అంటూ సంగతి కనుక్కోడానికి వీళ్ల ఇంటికొచ్చి తలుపు తట్టారు.

అన్నదమ్ములు కళ్లు నులుపుకోని, తలుపు తీసేరు. ఎదురుగా పొరుగింటివారు, యిరుగింటి వారు, ప్రత్యక్షమయ్యేరు. చిన్నవాడు "ఓ హో! అప్పయ్య శాస్త్రి, అదిగో గోపయ్య సిద్ధాంతి!! మీరెప్పుడు వచ్చారు, విజయనగరానికి? మీక్కూడా వార్షికం వుందా ఏమిటీ" అని పలకరించేడు.

వీళ్ల చర్యలకు ఆయిరుగు పొరుగుల వాళ్లు నవ్వుకొని. "ఊరుకోండోయ్, వాజమ్మలూ! మీయిల్లు ఏమిటి! మీ భార్యలు ఏమిటి! విజయనగరం అంటారు ఏమిటి? మీ తెలివి ఏడిసినట్టే ఉంది, ఊరుకోండి, ఇక నోరు కదిపేరా - తన్నులు తింటారు జాగ్రత్త!!" అంటూ నాలుగు చీవాట్లు పెట్టేరు.

ఇద్దరన్నదమ్ములు మర్నాడు వుదయం లేచి, భార్యలు శుభ్రంగా తోమియిచ్చిన రాగిచెంబులు, చేత పట్టుకొని వూరుమీదకు పోయారు యాచనకి!

★ జంతుకోటిలో మానవలక్షణాలు

(32-వ పేజీ తరువాయి)

వెయ్యటం యీకల పక్షులుకికిట్టదు. అలాగే యీన్కన్క్ వేసిన వేషాలు ఆకోడి పెట్టకీ కిట్టలేదు. దాని పిల్లలని అది తీసుకొని దూరంగా పోయింది.

పక్షుల పిల్లలు సహజంగా వాటి తల్లుల నీడల్లోనే నడుస్తూ వుంటాయి. అనేకమంది వ్యక్తులు పిట్టలువాటంతట అవే తమని అనుసరించేలా చేసుకోవాలని చాలా విధాల ప్రయత్నించారు.

డాక్టర్ క్రనాడ్ లోరెన్జ్ అనే ఆయన బాతుఒకటి గుడ్లు పెట్టగానే వాటిని పట్టుకుపోయి, వేరే విధంగా వాటిని పొదిగించాడు. అవి పిల్లలు అయి, కళ్లు తెరిచిన క్షణంనుంచీ, తాను తప్పితే కదిలే ప్రాణి మరేది వాటికి కనుపించకుండా జాగ్రత్త పడ్డాడు. ఆ కారణంచేత అవి ఎంతసేపూ ఆయననే అంటిపెట్టుకు తిరగటం మొదలెట్టాయి. ఒకనాడాయన వాటిని కాలవ గట్టుదాకా నడిపించుకుపోయి, అక్కడ తాను మాత్రం గభిక్కని ఒక బోటులో దూకి, బోటు నడిపించుకు పోతూ, వెనక్కి, తిరిగిచూస్తే, యీ అరడజను బాతులూ వరస దీరి తన వెన్నంటే వస్తున్నట్లుచూసి మురిసి పోయాడు.

ఇంకా తమాషాచేసి చూద్దామని ఆయన ఒకరోజు వాటిని వెంటబెట్టుకు నడిపించుకు పోయి పోయి, ఎక్కడో ఒకచోట ఒక చిన్న విమానంలోకి ఎక్కికూర్చుని గాలిలోకి తెలిపోయాడు. కొంత దూరంపోయి వెనక్కి తిరిగిచూస్తే యీ బాతులూ గాలిలో వరుసతీరి యీయన వెనకాలే ఎగురుతున్నాయట!

(ఇంకావుంది)



భరణీవారి "చండీరాణి"లో 'కిశోర్'గా ఎన్. టి. రామారావు.



మొదటిసారిగా మరణాన్ని చూస్తున్నాడు సిద్ధార్థుడు. "బుద్ధుని జీవితకథ" నృత్యంలో ఉదయశంకర్.

నృత్య ప్రదర్శనాలు

సినిమాలలో నృత్యాలు ప్రవేశపెట్టడం ఇటీవల బాగా పరిపాటి అయింది. వీటి మూలంగా నృత్యకళ యొక్క అసలు స్వరూపం మనకు బొత్తిగా దూరమై పోతోంది. ఆధునిక యంత్ర యుగంలో నాటక రంగం నశించిపోతున్నట్టే నృత్య రంగంకూడా నశించిపోతున్నది. పోనీ ఈ పూర్వకళల కళేబరాల్లోంచి కొత్త కళ ఏదైనా చిగురిస్తున్న దాఖలంటే అదీ లేదు. ఇప్పటి సినిమాల్లో కనబడే నృత్యాలు సహృదయుడైన ప్రేక్షకుడికి తీవ్రమైన అసంతృప్తి కలిగిస్తున్నాయనటంలో సందేహం లేదు. సినిమాలవల్ల నృత్యం అంటే అర్థం లేని కరచరణ జఘన చాలనం తప్ప మరేమీ లేదని, దాని ప్రయోజనం కామప్రకోపమనీ అనుకునే పరిస్థితి ఏర్పడింది. ఇది భారతీయ ఆలంకారికుల రససిద్ధాంతానికి యోజనాల దూరంలో వున్నది.

ఈ దృష్ట్యా చూస్తే ఉదయశంకర్ వంటి నృత్యకారులు గడిచిన ఇరవై ముప్ఫయ్ ఏళ్ళనుంచీ సాగిస్తున్న కృషి ఎంతైనా ప్రశంసించ దగినది. భారతదేశంలోని వివిధ నృత్యరీతులను అభ్యసించి స్వదేశంలోనూ, విదేశాల్లోనూకూడా భారతీయ కళా విశిష్టతను చాటిన కొద్ది మందిలో ఉదయశంకర్ ఒకడు. అతను యూరప్, అమెరికాలలో ఇచ్చిన అనేక ప్రదర్శనాల వల్ల భారతీయ నృత్యంమీద పాశ్చాత్యులకు చాలా ఆసక్తి కలిగింది. పాశ్చాత్య నృత్యానికి సొగసు, వేగం, లయ ఇవే పరమార్థాలు; భారతీయ నృత్యంలో అలా కాకుండా ప్రతి కదలికా ఒక నిర్దిష్ట భావానికి చిహ్నమనీ, సూక్ష్మాతి సూక్ష్మమైన ప్రతి భావాన్ని, మనోవికారాన్ని అభినయంద్వారా వెల్లడించటం భారతీయ నృత్యంలోని ప్రత్యేకత అనీ పాశ్చాత్యులు గుర్తించటం జరిగింది.

ఉదయశంకర్ ఈమధ్య న్యూగ్లోబ్‌లో కొన్ని నృత్యప్రదర్శనాలిచ్చాడు. వాటిలో రెండు పెద్ద 'బాలే' నృత్యాలు. ఒకదాని పేరు "కార్మికులు - యంత్రాలు". ఈ నృత్యం "కల్పనా" చిత్రంలో ఉదయశంకర్ కొంతవరకూ చూపించాడు. దానినే విస్తరించి రంగస్థల ప్రదర్శనానికి అనువుగా చేశాడు. ఇందులో వస్తువు ఇది: ఒక గ్రామంలో ప్రజలు కుటీర పరిశ్రమలు ఆధారంగా ప్రశాంతంగా జీవనం సాగిస్తుంటారు. వారికి స్వేచ్ఛ, తృప్తి, సౌఖ్యం అన్నీ వున్నాయి. అటువంటి వారిని యంత్ర నాగరికత ప్రలోభపరచి బానిసలనుగా చేసుకుంటుంది. కొంతకాలం యంత్రాలవల్ల సుఖపడుతున్నామనే వారు భావిస్తారు. కాని యంత్రాలు తమకు దాసులవటానికి బదులు, తామే యంత్రాలకు దాసులమయ్యామనీ, తమ జీవితం కూడా యంత్రాలవలెనే స్వేచ్ఛ, చైతన్యం



ఉదయ శంకర్ నృత్యాలకు సంగీత దర్శకుడు లాల్ మణి మిశ్ర.

★ నృత్యప్రదర్శనాలు ★

లేనిదైనదనీ గ్రహిస్తారు. యజమానిపై ఎదురు తిరుగుతారు. యజమాని ప్రభుత్వసహాయంతో వారిని అరెస్టు చేయిస్తాడు. వారు తప్పించుకుని స్వగ్రామానికి తిరిగి వచ్చేస్తారు. ఆతరవాత యజమాని పశ్చాత్తప్తుడై, కార్మికులు కూడా తనవంటి మానవులేనని గుర్తించి వారి కష్టసుఖాల్లో పాల్గొంటాడు.

ఈ ఇతివృత్తంలో మొదటి భాగం, చివరి భాగం కృత్రిమంగాను, ఆదర్శవాదయుతంగాను ఉండటంచేత ఆ భాగాలు ఆట్టే రక్తి కట్టలేదు. కాని కార్మికుల మానవత్వానికీ, యంత్రాలకూ గల వైరుధ్యాన్ని చూపించిన సీక్వెన్సు మాత్రం శక్తివంతంగా వున్నది. ఏ మాత్రం సృజనానందానికీ చోటివ్వని యంత్రాలకు మానవుడు బానిస అయిపోవటాన్ని, మనుషులే యంత్రాలవలె అయిపోవటాన్ని చాలా చక్కగా చూపించారు. ఈ భాగం ఇరవై ఏళ్ళ కిందట చార్లీ చాప్లిన్ తీసిన "మోడరన్ టైమ్సు" చిత్రాన్ని జ్ఞాపకం చేస్తుంది. ఆ చిత్రంలో ఇదే భావాన్ని బలమైన వ్యంగ్యంతో సవిస్తరంగా చాప్లిన్ చిత్రించాడు. అదే భావాన్ని ఉదయశంకర్ పలువురు నటుల సహాయంతో, చిత్రమైన శబ్ద విశేషాలతో అభినయంద్వారా చూపించాడు.

మరొక 'బాలే' నృత్యం "బుద్ధుని జీవిత కథ." ఇది ఉదయశంకర్ కొత్తగా నిర్మించిన 'బాలే'. "కార్మికులు—యంత్రాలు" కన్న ఇది రంగస్థల నిర్వహణలోను, సంగీత రచనలోను, ఇతివృత్తంలోను భిన్నంగా ఉన్నది. ఇతివృత్తం ఇది: ప్రపంచపు దుఃఖాలేవీ ఎరక్కుండా ఉల్లాసంగా కాలం గడుపుతున్న సిద్ధార్థుడొక రోజున నగరవీథుల్లో తిరుగుతూ దుఃఖిత జనులను చూస్తాడు. ఆర్ద్రహృదయుడవటంచేత ఆ దృశ్యం అతన్ని ములుకులా గుచ్చుకొంటుంది. లోకంలో శాశ్వతమైనదేదీ లేదనే సంగతి మొదటిసారిగా అతడు గ్రహించటంతో గొప్ప అశాంతికి లోనవుతాడు. ఆ అశాంతితో అంతఃపురానికి తిరిగి వస్తాడు. అతణ్ణి వినోదింపజెయ్యటానికి భార్య యశోధర, చెలికత్తెలు వ్యర్థప్రయత్నాలు చేస్తారు. ఆ రాత్రే సిద్ధార్థుడు శాంతిని, సత్యాన్ని అన్వేషిస్తూ ఇల్లు విడిచి వెళిపోతాడు. బోధివృక్షంక్రింద ఆసీనుడై ధ్యానం చేస్తాడు. అతడి ధ్యానం భంగం చెయ్యడానికి 'మారుడు' ప్రయత్నించి విఫలుడవుతాడు. చివరికి సిద్ధార్థుడు బుద్ధుడవుతాడు. లోకంలోని దుఃఖాలకు విరుగుడు విరక్తి, భూతదయ అనీ గ్రహిస్తాడు. ఈకథ ప్రారంభించబోయే ముందు, తెల్లటి తెరపై నీడల ద్వారా కల్లోలిత ప్రపంచపు దృశ్యాలు చూస్తాము. అంతంలో బుద్ధుని బోధల ద్వారా మనశ్శాంతి పొందిన మనుష్యులను చూస్తాము.

ఈ 'బాలే'లో ఉదయశంకర్ బుద్ధుని వేషం, అమలాశంకర్ యశోధర వేషం వేశారు. ఇందులో ముఖ్యంగా ఆకర్షకంగా ఉన్నవి రంగస్థల అలంకరణ, లైటింగ్ ఏర్పాట్లు. దాదాపు నాలుగు దృశ్యాలు మారతాయి. ఈ మారటం కాల వ్యవధి ఏమీ లేకుండా, మారుతున్నట్టు అనిపించకుండా జరుగుతుంది. ముందు నగరవీథి దృశ్యం వస్తుంది. ఆదృశ్యం అంతర్ధానం

అవుతుండగానే అంతఃపురదృశ్యం కనిపిస్తుంది. అది మాయమవుతుండగానే బోధివృక్షం క్రింద బుద్ధుడు కూర్చున్న దృశ్యం వస్తుంది. పల్చటిదోమతెరల్లాంటి తెరలు ఉపయోగించీ, 'డిమ్మర్స్'ను ఉపయోగించీ వివిధదృశ్యాలు మార్చగలిగారు.

ఈ 'బాలే'లో యశోధరగా నటించిన అమలాశంకర్ భర్త విడిచి వెళ్లిపోయిన తర్వాత చేసిన దుఃఖాభినయం ఎంతో రసవంతంగా ఉన్నది. చూపులతోను, మెడ కదలికలతోను శోకరసాన్నంతా స్ఫురింపజేసింది. బుద్ధుని ధ్యానంభంగం చేయడానికి పిశాచాలను వెంటబెట్టుకుని 'మారుడు' వచ్చిన సీక్వెన్సుకూడా చక్కగా నిర్వహించబడింది.

ఈ రెండు 'బాలే'లు కాక అమలాశంకర్ "నిరీక్షణ" అనే మణిపురి నృత్యం, ఉదయశంకర్ "ఇంద్ర" అనే నృత్యం, ఇద్దరూ కలిసి "విలాస" అనే ద్వంద్వనృత్యం, వీరిద్దరూ తదితరులూ కలిసి "రాసలీల" అనే నృత్యం చేశారు. ఈ నృత్యాలన్నీ చిన్న ఇతివృత్తాలను, ఆధారం చేసుకుని రచింపబడినవి. చాలకాలంగా ఈ నృత్యాలను సాధకం చేస్తూండటంవల్ల కావచ్చు, 'బాలే' ప్రదర్శనాలకంటె ఈ నృత్యాలే ఎక్కువ రసవంతంగా ఉన్నాయి. "విలాస" అనే నృత్యంలో ప్రేయసీ ప్రేమికుల ప్రేమలోని వివిధ దశలు చూపబడినవి. "రాసలీల" అనే బృంద నృత్యంలో యమునాతీరాన గోపగోపికలతో కృష్ణుడు చేసిన రాసనృత్యం చూపబడింది. ఇది అతిమనోహరంగా వున్నది.

ఈనెల 17 వ తేదీన మొదటి ప్రదర్శనానికి ఉదయశంకర్ పత్రికా విలేఖరులను ఆహ్వానించాడు. ప్రదర్శనాంతాన విలేఖరులతో మాట్లాడుతూ ఆయన తన ఇబ్బందులను వివరించాడు. సరియైన థియేటర్ దొరక్కపోవటం మూలంగా రంగస్థల నిర్వహణ చాల కష్టసాధ్యమవుతున్నదనీ, నృత్యప్రదర్శనాలకు అనువుగా ప్రత్యేకించబడిన థియేటర్లు ఈ దేశంలో లేనే లేవనీ, ప్రభుత్వం ఈవిషయంలో చెయ్యదగిన సహాయం ఎంతో వుందనీ ఆయన అన్నాడు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. సినిమాల ప్రాబల్యం మనదేశంలో వలెనే యూరప్, అమెరికా దేశాల్లో కూడా హెచ్చుగా వున్నప్పటికీ అక్కడ నాటక, నృత్యకళలు నశించిపోలేదు. సినిమా అభిమానులసంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ నాటకం, నృత్యం సజీవంగా ఉండటానికి తగినంత మంది కళాభిమానులు ఉండనే ఉన్నారు. అందుచేత ఆదేశాల్లో నాటక, నృత్యరంగాలు అభివృద్ధి దశలోనే ఉన్నాయి. మనదేశంలో మాత్రమే పాతది నశిస్తూ దాని స్థానంలో కొత్తది రావటానికి తగిన పరిస్థితులు లేవు. ★

"కుమాయూన్ కొండలు"

—

భారతప్రభుత్వపు ఫిలిమ్స్ డివిజన్‌వారు టెక్నికలర్‌లో తయారుచేసిన మొదటి డాక్యుమెంటరీ చిత్రం. హిమాలయ పర్వతశ్రేణిలో ఒక శాఖ అయిన "కుమాయూన్" కొండలప్రాంతాన్ని, అక్కడి ప్రజల జీవన విధానాన్ని చూపిస్తుంది. పెద్దపులులు, లేడిమందలు సంచరించే అరణ్యాలు, నైనిటాల్, అల్మోరా మొదలైన నగరాలు, నందదేవి మొదలైన హిమశిఖరాలు ఆ ప్రాంతాల ప్రజల నాగరికత ఛాయామాత్రంగా చూపించబడ్డాయి. ఇవన్నీ టెక్నికలర్‌లో రమ్యంగానే ఉన్నాయి. అయితే ఈ ఒక్క రీలుచిత్రంలోనూ చాలచోట్ల స్టిల్స్ మాత్రమే చూస్తున్నంత చైతన్యరహితంగా, చప్పగా వున్నది. ఈ చిత్రాన్ని యూరప్‌లో జరిగే ఏదో చలనచిత్రోత్సవానికి పంపాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. అమెరికనులు, బ్రిటిష్‌వారు ఇటువంటి 'థీమ్' లనే తీసుకుని ఇంతకుపూర్వం తయారు చేసిన డాక్యుమెంటరీలతో పోలిస్తే ఇది వాటితో తూగలేదేమో ననిపిస్తుంది. ఈ చిత్రం గత శుక్రవారం విడుదల అయింది. ★

★ ఎటూ తెగని సమస్య ★

కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డువారికి దక్షిణ భారత ఫిలిం వాణిజ్యమండలివారు గత బుధవారంనాడు వుడ్‌లాండ్స్ హోటల్‌లో స్వాగత మిచ్చారు. మండలి అధ్యక్షుడు ఎ. రామయ్యగారు మాట్లాడుతూ సెన్సార్‌షిప్ విధానం సినిమా పరిశ్రమకు ప్రతిబంధకంగా ఉందనీ, దానిని పూర్తిగా మార్చివేయవలసి ఉందనీ, 1951 జనవరికి ముందు వలెనే సెన్సార్ అధికారం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికే అప్పగించటం మంచిదనీ అన్నారు.

"సెన్సార్ అధికారులు అమలు జరిపే 'కత్తిరింపు' విధానంవల్ల నిర్మాతకు అమితమైన నష్టం కలుగుతోంది. సెన్సార్ రుసుము ఏడు రెట్లు పెంచబడింది. అదిగాక చదువురాని ప్రజలను సినిమాలు అభిరుచి లేనివారుగా చేస్తున్నాయనే ఆరోపణ నిరాధారమైనది. సినిమా పరిశ్రమను పోషించేది ప్రజానీకమే గనుక తమకు ఎటువంటి సినిమాలు కావాలో నిర్ణయించేది వారే. వ్యక్తిగతమైన అభిరుచుల ప్రకారం సినిమాలు నిర్మించాలంటే అది ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ఉంటుంది. అందుచేత వ్యక్తిగత విమర్శనాదృష్టి ప్రకారం సినిమాలను సెన్సార్ చేయబూనటం ప్రయోజనకరం కానేరదు. సెన్సార్లు సలహాదారులుగా మాత్రమే వ్యవహరించాలి," అని రామయ్యగారు అన్నారు.

సెన్సార్‌బోర్డు అధ్యక్షుడు శ్రీ సి. ఎమ్. అగర్వాలా స్వాగతానికి సమాధానం చెప్పారు :

"సెన్సార్‌బోర్డు నిష్ప్రయోజనమని శ్రీరామయ్యగారు చేసేవాదనకు నేను సమాధానం ఇవ్వను. సెన్సార్‌బోర్డు సినిమా పరిశ్రమకు ప్రతిబంధకమని ఆయన భావిస్తున్నప్పటికీ మాకు చేతనైనంతవరకూ ఈ మహాపరిశ్రమకు సహాయం చేయటం మాత్రం

(50-వ పేజీ చూడండి)

ప్రశ్నలు..సమాధానాలు

శ్రీ యస్. యమ్. బాషా—బద్వేల్.

సంగీతానికే ప్రాధాన్యమిచ్చి తయారు చేసిన తెనుగుచిత్రము ఏదైనా వుందా?

—తెలుగులో సంగీతంప్రధానంగా లేని చిత్రమంటూ లేదు. మనవన్నీ సంగీత చిత్రాలే. అయితే సంగీతంవల్ల నిండుదనం తెచ్చుకున్న చిత్రాన్ని పేర్కొనవలసివస్తే "మల్లీశ్వరి"ని ముందు చెప్పాలి.

*   *   *

శ్రీ జి. ఆర్. భూపతి—ఆదోని.

"బ్రతుకు తెఱువు" చిత్రంలో 'అందమె ఆనంద' మన్నారుకదా, అయితే అందము లేనిదేఆ నందములేదా? వుంటే ఎట్లు?

—ఆ పాటలో అందం అనేదానికి అర్థం ప్రకృతి సౌందర్యం అని. తరవాత చరణాల్లో కవిగారు ప్రకృతి సౌందర్యం వర్ణించారు. ఈ సౌందర్యాన్ని చూస్తుంటే ఆనందం కలుగుతుందని కవిగారి అభిప్రాయం. *"A thing of beauty is a joy for ever"* అన్నారు ఇంగ్లీషు కవి కీట్సు.

*   *   *

"కాంత్ బాబు"—తెనాలి.

బ్రిటన్, అమెరికాలలో ఇంకా మన చిత్రాలు అనగా "ఆన్" ఝూన్సికిరాణీ" మొదలయినవి విడుదల అయినవా? కేవలం స్టంట్ అయిన "ఆన్"ని పాశ్చాత్యులు మన స్ఫూర్తిగ పొగడిరా? లేక నాటకమా?

—"ఆన్" చిత్రం లండన్లో నే మొదట విడుదలయింది. అమెరికాలో విడుదలకాలేదు. "ఝూన్సీకీరాణి" ఇంగ్లీషులో ఇంకా తయారవుతున్నదట. భారతీయ చిత్రాలను ప్రోత్సహించగలమని అమెరికన్ సినిమాప్రముఖులు వాగ్దానా లివ్వటమే తప్ప అవి విడుదల అయ్యే అవకాశాలు కలిగించటంలేదు. ఉదయశంకర్ "కల్పన"చిత్రం ఇంగ్లీషులో తీసి చాల రోజులయినా అది ఇంతవరకూ అమెరికాలో విడుదల కానేలేదు.

"ఆన్" చిత్రంమీద లండన్ పేపర్ల వ్యాఖ్యలన్నీ చదివినా వారు పొగడినట్లు ఎక్కడా కనిపించదు.

*   *   *

శ్రీ యల్లావఝల సత్యనారాయణమూర్తి —పాలకొల్లు.

విచారములోను, వియోగములోను నటులచేత పాడించడములో దర్శకుల వుద్దేశ్యమేమై యుంటుందండీ?

—మన సినిమాలపై నాటకాలప్రభావం ఇంకా పోలేదు. పాటలే కాదు, స్వగతాలు కూడా వినిపిస్తూంటాయి మన సినిమాల్లో.

*   *   *

శ్రీ యం. జి. శంకరశాస్త్రి—జంపడ్ పూరు.

"రవి ఎరుంగనిది కవి ఎరుంగును" అని అంటారు కదా - అది ఎట్లాగో సెలవిస్తారా?

—"రవి ఎరుంగనిది కవి ఎరుంగును" అంటే చీకట్లో జరిగేది కూడా కవిచూస్తాడని చెప్పడానికి వీలుంది. అంతఃపురాలలో అర్ధరాత్రి వేళ జరిగిన కేళీవిలాస కార్యకలాపాలు కూడా కవులు కండ్లకు కట్టినట్లుగా కావ్యాలలో వర్ణించారు. "స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేల కల్గెనో—యతులిత మాధురీమహిమ?" అని ప్రశ్నిస్తే "హా తెలిసెన్!" అని జవాబు చెప్పిన కవి; కవులు రాత్రి వేళలందుకూడా రాజవీధులలో తిరిగి "రవి ఎరుంగనిది కవి ఎరుంగును" అని నిరూపించారు. ★



పారమౌంట్ వారి *Come back little Sheba* చిత్రంలో బర్ట్ లాంకాస్టర్, షెర్లీబూత్. మే 1 నుండీ ఓడియన్(మద్రాసు)లో ఇది ప్రదర్శించ బడుతుంది.



చారిత్రిక చిత్రాలు తీస్తే ఆయాకాలాల వాతావరణం కల్పించటానికి హాలీవుడ్ తీసుకున్నంత శ్రమ మరెవరూ తీసుకోరు. ప్రతి చిన్న వివరం కోసం ఎంతో రిసెర్చి చేస్తారు. ఎమ్. జి. ఎమ్. వారి "ఐవన్‌హో" చిత్రంలో నార్మన్ రాజుల కాలంనాటి కోట సెట్టింగ్ పై స్టిల్‌లో చూడవచ్చు.

★ ఎటూ తెగని సమస్య ★

(48-వ పేజీ తరువాయి)

మానను. సినిమాలను అభిప్రాయప్రకటనకు ఉద్దేశించబడిన బహిరంగ వేదికలుగా నేను పరిగణిస్తున్నాను. ప్రస్తుతం సినిమా పరిశ్రమ తప్పుదారి త్రొక్కుతున్నా, సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో దేశ పునర్నిర్మాణానికి తోడ్పడే సాధనంగా పెంపొందుతుందనే నేను ఆశిస్తున్నాను. ఆవిధంగా చేయవలసిన బాధ్యత సినిమా పారిశ్రామికులపై ఉన్నది.

సెన్సారుబోర్డునుండి మీరు భయపడవలసిన దేమీ లేదు. సెన్సారులు ఏయే అంశాలకు అభ్యంతరం చెబుతారో ఆ అంశాలు తమ చిత్రంలో రాకుండా చూసుకోగలిగితే ఏ నిర్మాతా నష్టపడవలసిన అవసరం లేదు. బాక్సాఫీసు లాభాలు ఎక్కువ చేసుకోవాలనే ఉద్దేశంతో మానవునిలోని తక్కువ రకం ప్రవృత్తులను రెచ్చగొట్టే అంశాలు కొందరు చొప్పిస్తున్నారని నా అనుమానం. అటువంటప్పుడు సెన్సార్‌బోర్డు విధిగా తన పని తను చెయ్యవలసి వుంటుంది. సెన్సార్ అధికారులు తప్పులేమీ చెయ్యరని వారి అభిప్రాయాలన్నీ నిర్దుష్టములనీ నేను చెప్పను. కాని పరిశ్రమకు సహాయం చెయ్యాలని, ప్రజలను నైతిక హానినుండి రక్షించాలని మాత్రమే మా ప్రయత్నం. ఇది మీరు గుర్తించగోరుతున్నాను." అని అగర్వాలా తమ ఉపన్యాసం ముగించారు.

మళ్లీ ఈ సమస్య ఎటూ తెగకుండా యథాతథంగానే ఉండిపోయింది. ★

"మణిదన్"

—

'జూపిటర్స్—లావణ్యా' సంస్థవారు నిర్మించిన "మణిదన్" తమిళ చిత్రం ఈ మధ్య విడుదల అయినది. దర్శకుడు ఫొటోగ్రాఫరు శ్రీ కె. రామనాథ్; కథ పి. ఆదిమూలం; అర్ధశేఖర్; నటీనటులు కృష్ణకుమారి, టి. కె. షణ్ముగం, టి. కె. భగవతి, మాధురీ దేవి, పండరీబాయి, ఎస్. ఎ. నటరాజ్, కె. రామస్వామి మున్నగువారు. తమిళ నాటకంలో మంచి నటులని పేరుపొందిన టి. కె. సోదరులు ప్రదర్శించే నాటకమే ఈ చిత్రంగా తీయబడింది. క్రొత్తగా పెళ్ళిఅయిన ఒక డాక్టరు (షణ్ముగం) పెళ్లి అయిన మర్నాడే అధికారుల ఆజ్ఞపై యుద్ధంలోకి వెళ్లిపోవలసి వస్తుంది. అతని భార్య (కృష్ణకుమారి) భర్తకోసం ఎదురుచూస్తూ పుట్టింట ఉంటుంది. ఆమెను ఒక ఆర్టిస్టు (భగవతి) ఒకానొక సందర్భంలో లోబరచుకుని శీలభంగం చేస్తాడు. ఆమె గర్భం దాలుస్తుంది. ఆర్టిస్టు పశ్చాత్తాపంతో పిచ్చివానివలె తిరుగుతూ వుంటాడు. ఆమె భర్త యుద్ధమైపోయి తిరిగివస్తూ ఆర్టిస్టు ద్వారా తన భార్య వృత్తాంతం వింటాడు. ముందు

బాధపడినా తరవాత అతడు భార్యను క్షమిస్తాడు. కాని అతడు ఇంటికి తిరిగి వచ్చాక భార్య ఆవేదన భరించలేక ఉన్నపళంగా మరణిస్తుంది. మరణించబోతూ ఆర్టిస్టు చెల్లెలును (పండరీబాయి) భార్యగా స్వీకరించమని భర్తను కోరుతుంది అతడు అలాగే చేస్తాడు. ఇదే ఈచిత్రంలోని కథ. ★



సినిమా వార్తలు

పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్స్‌వారు తమ ౦ఏవ చిత్రంగా కందుకూరి వీరేశలింగం గారి జీవితకథను ఎన్నుకొదలచినట్లు తెలుస్తోంది తాతినేని ప్రకాశరావుగారే దర్శకత్వం వహిస్తారట ప్రస్తుతం స్క్రిప్టుకు అవసరమైన వివిధ వివరాలను సేకరించటంలో నిమగ్నులై ఉన్నారట మరికొన్ని నెలలకుగాని నటీనటులను ఎన్నుకోవటం, షూటింగ్ ప్రారంభించటం జరగదు ఒక ఆధునిక వ్యక్తి జీవితకథను తెరకెక్కించటం సాహసంగా తోచినా, మన సినిమారంగంలో ఈమాదిరి చిత్రాలు లేకపోవటం కొరతే ఈ కొరతను తీర్చనున్నందుకు పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్స వారిని అభినందించాలి



జూపిటర్—లావణ్యా పిక్చర్సు వారి "మనిదన్" తమిళ చిత్రంలో తెలుగునటి కృష్ణకుమారి.

తార జానకి:

రాజమండ్రిఫిలిమ్‌ఫాన్స్ సంఘంవారు, గౌతమీ పారిశ్రామిక ప్రదర్శనము వారు సినీతార శ్రీమతి జానకికి ఇటీవల సన్మానం చేశారు.

* * *

నటుడు అశోక్ కుమార్ నిర్మిస్తున్న "పరిణీత" చిత్రంచాలవరకు అయిపోయింది, మేలో విడుదలకు సిద్ధమవుతుందని తెలుస్తోంది ఈ చిత్రానికి శరత్ రాసిన "పరిణీత" నవల మూలము అశోక్‌కుమార్, మీనాకుమారి, అసిత్ బరన్, మనోరమ, బద్రిప్రసాద్, ఎన్నుకవారు నటిస్తున్నారు డైరెక్టరు బిమల్ రాయ్. సంగీతం అరుణకుమార్

* * *

ఎమ్ జి ఎమ్ వారి "క్వోవాడిస్" బాక్సాఫీసు విజయం పొందిన అనంతరం వారి మరొక ప్రఖ్యాతమైన స్కాట్ లండ్ చిత్రం "ఐవన్‌హో" మే 1వ తేదీన ఇంగ్లాండ్‌లో ప్రారంభం కానున్నది. ఇందులోకూడా రాబర్ట్ టేలరే కథానాయకుడు. కథానాయిక రెబెక్కా పాత్ర ఎలిజబెత్ టేలర్ ధరించింది సర్ వాల్టర్ స్కాట్ రాసిన నవలలన్నిటిలోకీ ప్రసిద్ధమైన "ఐవన్‌హో" ఆధారం చేసుకొని ఈ చిత్రాన్ని చారిత్రాత్మక వాతావరణం కోసం బ్రిటన్‌లోనే ఎమ్ జి ఎమ్ వారు తయారుచేశారు. డైరెక్టరు రిచర్డ్ థార్ప్. ★

★ ఏత్రేత ★

(25-వ పేజీ తరువాయి)

పొరలు తీస్తూ "ఇంత పీనాసితనం తేమిటక్కా" అని ప్రశ్నించింది.

తెడ్డితో తీసిన అన్నం పదునుచూస్తున్న కాంతమ్మకు ఈ మాట ఎవర్ని గురించి అందో అర్థంకాలేదు.

"ఎవరూ?"

"తెలీనట్లు అలా అడుగుతావేమిటక్కా! అత్తముండ." ఈ మాటకు కాంతమ్మ చాలా ఆశ్చర్యపడింది. ఆశ్చర్యపడ్డంలో వెంకమ్మకు లేని లోభత్వాన్ని చూపిస్తుందని కాదు. వెంకమ్మ లోభే కావచ్చు కాని వయసు మీరిన ఆమెను "ముండ" అని ఉచ్చరించడంలో కాంతమ్మ ఆశ్చర్యపడింది.

"నీకు తెలీదక్కా! పెళ్ళి కూడా యీ ముండే చేసింది. కొడుకు చచ్చేడో ఉన్నాడో అని కూడా విచారణ లేదు. ఆయనకు ఉద్యోగం లేనప్పుడు ఎన్నెన్ని బాధలు పడ్డామో ఆ భగవంతుడికి తెలుసు" ఇప్పటికే ఉల్లిపాయల ఘాటు కళ్ళవరకూ పాకి కళ్లనీళ్లు కార్చేటట్లు చేసింది. తరువాత ఒక్కసారి కళ్లు తుడుచుకొని "ఆ కష్టకాలంలో నోరు తెరచి అడిగినా పది రూపాయలు సాయం చేసిందా దీని సంపాదన పాడుగాను...చచ్చేటప్పుడు కూడా తీసుకపోతుంది కాబోలు" అని ఉల్లిపాయలు అక్కడ విడిచిపెట్టి పమిట చెంగుతో కళ్లు తుడుచుకుంటుంది.

"పోనీలేమ్మా—పెద్దది" అని మాత్రమే కాంతమ్మ సమాధాన మిచ్చింది.

"అవును. కాస్తో కూస్తో నీకాధారంగా ఉంది కాబట్టే నీకు మంచిగానే కనిపిస్తుంది......ఆమెనుండి ఒక్క చిల్లి కానీ కూడా నే నెరగను. ఆమె పెద్దరికం నాకెందుకూ?" అంది కాంతం.

ఈ మాట కాంతమ్మకు బాధగానే తోచింది. అన్నం కలబెడుతూ ఒక్కసారి మాత్రం కాంతం కేసి చూడగలిగింది. కాంతం ఏమనుకుందో, మూతి తిప్పుకొని అక్కడనించి వెళ్ళిపోయింది.

మధ్యాహ్నం పన్నెండు గంటలకల్లా, రవణయ్య ఒక డాక్టర్ని తీసుక యింటికి వచ్చాడు. అప్పటికే వెంకమ్మ నాలుగు మెతుకులు తిని తన గదిలో పడుకొనివుంది.

"ఏమేవ్" గుమ్మంలో అడుగు పెడుతూనే భార్యను పిలిచాడు రవణయ్య.

ప్రక్క గదిలోనుంచి కాంతం వచ్చి చూసింది. డాక్టరు గుమ్మం వెలుపలనే నిలబడి ఉన్నాడు.

"ఏమిటలా చూస్తారూ ఈ కుర్చీ తీసుకెళ్ళండి" అంటూ గదిలోని హాలు కుర్చీ గుమ్మందగ్గరకు తీసుకవచ్చింది. రవణయ్య కుర్చీ అందుకొని చావిట్లో వేసి "కమిన్ సార్" అన్నాడు.

డాక్టరు వచ్చి కూర్చున్నాడు.

కాంతం ముందుగానే వెంకమ్మ గదిలోకి వెళ్ళింది.

వెనకాలనే రవణయ్య కూడా చేరుకున్నాడు.

"అత్తయ్యా" అని పిలచింది కాంతం. గాఢనిద్రలో లేని వెంకమ్మకు యీ పిలుపు తొందరగానే వినిపించింది.

"మీ అబ్బాయి డాక్టరుగార్ని తీసుకవచ్చారు."

"డాక్టరా ?" ఆశ్చర్యంగానే ధ్వనించిందా మాట. మెల్లగా లేచి మంచంమీద కూర్చుంది.

"అవునమ్మా! కళ్ళారాచూస్తూ కాదని నేనుకూడా ఎలా వుండను" అన్నాడు మెల్లగా రవణయ్య.

పెరటిలో ఉన్న కాంతమ్మ అప్పటికే చావిడి ప్రక్కగదిలోకి వచ్చి నిలబడింది.

"లేవండి! వారు చావిట్లో కూర్చున్నారు."

వెంకమ్మ ఏదో అనాలని నోరు తెరచింది. ఆమాట అనకుండానే దగ్గు తరుముకవచ్చింది.

"మాయదారి రోగం...ఇంతకాలం తింటూ యింటిలో ఉన్నవాళ్ళకు కూడా అంత పట్టలేదు" అంది కాంతం. ఈ మాటలు కాంతమ్మ వినలేదు. ఆ దగ్గుధ్వనిలో కలిసిపోయిన ఆ మాటలు స్పష్టంగా వినిపించలేదు. కొడుకూ కోడలూ వెంకమ్మను చెరొక వైపునా ఉండి, ఆమె నడకకు పరిపూర్తిగా సాయపడకపోయినా, జబ్బలు పట్టక తీసుకవచ్చారు.

"ఏమిటక్కా! అట్లా చూస్తావు? ఆ ముక్కాలుపీట ఈలా తీసుకరారాదూ... అంది కాంతం కాస్త కఠినంగా.

కాంతమ్మ గోడప్రక్కగా ఉన్న ముక్కాలుపీట డాక్టరు ఎదురుగా వేసింది. వెంకమ్మ కూర్చుంది.

"ఏమిటమ్మా రోగం."

అంటూ డాక్టరు ప్రశ్నార్థకంగా చూశాడు.

"దగ్గూ...ఆయాసం" వెంకమ్మ ఆయాసపడుతూ చెప్పింది.

డాక్టరుస్టెతోస్కోపుతో పరిశీలించాడు. ఒకసారి బరువుగా గాలి పీల్చాడు. అందరూ అతని మొగంకేసి చూశారు.

"సరే! కొంచం కష్టపడాలి" పైకి లేచాడు.

వెంకమ్మ అలాగునే చూస్తూ వుండిపోయింది.

"మీరు హాస్పటలుకు రండి మాట్లాడదాం" అంటూ డాక్టరు గుమ్మం వెలుపలకు వొచ్చాడు. రవణయ్య, వెనకాలనే నడుస్తూ వెళ్ళాడు.

"ఎవరు తీసుక రమ్మన్నారు డాక్టర్ని" అనుమానంగా కాంతంకేసిచూస్తూ అడిగింది వెంకమ్మ.

"వారే"

"మాయదారి డాక్టర్లే...డబ్బు తగలేయడంగాని, రోగం తగ్గుతుందా పెడుతుందా ?" అంటూ నడ్డిమీద చేయివేసుకొని మెల్లగా లేచింది వెంకమ్మ. కాంతం సమాధానం యివ్వలేదుగాని నవ్వింది. కాంతమ్మకేసి చూస్తూ" "అత్తయ్యకు డబ్బుమీద ఆశ, డాక్టర్లను పనికి రాని వాళ్లగా చేస్తుంది కదా అక్కా" అని అంది.

ఈమాటకు ఏం సమాధానం యివ్వాలో కాంతమ్మకు తెలీలేదు. చిన్నగామాత్రం నవ్వింది.

వెంకమ్మకు కాస్త కోపం వచ్చింది. "డబ్బుమీద ఆశ...ఆశలేని వాళ్లెవరమ్మా?. బెల్లముంటేనే చీమలు చేరతాయి" అంటూ వెంకమ్మ గదిలోకి దారితీసింది.

ఈమాట కాంతం మొగంలో విచిత్రమైన మార్పు తీసుకవచ్చింది. హృదయానికి తగిలిన శరాఘాతం కళ్లలో కోపం మెరిసేవరకూ ఊరుకోలేదు.

"పరవాలేదు...ఒక్కనెల్లో మా అమ్మ మామూలు మనిషైపోతుంది...అరె, అమ్మేంది" అంటూ గుమ్మంలోంచి వస్తూనే పైమాటలని భార్య మొగం చూసి అలాగే ఉండిపోయాడు.

"మీరెందుకు డాక్టర్ని తీసుకరావాలి" క్రోధంగా రమణయ్యకేసిచూస్తూ అడిగింది కాంతం.

ఈ మాటకు సమాధానం నాలుక చివరనే వుంది. కాని దిగమింగి గుటకలు వేశాడు. ముఖం చిట్లించి "తీసుకొస్తే?" అని ప్రశ్నించాడు.

"ఆమెదగ్గర బెల్లం ఉంది కాబట్టి చీమల్లా చేరాం..." ఈమాటతో కాంతం కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. గుమ్మంలో నిలబడ్డ కాంతమ్మ దగ్గరగా వచ్చింది "పెద్దావిడ ఏదో అంది...అంతలో బాధపడితే..." ఇంకా కాంతమ్మమాట పూర్తికానిదే, తన భుజంమీద ఉన్న కాంతమ్మచేయి

విసురుగా తీసి "పెద్దా విడ... ఆశాపాశా ఉండేవాళ్ళు అవి డనేమాటకు పడుంటారు. మాకేం మేం యిక్కడ పడిగాపులు పడి తినడానికి రాలేదు" అంటూ తొందరగా వంటగది వైపునకు వెళ్ళిపోయింది.

ఈమాటకు శాంతమ్మ స్తంభించిపోయి అలాగే నిలబడి చూస్తూ వుండిపోయింది.

తాను విసిరినరాయి, కాంతాన్ని దూసుక శాంతమ్మ కణతకు తగులుతుందని వెంకమ్మ మొదట్లో అనుకోలేదు. ఈ మాటలు గదిలో ఉన్న వెంకమ్మ వింది. గట్టిగా నిట్టూర్చి మంచంమీద పడుకుంది.

రాత్రి భార్యాభర్తలు ఏమాలోచించారో, ఉదయాన్నే ప్రయాణానికి సిద్ధమయ్యారు.

శాంతమ్మ మాత్రం ఈ హఠాత్ ప్రయాణానికి చాలా బాధపడింది. కాని ఏమాటంటే తిరిగి ఏ విధమైన సమాధానం వస్తుందో అని భయంతో కాంతాన్ని వారించడానికి ప్రయత్నించలేదు. తిన్నగా వెంకమ్మ గదిలోకి వెళ్ళింది. వెంకమ్మ అప్పుడే లేచి మంచంమీద కూర్చునివుంది.

"వారు వెళ్ళిపోడానికి ప్రయాణమౌతున్నారత్తా" చిన్నగా ధ్వనించే కంఠంతో అంది.

"వెళ్ళడమే మంచిది" అంత ధ్వనిలోనే వెంకమ్మ కూడా సమాధానమిచ్చింది.

శాంతమ్మ ఆశ్చర్యంగా చూసింది. తరవాత ప్రాధేయతా భావం వెళ్ళడయ్యేట్లుగా "అలా అంటే బావుంటుందా?" అని మాత్రం అడిగింది.

"నీకు తెలీదమ్మా" మెల్లగా దగ్గింది. తరువాత యిలా అంది "ఉన్నమాటంటే ఉలుకెక్కువ. ఏనాడో విడచిపెట్టిన వాళ్లు యిప్పుడొచ్చారంటే..." అంటూ శాంతమ్మకేసి చూసింది. శాంతమ్మ ఏమీ సమాధానమివ్వలేదు శ్రద్ధగా మాత్రం వింటోంది. మళ్ళీ వెంకమ్మ ఈలా అంది: బేంకులో ఉన్న పదివేలూ - ఈ కాంపా కాజేయడానికీ... ముందుగానే చంపేస్తారేమో;" వెంకమ్మ కళ్ళలో నీళ్లు తిరిగాయి.

ఈమాట శాంతమ్మకు విచిత్రమైన భయాన్ని కలిగించింది. వెంకమ్మ నిగూఢ మేధాశక్తి సంపన్నతకు విస్తుపోయి చూసింది శాంతమ్మ.

ఎవరితో చెప్పకుండానే భార్యాభర్తలిద్దరూ వీధి గుమ్మం వెలుపలకు వెళ్ళారు. బండిగుమ్మంలో ఉంది. వెంకమ్మ మెల్లగా నడచి గడపదగ్గర నిలబడి చూసింది. ఏదో ఆలోచించి ఒకడుగు ఎదుటకు వేయబోయింది. కాని ఆ వెంటనే కాలుజారి క్రిందపడింది.

బండి ఎక్కబోతున్న రవణయ్య గిరుక్కున తిరిగి "అమ్మ" అంటూ కంగారుగా వచ్చాడు. కాంతంకూడా ఎక్కినబండి దిగివచ్చింది. వెంకమ్మ స్థూలశరీరాన్ని ఆ ముగ్గురూ ఆయాసంగా ఎత్తి లోపలకు తీసుకరావడం ఎంతో కష్టమైంది.

భార్యాభర్తలిదరూ ప్రయాణానికి విరమించారు. రప్పించినబండిని రవణయ్య తిరిగి పంపించివేశాడు.

ఆరోజు మళ్ళా వెంకమ్మ మంచంమీద నుంచి లేవనేలేదు. మధ్యాహ్నానికి రవణయ్య డాక్టర్ని తీసుకవచ్చి చూపించాడు.

డాక్టరు తిరిగి చావిట్లోకివచ్చి "పెరాలైసస్ స్ట్రోక్" అని చెప్పాడు.

రవణయ్య "ఆఁ" అని నోరావలించి చూశాడు. అది ఆశ్చర్యమో, ఆనందమో, విచారమో కూడా మొగాన్ని చూసిన డాక్టరు గ్రహించలేక పోయాడు.

దగ్గరున్న కాంతం "ఏంరోగమండీ" అని అడిగింది.

"పక్షవాతమట" అన్నడి రవణయ్య.

"పక్షవాతమే" కళ్ళుపెద్దవిచేసి మరీ రెట్టించింది కాంతం.

ఈ మాటలు విన్న శాంతమ్మ కళ్లనీళ్లు తుడుచుకొని లోపలికి వెళ్లిపోయింది.

మరునాటినుంచి వెంకమ్మకు నోటి మాట కూడా లేదు.

కాంతమే యిప్పుడు గృహాయజమాని అయ్యింది. పనిపిల్లను మాటపట్టింపుతో మానిపించి వేసింది. యింటి చాకిరీ అంతా శాంతమ్మతోనే చేయిస్తోంది.

శాంత స్వరూపమైన శాంతమ్మకు చాకిరీచేయడం బాధగా తోచలేదు. కాని వెంకమ్మ స్థితికి మటుకు లోలోన కుమిలి పోతూవుంది.

ఒకరోజు శాంతమ్మ వెంకమ్మ కాళ్లు ఒత్తుతుండగా, రవణయ్య తల్లిదగ్గరగా వచ్చాడు. వెంకమ్మ శాంతమ్మనుచూస్తూ అప్పటికే కళ్లనీళ్ళు గారుస్తూంది.

రవణయ్య చూసి "ఛా! అదేమిటమ్మా! తొందరగా తగ్గిపోతుందన్నాడులే డాక్టరు" అని ధైర్యం చెప్పాడు. ఆమె దుఃఖకారణం అది కాదని ఆమెకు తెలుసు. కాని తన ఉద్దేశాన్ని వెల్లడిచేయగల మాట కరువైందని ఆమె బాధ.

రవణయ్యను కూర్చోమని సంజ్ఞ చేసింది. రవణయ్య మంచం ప్రక్కగా క్రింద చతికిలపడ్డాడు. కాంతం కూడా అదే సమయానికి అక్కడకు వచ్చింది. వెంకమ్మ తెలివిగా పది వేళ్లు చూపించి, అయిదు వేళ్లు శాంతమ్మకు యిమ్మన్నట్లు సంజ్ఞచేసింది.

రవణయ్య భార్య మొగం చూశాడు.

కాంతం వెంకమ్మదగ్గరగా వచ్చి "నువ్వు చెప్పినట్లేచేస్తా మత్తయ్యా" అంది.

అది దిక్కులేనిదనీ, మీ కడుపులో పెట్టుక కాపాడాలనీ, కన్నీళ్ళతో, మూగసైగలతో కాంతమ్మను ప్రార్థించింది.

ఈ స్థితి చూసిన శాంతమ్మకు దుఃఖం ఆగలేదు. తనపైగల వెంకమ్మ దయార్ద్ర హృదయానికి శాంతమ్మ అభిమానంతో తల వంచుకుంది. వెక్కి వెక్కి వచ్చే దుఃఖాన్ని పమిటకొంగును కళ్లలో కరిగిపెట్టి అపుకోడానికి ప్రయత్నించింది. కాని దుఃఖం ఆగలేదు. అక్కడనించి లేచి తనగదిలోకి వెళ్లిపోయింది.

కాలుజారిన నెల్లాళ్ళకే వెంకమ్మ కాలం చేసింది. కాంతం యిచ్చినవాగ్దానం ఎంతవరకూ సఫలీకృత మౌతుందో శాంతమ్మకు తెలుసు.

కాంతం తనపై చూపే నిరాదరణకు శాంతమ్మ బాధపడుతూనే వుంది. వెంకమ్మ పెద్దకార్యమయ్యేవరకూ మెదలకుండానే ఉంది.

మరునాడు, భార్యాభర్తలదగ్గరశలవు తీసుకుని, కట్టు గుడ్డతో రవిని చంకను వేసుక, తూర్పుదిశగా బయలుదేరింది శాంతమ్మ.

రవణయ్య - కాంతం, వెళ్ళే శాంతమ్మను చూస్తూ, ఆమె పిరికితనానికీ, తమ తెలివితేటలకీ, ఫక్కున నవ్వుకొని మాత్రం ఊరుకున్నారు.

8

ప్రొద్దుక్రుంకేముందు గుంటూరు రవితో చేరుకున్న శాంతమ్మ రాత్రి పది గంటలకు గాని గంగాధర్ జమిందారు భవంతి చేరుకోలేకపోయింది.

దారీతెన్నూ తెలీని శాంతమ్మకు ఊరు శివారున విశాల ప్రదేశంలో చక్కగా నిర్మించుకున్న ఆ సౌధాన్ని చేరుకోడానికి, గుర్తుచెప్పేవాళ్ళ నిర్లక్ష్యాన్ని బట్టి, చంకను బిడ్డను వేసుక ఊరుచుట్టి తిరిగిరావలసి వచ్చింది.

శాంతమ్మకు అభిమానం ప్రసాదించిన పట్టుదలవల్ల మేనత్త యిల్లు విడిచేప్పుడు కొంగునున్న రూపాయి పావలా తప్ప, మరేమీ డబ్బులేకపోవడంవల్ల అంతవరకూ ఆహారం ముట్టనే లేకపోయింది. ఆ రూపాయి పావలా దారి ఖర్చులకు సరిపోయింది.

ఆకలవుతున్న రవికూడా శాంతమ్మదైన్య పూరితవదనాన్ని చూసి, ఎక్కువ మారాం చేయలేకపోయినా చీకటిపడిన తర్వాత రెండుసార్లు మాత్రం "బువ్వ" అని అడిగాడు.

"ఇదిగో అన్నయ్య యింటికి వస్తు

★ దత్తత ★

శ్నాంగా అక్కడ తిందువుగాని" అని సముదాయించింది.

అన్నయ్య ఏమిటో యిల్లేమిటో రవికి అర్థంకాలేదు. ఏదో వింతను ఎదరచూడ గలననే కుతూహలంవల్ల, ఆకలి కొంచంగా మరవగలిగాడు.

ఆ భవనం ముందుభాగాన ఉన్న గేటు దగ్గర శాంతమ్మ చాలాసేపు నిలబడింది. లైటు దివ్యంగా వెలుగుతున్నా, అంతగా జనసంచారం లేకపోవడంవల్ల, అంతాపడు కొని ఉంటారని అనుకొంది.

మెల్లగా ఊచలతో కూర్చిన గేటుఎదుటకు గెంటింది. 'కీచు' ధ్వనితో గేటు విడివడ్డం "ఎవరు" అని బిగ్గరగా పిలుపు వినపడ్డం, ఒకేసారి జరిగింది. శాంతమ్మ ఎదుటకు కదలలేక ఆలాగే నిలబడిపోయింది.

కాపలాదారు గేటు దగ్గరగా వచ్చి "ఎవరు" అని మళ్లీ అదే ప్రశ్న వేశాడు.

"జమిందారుగారున్నారా?"

"ఎందుకూ"

"పని ఉంది"

విరక్తిగా నవ్వాడు. వెంటనే యిలా అన్నాడు "నీ గొప్ప పనికి పగలు ఖాళీ లేకపోయిందా? వెళ్లు! పనిఉంటే రేపురా"

కాస్త తెరుచుకున్న గేటు దగ్గరకు వేసే ప్రయత్నంలో ఉన్నాడు.

"తెనాలినుంచి వచ్చాను. ఇక్కడికి వచ్చేటప్పటికి యింత ఆలశ్యమైంది. కాస్త"

శాంతమ్మ ఆత్రుతగా మాట్లాడేమాటలు పూర్తికాని క్రితమే గేటుదగ్గరగా వేసి.

"ఇదెవరిల్లు అనుకుంటున్నావు నువ్వు"

గంగాధరంగారిది కదా"

"అబ్బో! పేరుకూడా తెలుసు...జమిందారుగారు మామూలు మనిషిలా ఎప్పుడు పడితే అప్పుడువచ్చి మాట్లాడరు వెళ్లు."

అని చెప్పి వెనక్కి తిరిగాడు.

"అయ్యా" శాంతమ్మ దీనంగా పిలచింది.

పనివాడు ఎదుటకు తిరిగి, "పొమ్మంటే బుద్ధిలేదూ?" అంటూ బిగ్గరగా అరచాడు.

ఈ కేకకు రవి కేరుమన్నాడు. రవిని భుజంపైన ఒత్తుకుంటూ "చాలా అవసరమైన పనిమీద వచ్చాను...ఉదయాన్నుంచి బిడ్డకు తిండిలేదు..."

యింకా శాంతమ్మ మాట పూర్తికానిదే "ఓ—ఆలా అని అఘోరించకూడదూ" అన్నాడు.

శాంతమ్మ బాధగా చూసింది.

"వెంకయ్యా! ఎవరూ?"

వెనకనించి గంగాధరంగారి విధవచెల్లెలు హాలులోనుంచి అడిగింది.

వెంకయ్య వెంటనే సమాధానం యివ్వలేకపోయాడు.

శాంతమ్మ ఆశగా అటు చూసింది.

"ఎందుకూ అవసరంగా గెదెలా ఆలా అరుస్తావ్ ... కాస్త ముద్దపడేసి పొమ్మనమను" అని చెప్పి ఆమె లోపలకు వెళ్ళిపోయింది.

తనే ఒకధికారిలా నేరస్థులను దూషించే పోలీసు—సబు యిన్స్పెక్టర్ని చూసిన వెంటనే సలాంకొట్టి నట్లుగా వెంకయ్య తలవంచాడు. ఆమె వెళ్ళిన తర్వాత శాంతమ్మకేసి కోపంగా చూసి" అక్కడే ఉండు లోపలకు రాకు" అని తిరిగి వెళ్ళిపోయాడు.

అసలు బంగారానికన్నా—బంగారు పూత పూచిన ఇత్తడిముక్క ఎక్కువగా మెరుస్తుంది. ఆ మెరుపులో అసలు బంగారాన్ని కూడా మరిపిస్తుంది. మరిపించడమే కాదు నేనే బంగారాన్నని మూడుసార్లు మురుస్తుంది. అయితే బంగారు పూతమాసి అసలు రంగు బయట పడ్డంతోనే మలినమై, పూర్వ అహంకారానికి పశ్చాత్తాపపడుతూ, ప్రజల కంట పడకుండా ఏమూలనో పడి ఉంటుంది.

ధనికుల నాశ్రయించినవాళ్ళూ పూర్వ స్థితినిమరచి దర్జాను డంబాన్ని ప్రదర్శించే అల్పులగతికీ—పూత మాసిన ఇత్తడి ముక్కకూ అట్టే తేడా లేదేమో.

తిరిగివచ్చిన వెంకయ్య "తీసుకో" అంటూ గేటు తెరచి చేతులో ఉన్న అన్నంతో నిండిన ఆకును, శాంతమ్మ చేతిలో పడేసి తిరిగి గేటువేశాడు.

"నాకు తెలిసున్నవాళ్లు ఈ వూళ్లో ఎవరూ లేరు..."

"ఇక్కడ ఉండటానికి "వీల్లేదు. ఫో! ఫో!" అంటూ గేటు గొండెంవేసి, లైటు స్విచ్చికూడా ఆఫ్ చేశాడు.

అన్నంపెట్టినా బిడ్డకు అంధకారంలో ఆకలి తీర్చగల అవకాశం పోయింది. రోడ్డు ప్రక్కగా వెలుగుతున్న లైటుదగ్గరకు శాంతమ్మవచ్చి రవికి నాలుగు మెతుకులు పెట్టింది. కాని తాను తినలేకపోయింది.

ఆ లైటు స్తంభం ప్రక్కనే బిడ్డతో కూర్చున్న శాంతమ్మ ఆమేడ కేసిచూసింది. పై భాగాన్ని వెలుగుతున్న లైట్లు, కిటికీ చువ్వలనుంచి కాంతిని విరజిమ్ముతున్నాయి. తన బిడ్డ సుఖనిద్రలో ఉంటాడని ఆమె ఊహించింది. కాని చలిలో తన తమ్ముడితో యీ అర్థరాత్రి వీధిప్రక్క తల వాల్చడానికికూడా తగని స్థలంలో తాను కూర్చున్న సంగతి తన బిడ్డకు తెలిస్తే; ఎంత బాధపడతాడో అని ఆమె మానసిక కల్పనా చిత్రాన్ని చూసి సంతృప్తిపడుతోంది. "అమ్మా" ఆ మేడపైనే ఒక పిలుపు వినిపించింది. అది చిన్న కంఠమే! అది రాము పిలుపు! శాంతమ్మ రవిని చంకను వేసుకొ ఆనందంగా లేచింది.

"ఏం బాబూ" మరోకంఠం వినిపించింది ఆపైనే! ఆమె ఆలాగే నిలబడి శ్రద్ధగా వింటుంది.

"నువ్వు లేకపోతే నేను పడుకోను... నా ప్రక్కలో పడుకోవే అమ్మా"

"అమ్మ ప్రక్కలో లేకపోతే; ఒక్క క్షణం నిద్దరపోవు... వస్తున్నా" విసుగ్గా వినిపించిందామాట.

ప్రశాంత నిశీథంలో—పైనించి వినిపించే ఆ మాటలు, శాంతమ్మ స్పష్టంగా వినగలిగింది. ఈ రెండు సంవత్సరాలలో రాము చక్కగా మాట్లాడగలుగుతున్నాడు. మరో అమ్మను సంపాదించగలిగాడు. కాని అసలు అమ్మ గుర్తుంటుందో—ఉండదో. ఇదే ఊహిస్తుంది శాంతమ్మ. గుర్తు ఉండదనికూడా ఆమె నిర్ణయించుకొంది. కాని "భగవంతుడా! నా బిడ్డ నన్ను మరచినా పరవాలేదు. వాడు సర్వదా సుఖంగా జీవించేటట్లు దీవించు బాబూ" అని ఆర్ద్రకంఠంతో మెల్లగా అంది. ఆ మాతృహృదయం ఆనందవిషాద సమ్మిళితమైన ఏదో తీయటి వేదన ఆ సమయంలో అనుభవించింది. మెల్లగా బజారువైపునకు దారితీసింది.

క్షోభపడుతున్న వ్యథిత హృదయాన్ని అదుపులోకి తీసుకరాగల అవకాశాన్ని కూడా విస్మరించి, కారులషెండు దగర ఉన్న హాలులో, రవిని పడుకోబెట్టి, శ్రమించిన శరీరానికి స్తంభాన్ని ఆధారంగా చేసుకొని, తెల్లార్లూ కంటిమీద కునుకులేకుండా కూర్చుంది శాంతమ్మ.

సూర్యోదయం కాక ముందే శాంతమ్మ నిద్రా కలిత నేత్రాలతో నిద్దర పోతున్న రవిని భుజంమీద వేసుకొని తిరిగి జమిందారు యింటికి బయలుదేరింది.

ఉదయాన్నే గేటు తెరచి ఉంచడంవల్ల లోపలకు వెళ్ళింది. రాత్రి అటకాయించిన పనివాడు ఎక్కడా కనిపించలేదు. ఒక దాసి గుమ్మాలు తుడుస్తూవుంది.

గుమ్మందగ్గరగా వచ్చిన శాంతమ్మను

దాసీది ఆశ్చర్యంగా చూసి "తెల్లారండే ధర్మానికి వచ్చావ్?" అంది.

శాంతమ్మ తల అభిమానంతో క్రిందకు వాలిపోయింది. దాసీది అలా అనడంలో ముందుగా బాధపడ్డా, కంకరతో కలసిన బట్టలు, ధూళితో మలినమైన తన శరీరం చూసుకున్న మీదట ముష్టిదానిగా పరులకు కనిపించడంలో ఆశ్చర్యం లేదనుకుంది.

"కాస్త తాళిరా! ఫో!"

ఈమాటలు కూడా దాసీయే అంది. అప్పుడు శాంతమ్మ తల పైకెత్తి చూసింది.

ఆమెకళ్ళల్లో నీళ్ళు చూసిన దాసీ నిర్విణ్ణురాలైంది.

"నేను ముష్టి దాన్ని కాదమ్మా!...నా బ్రతుకలా కాలింది" అని శాంతమ్మ గద్గదికంగా అంది. దాసీ మొగంపైపశ్చాత్తాపచ్ఛాయలు కనిపించాయి.

"ఎవరికోసం వచ్చారు?"

"జమీందారుగారి కోసం"

దాసీది అంతవరకూ మెట్లపైనుండి మాట్లాడింది. మెట్లుదిగి దగ్గరగా వచ్చింది.

"అమ్మగారితో చెప్తున్నారా?... మీ పేరు?"

శాంతమ్మ కాస్సేపు ఆలోచించింది. మెల్లగా యిలా అంది "ఎవరితో నూ చెప్పద్దు...నేను బైటనే ఉంటా" దాసీ మరీ ఆశ్చర్యపడింది.

"మరి జమిందారుగారికోసం వచ్చావన్నారుగా?"

"ఔను...వారితో యిక్కడే మాట్లాడి వెళ్లిపోతా" దాసీ నిదానించి కాస్సేపు శాంతమ్మ కేసిచూసింది.

ఏమనుకుందో ఒక్కసారి నవ్వింది.

శాంతమ్మ కళ్ళనీళ్ళతోనే ఆశ్చర్యంగా చూసింది.

"అమ్మగారి కీవిషయం తెలీయకపోవడమే మంచిది. అదుగో! ఆ కారుషెడ్ ప్రక్కగా కూచోండి" అని తలతో కారు షెడ్ చూపి, తన పనిలో ఉండిపోయింది.

దాసీ అలా అనడంలో ఉద్దేశమేమిటో శాంతమ్మకు అంతుపట్టలేదు. మెల్లగా వెళ్లి కారుషెడ్ దగ్గర కూర్చుంది. రవిని ఒళ్ళో కూర్చోపెట్టుకొని అలాగే గోడకు చేరగిలపడి కూర్చుంది. రాత్రి నిద్దరలేక పోవడం వల్ల కాస్త కునుకుకూడా పట్టింది.

కారు 'బుర్' మన్న ధ్వని విన్న శాంతమ్మ త్రుళ్లిపడి చూసింది. అప్పటికే చాలాప్రొద్దు ఎక్కింది. డ్రైవరు కారుని తీసుకవెళ్లి గుమ్మందగ్గరగా నిలిపాడు.

శాంతమ్మ ఆత్రతగా లేచి నిలబడింది.

గంగాధరం ప్రక్కగా రాముని తీసుక కారుదగ్గరకు వచ్చాడు. రాముని శాంతమ్మ ఆ కాస్సేపూ కరువుతీరాచూసింది. సిల్కు బట్టల్లో మిలమిలా మెరుస్తున్న రాము. శాంతమ్మ కళ్ళకు బాల భానుడుగా కనుపించాడు. ఆనందంగా నిట్టూర్చింది. కళ్లల్లో ఆనందబాష్పాలుకూడా నిలచాయి.

"మీరుకూడా రండి నాన్నగారూ?" అని జమీందారు చేయిపట్టుకొని రాము లాగుతున్నాడు.

జమీందారు వాత్సల్యపూరితంగా "నువ్వెళ్ళు బాబూ! మళ్లీ పదకొండుగంటలకల్లా వచ్చేస్తావుగా - ఇక్కడేవుంటా" అంటూ రాముని ఎత్తుకకారులో కూర్చోపెట్టాడు.

కారు కదిలింది. గేటు దాటి వెళ్లిపోయింది. అంతవరకూ శాంతమ్మను ఎవరూ గమనించలేదు. జమీందారు వెళ్లే కారుని చూస్తూ కాస్సేపు అలానిలబడిపోయాడు.

శాంతమ్మ జమీందారు ఎదురుగా రాలేక అక్కడేనిలబడి ఉంది.

"మీకోసం ఎవరో వచ్చారు."

దాసీది మెల్లగా స్తంభం వెనకనించి అంది.

"ఎవరూ" తరిసరాన్నంతా ఆశ్చర్యంగా పరిశీలిస్తూ అడిగాడు జమిందారు.

"అదుగో_"

దాసీది శాంతమ్మఉన్న వేపుచూపించి తలుపు వెనక్కి వెళ్లింది. గంగాధరం అటు చూశాడు. చాలా ఆశ్చర్యపడ్డాడు. మొదట్లో ఎవరో గుర్తించలేదు. అలాగే చూస్తున్నాడు.

శాంతమ్మ, జమిందారు తీక్షణ దృష్టికి కంపించి తలవంచుకుంది.

"ఓ-శాంతమ్మగారా!"

బిగ్గరగా అన్నాడు. ఈ మాటలోధ్వనిని బట్టి, జమిందారు భావాన్ని అర్థం చేసుకోడానికి శాంతమ్మ ఊహిస్తూంది.

"లోపలకు రండి"

శాంతమ్మ మనస్సు కుదటపడింది. మెల్లగా కదలింది. జమీందారు అక్కడే నిలబడి ఉన్నాడు.

శాంతమ్మ మెట్లు దగ్గరగావచ్చి ఆగింది. రవి మెలకువగానే ఉన్నాడు. తల్లి చంకనించి క్రిందకు దిగాడు.

"వెంకమ్మగారు బావున్నారా?"

"పోయింది" శాంతమ్మ హీన స్వరంతో చెప్పింది.

ఆ సమాధానం బహుశా రావచ్చును అనే జమిందారు ఆ ప్రశ్న వేశాడు. ఆ ప్రశ్న ఉదయించడానికి శాంతమ్మ ఎదురుగా మలినరూపంతో ప్రత్యక్షం కావడమే.

"పాపం" జమిందారు ఈమాట అని వెనక్కి చూసి "సుబ్బులూ" అని బిగ్గరగా పిలచాడు.

దాసీది వచ్చింది.

"వీరిని తీసుకవెళ్లి అమ్మగారితో చెప్పు ...వీరిపేరు శాంతమ్మ అని."

జమిందారు శాంతమ్మ కేసి చూసి "దాసీతో వెళ్లండి" అని చెప్పి హాలులో నించి ఉన్న మెట్లు ఎక్కి మేడపైకి వెళ్లిపోయాడు. దాసీసుబ్బులుతో శాంతమ్మలోపలకు వెళ్లింది. (ఇంకావుంది.)

★ మగవాడు - ఆడమనిషి ★

(11-వ పేజీ తరువాయి)

మొదటివాడి కడుపులో పిడికిలితో తను ఏ రీతిగా పొడిచినదీ, కొంత దెబ్బలాట అయాక రెండోవాడి ముక్కు మీద ఏ విధంగా గుద్దినదీ, తరువాత ముగ్గురూ ఎలా పారిపోయినదీ, ఇంతలో తనని ప్రజానీకం చుట్టుముట్టి తనని అభినందించి, కట్లుకట్టించి సగౌరవంగా తనని ఎలా సాగనంపినదీ—

అంతా, కథంతా, జరిగినట్టుగా, చిన్న చిన్న డీటేల్సుతో కూడా చెప్పేడు.

మామయ్య ఆశ్చర్యపడి సంతోషించేడు.

"నేనయి ఈకటు కథ నమ్మను" అని అత్తయ్య నోటితో చెప్పలేదు.

వరహాలు గర్వంతో, ఆనందంతో పొంగి పట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

"ఆపిన వెంటనే పోలీసువాళ్ళకోసం కేకలు వెయ్యలేకపోయావురా?" అన్నాడు మామయ్య అంతా విన్నాక.

"అది నీలాటి వాడు చేసేపని" అన్నట్టుగా చూసేడు మూర్తి. తరువాత, బాగా రాత్రి అయాక, మెలకువగా ఉండే ఏదో పలవరిస్తున్నట్టుగా "వరహాలూ, వరహాలూ" అని కేకలు వేసేడు మూర్తి.

"వరహాలకోసం పలవరిస్తున్నాడే. దాన్ని పెళ్ళి వాడి దగ్గరకూర్చోబెట్టాలా దూ" అంటున్నాడు పక్క గదిలో మామయ్య.

అత్తయ్య ఏదో గొణిగింది.

"ఫరవాలేదే. కావలిస్తే నవ్వ్వు అక్కడే ఉండు" అన్నాడు మామయ్య ఆమెతో.

అంతవరకూ గాఢనిద్రలో ఉన్నట్టు నటిస్తోన్న వరహాలు కళ్ళు నులుపుకొంటూ అవతల గదిలోంచి వచ్చి మూర్తి మంచం పక్క కుర్చీలో కూర్చొంది. అత్తయ్య చాపవేసుకు పడుకొంది.

చీకట్లో వరహాలు చెయ్యిపట్టుకున్నాడు.

తృష్ణ అంతా ఆ రెండు చేతుల్లోనూ ఉంది.

తెల్లారుతూందనగా నిద్ర వచ్చింది. మధ్యాహ్నం తెలివొచ్చింది.

వళ్ళంతా బరువుగా ఉన్నా మనసెంతో తేలిగ్గా ఉంది.

"ఏరా ఎలా ఉంది" అని అడిగింది అత్తయ్య.

"సినిమాకి వెళ్ళాలనుంది" అన్నాడు మూర్తి.

ధుమధుమలాడుతూ అత్తయ్య గదిలోంచి వెళిపోయింది.

కలకల్లాడుతూ వరహాలు గదిలోకి వచ్చింది.

ఆకుపచ్చ చీరకట్టుకుంది. కోరచూపులు కళ్లలో పెట్టుకుంది.

"ఓహో! చాలా ఘట్టిగా ఉన్నావే! ఏదీ ఇలా వచ్చి ఓముద్దియ్" అన్నాడు మూర్తి ఆమెని చూడగానే.

అత్తయ్యకి వినిపించవా నా మాటలు! అనుకున్నాడు.

"శ్! మెల్లిగా మెల్లిగా! అమ్మ వినగలదు" అంది వరహాలు మెల్లిగా, కోపంగా.

నేనో ఆడదాన్ని గెక్క పట్టుకులాక్కొచ్చేను అందరూ తెలుసుకోవచ్చు—

అని చాటించాలనే మొగవాడి మనస్తత్వం వరహాలుకి అర్థం కాలేదు.

"బావకి గుట్టు ఉంచాలని లేదు. ఛీ!" అనుకొంది.

"అమ్మ విన్నా భయం లేదు. అమ్మమ్మ విన్నా భయంలేదు. పెళ్ళయాక కూడా ఇలాగే అంటావు కాబోలు" అన్నాడు మూర్తి.

వరహాలు ఏడుపు ముఖం పెట్టింది.

"ఏడవకు ఏడవకు నా చిట్టతల్లీ" అన్నాడు మూర్తి. వరహాలు వెళిపోబోయింది.

"చూడూ! ఇవాళ రామయ్య దగ్గరకి వెళ్ళాలి. పెట్లోంచి నా బట్టలూ అవీ తీసి సిద్ధంగా ఉంచు. నే ముఖం కడుక్కొనే లోపున" అని ఆజ్ఞ విసిరేసు.

"సిద్ధంగా ఉంచను" అంది వరహాలు వెళిపోతూ.

అంటే సిద్ధంగా ఉంచి తీరుతుందన్న మాట, అని లేచేడు మూర్తి.

"థాంక్యూ మోహినీ!" అనుకున్నాడు ఓసారి.

సాయంకాలం రామయ్యతో కూడా తన కట్టుకథ చెప్పేడు.

"*I am no end pleased with you*" అన్నాడు రామయ్య. మూర్తి పెట్టిన అప్లికేషన్‌మీద ఉద్యోగం ఇస్తూ ఆర్డర్స్ వేశారనీ, కమ్యూనికేషన్ వస్తుందనీ కూడా చెప్పేడు రామయ్య.

అక్కణ్ణించి వస్తూ "నా కొక్కపోతే ఇంకెవడికిస్తాడు ఉద్యోగం! థాంక్యూ మోహినీ!" అనుకున్నాడు మూర్తి.

ఎగూర్ నుంచి ఇంటికి వచ్చేసరికి సాయంకాలం అరయింది. మోహిని దగ్గరికి వెళ్ళడానికి ఇంకో క్రొత్త డ్రెస్ వేసుకు తీరాలి.

ఇంటికి వచ్చి చెప్పేడు ఉద్యోగం విషయం.

ఆ సంగతి వినగానే—

మామయ్య పెద్దవాడు కాబట్టి గంతులు వెయ్యలేదు.

అత్తయ్య సంతోషించకుండా ఉండలేక పోయింది, మామయ్య పెళ్లాం కాబట్టి.

వరహాలు కళ్ళతోటే కావిలించుకొంది, పక్క అంతా ఉన్నారు కాబట్టి.

"రామయ్యగారు ఎంత మంచివార్రా!! ఆయనకి మన థ్యాంక్స్ ఎలా చెప్పడమో ఏమిటో నాకు తోచకుండా ఉంది" అన్నాడు మామయ్య.

రామయ్యకి కాదు థాంక్స్.

మోహినికి థాంక్స్!

మోహిని కెందుకు థాంక్స్?

మోహినికే థాంక్స్!

అనుకున్నాడు మూర్తి.

ఇంటో ఉన్న అయిదు నిమిషాల్లోనూ వీలు చూసుకొని అయిదుసార్లు ముద్దులాడేడు వరహాల్ని. వీలు చూసుకొంది వరహాలు.

కొత్తబట్టలు వేసుకొని, ఇంటినుమ్చిం దిగుతూంటే "చీకటి పడిపోతోందిరా కుర్రాడా! ఇప్పుడు వెళ్తున్నావక్కడికి?" అన్నాడు మామయ్య.

"'కుర్రాడా' అని పిలవకు మామయ్యా" అన్నాడు మూర్తి.

తరువాత నాలుగురోడ్ల జంక్షన్ దగ్గర బస్ టెర్మినస్ గోడ్డుకి మళ్ళి, విసురుగా నడిచేడు, నిండు యవ్వనపు గర్వంతో టీవితో. ★

వెలుగు మబ్బులు

ఫోటో: టి. సి. యమ్. ఈశ్వరబాబు
—మద్రాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras





N44

Release thro: THE VAUHINI PICTURES LTD.,